సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+16+32 పేజీల ఆదివారం అనుబంధం
వెల: ₹ 7.00
సంపుటి: 12
సంచిక: 278
ఆదివారం 29-12-2019
SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

SUNDAY Special



## స్వీట్.. అండ్ స్ట్రాంగ్..

స్పేస్ ఇచ్చుకోవడం ఉంటే.. ఆ దాంపత్యం ఎప్పటికీ స్వీట్ అండ్ స్ట్రాంగ్ అంటున్న మిస్టర్ అండ్ మిసెస్ అల్లు అరవింద్‌తో సాక్షి ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ – ఫ్యామిలీలో



## విశ్వవిజేత హంపి...

ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచిన ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్. – స్పోర్ట్స్‌లో

# చేదెక్కనున్న చక్కెర!

### రాష్ట్రంలో గణనీయంగా తగ్గిన చెరకు సాగు విస్తీర్ణం

- చెరకు కొరత ఎదుర్కొంటున్న కర్మాగారాలు
- వచ్చే ఏడాది 50 శాతానికి పడిపోనున్న చక్కెర ఉత్పత్తి
- అతివృష్టి, అనావృష్టితో ఇతర పంటలవైపు రైతుల మొగ్గు



**క్రషింగ్ సీజన్ 2019-20 పరిస్థితి**

| | |
|---|---|
| 7 | రాష్ట్రంలోని చక్కెర కర్మాగారాలు |
| 15 లక్షల మెట్రిక్ టన్నులు | ఈ ఏడాది చెరకు క్రషింగ్ అంచనా |
| 4.06 లక్షల మెట్రిక్ టన్నులు | ఇప్పటివరకు జరిగిన క్రషింగ్ |
| 1.6 లక్షల టన్నులు | చక్కెర ఉత్పత్తి అంచనా |
| 33 వేల టన్నులు | ఇప్పటి వరకు జరిగిన ఉత్పత్తి |

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో చెరకు సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గడంతో చక్కెర పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. గత ఏడాదితో పోలిస్తే సుమారు 2 వేల హెక్టార్ల మేర సాగు విస్తీర్ణం తగ్గగా, వచ్చే ఏడాది మరింత పడిపోయే అవకాశముందని కర్మాగారాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో పదకొండు చక్కెర కర్మాగారాలకు గాను బోధన్‌లోని నిజాం షుగర్ ఫ్యాక్టరీ 2008, ఎన్‌డీఎస్‌ఎల్ పరిధిలోని మరో మూడు చక్కెర కర్మాగారాలు 2016 నుంచి మూతపడ్డాయి. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో ఏడు చక్కెర కర్మాగారాలు మాత్రమే పనిచేస్తున్నాయి. ప్రతి ఏటా చెరకు క్రషింగ్ సీజన్ నవంబర్ రెండో వారంలో ప్రారంభం కావాల్సి ఉండగా, చెరకు కొరతతో క్రిష్ణవేణి చక్కెర కర్మాగారం మినహా, మిగతావన్నీ డిసెంబర్ మొదటి వారంలో క్రషింగ్ ప్రారంభించాయి. గత ఏడాది రాష్ట్రంలో సుమారు 29 వేల హెక్టార్లలో చెరకు సాగు చేయగా, ఈ ఏడాది 27 వేల హెక్టార్లకు సాగు విస్తీర్ణం పడిపోయింది. మంజీర నది పరీవాహక ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో గణపతి, గాయత్రి చక్కెర కర్మాగారాల పరిధిలో సాగు విస్తీర్ణంపై తీవ్ర ప్రభావం చూపింది. మరోవైపు సాగునీరు పుష్కలంగా ఉన్న ప్రాంతాల్లోనూ రైతులు వరి, మొక్కజొన్న సాగువైపు మొగ్గుచూపుతున్నట్లు మిగతా 2వ పేజీలో ▶

## సోమాలియాలో మారణహోమం

### కారు బాంబు పేలుడులో 78 మంది దుర్మరణం

- సోమాలియా రాజధాని మొగదిషులో శనివారం సంభవించిన కారు బాంబు పేలుడులో 78 మంది ప్రాణాలు కోల్పోయారు. రాజధానికి నైరుతి ప్రాంతంలోని చెక్‌పోస్ట్ వద్ద ట్రాఫిక్ భారీగా ఉన్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో మృతుల సంఖ్య ఎక్కువగా ఉంది.

- వివరాలు 5లో

## బొగ్గు గనులపై సౌర వెలుగులు

- సింగరేణి ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్‌లు... ఓవర్ బర్డెన్ డంప్ యార్డుల్లో ఏర్పాటుకు చర్యలు
- రిజర్వాయర్‌లలోనూ సోలార్ ప్యానెళ్లు... 300 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం

3 లో



శనివారం గాంధీ భవన్‌లో నిర్వహించిన సత్యాగ్రహ దీక్షలో ప్రసంగిస్తున్న టీపీసీసీ చీఫ్ ఉత్తమ్. చిత్రంలో కుంతియా, భట్టి విక్రమార్క, సీతక్క, పొన్నం ప్రభాకర్ తదితరులు

# దొంగనాటకాలు ప్రజలు గమనించాలి

### బీజేపీ నిర్ణయాలన్నింటికీ టీఆర్ఎస్ మద్దతు ఇచ్చింది
### మా నిరసనలకు మాత్రం అనుమతి ఇవ్వడం లేదు
### 'సత్యాగ్రహ దీక్ష'లో టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపాటు
### 'సేవ్ ఇండియా ర్యాలీ'కి అనుమతివ్వని పోలీసులు
### గాంధీ భవన్ వద్ద ఉద్రిక్తత... కొందరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్:

రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దొంగనాటకాలను ప్రజలు గమనించాలని టీపీసీసీ చీఫ్, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. పెద్ద నోట్ల రద్దు నుంచి రాష్ట్రపతి ఎన్నికల వరకు అన్నింటా బీజేపీకి మద్దతిచ్చిన కేసీఆర్ ఇప్పుడు ఆ పార్టీకి వ్యతిరేకంగా నిరసనలు తెలిపేందుకూ అనుమతివ్వడం లేదన్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు ఎన్నార్సీకి వ్యతిరేకంగా 'సేవ్ ఇండియా'పేరుతో నిర్వహించిన నిరసన ర్యాలీలకు ఒక్క తెలంగాణలో తప్ప దేశమంతా అనుమతినిచ్చారని చెప్పారు. ఎన్నార్సీకి నిరసనగా శనివారం గాంధీభవన్‌లో నిర్వహించిన 'సత్యాగ్రహ దీక్ష'లో ఆయన మాట్లాడుతూ.. పౌరసత్వం పేరుతో దేశంలో కల్లోల వాతావరణానికి బీజేపీ కారణమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే రాజ్యాంగంలో పేర్కొన్న లౌకిక విధానాలకు కట్టుబడి ఉందని, అందరూ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడాలని ఆయన కోరారు. నిరుద్యోగ యువతకు భృతి, రైతు రుణమాఫీ, రైతు బంధు, ముస్లింలు, గిరిజనులకు రిజర్వేషన్లు, మూడెకరాల భూపంపిణీ, డబుల్ బెడ్‌రూం ఇళ్లు... ఇలా అన్ని విషయాల్లో టీఆర్ఎస్ తెలంగాణ ప్రజలను మిగతా 2వ పేజీలో ▶




## అరుణగ్రహంపై జీవం కోసం..

5 లో




## పోలీసులు నాపై చేయి చేసుకున్నారు

### ప్రియాంకా గాంధీ ఆరోపణ

## ఇది రెండో నోట్ల రద్దు!

ఎన్పీఆర్, ఎన్నార్సీపై రాహుల్ విసుర్లు

- వివరాలు 5లో








# కొత్త బంగారు లోకం.. మాకు కావాలి సొంతం!



**2020..** ఇదో కలల సంవత్సరం.. ఎందరో ప్రముఖులు అద్భుతాలు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న సంవత్సరం.. మరో రెండు రోజుల్లో కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్పే ఏర్పాట్లలో ఉన్నాం. కొత్త తీర్మానాలూ చేసుకుంటున్నాం. మన దేశ ఆర్థిక స్థితిగతులు, ఆదాయ అసమానతలు ఎలా ఉన్నప్పటికీ ఈ రెండు దశాబ్దాల్లో సాంకేతిక రంగం కొత్త పుంతలు తొక్కింది. స్మార్ట్ ఫోన్ల రాకతో అరచేతిలోకి ప్రపంచం వచ్చేసింది. సోషల్ మీడియా ఒక విప్లవంలా దూసుకొచ్చింది. ఇక కొత్త ఏడాదైనా అందరూ కలలు కనే కొత్త బంగారు లోకం ఆవిష్కృతమవుతుందా? కృత్రిమ మేధతో జరిగే అద్భుతాలు ఎలా ఉండబోతున్నాయి? అంతరిక్ష పరిశోధనలు ఎలా కొత్త పుంతలు తొక్కనున్నాయి? పాత, కొత్త సంగతుల సమాహారమే ఇవాళ్టి సండే స్పెషల్

# కలాం విజన్ ఇదీ..

**ది**వంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు ప్రజల్లో ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. 2020 నాటికి భారత్ ఎలా ఉండాలో, దాని రూపురేఖలు ఎలా మారిపోవాలో ఆయనకు ఎన్నో అంచనాలున్నాయి. 2000 సంవత్సరంలో కలాం నేతృత్వంలో శాస్త్ర, సాంకేతిక రంగంలోని టెక్నాలజీ ఇన్ఫర్మేషన్ అండ్ అసెస్‌మెంట్ కౌన్సిల్ (టీఐఎఫ్ఐసీ)కు చెందిన 500 మంది నిపుణులతో విజన్–2020 డాక్యుమెంట్ రూపొందించారు. అప్పటికి భారత్ రూపురేఖలు ఎలా మారిపోవాలో ఆయన వైఎస్.రాజన్ తో కలసి '2020: ఏ విజన్ ఫర్ ది న్యూ మిలీనియం'పేరుతో పుస్తకాన్ని తీసుకొచ్చారు. భారత్‌లో ఉన్న సహజవనరులు, మానవ వనరులు, భారతీయుల్లో నెలకొన్న పోటీతత్వం మన దేశాన్ని శక్తిమంతమైన దేశాల సరసన నిలబెడుతుందని అంచనా వేశారు. విద్యతోనే దేశ సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని 2020 నాటికి భారత్ అన్ని రంగాల్లోనూ దూసుకుపోయి అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరుతుందని ఆకాక్షించారు. అవినీతి రహిత సమాజం ఏర్పాటు కావాలంటే అక్షరాస్యత పెరగాలన్నారు. 'కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి'అంటూ యువతకు పిలుపునిచ్చారు. భారత్ ఆర్థికంగా ఉచ్ఛ స్థితికి చేరుకోవాలంటే 2020 నాటికి స్థూల జాతీయోత్పత్తి 11 శాతంగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ సౌకర్యాల కల్పన జరిగితేనే దేశంలో ఆర్థిక అసమానతలు తొలగిపోతాయని అభిప్రాయపడ్డారు. కలాం కన్న కలలకు అందరూ సలాం చేసినా ఆయన అంచనాలకు దేశం ఏ మాత్రం చేరుకోలేకపోయింది. పైగా సరికొత్త సవాళ్లు పుట్టుకొస్తున్నాయి.




## మా అవసరం 157 టీఎంసీలు

- సాగర్ కింద అవసరం 135 టీఎంసీలు.. కల్వకుర్తి అవసరాలు 22 టీఎంసీలు
- కృష్ణా బోర్డుకు లేఖ రాసిన రాష్ట్రం

**సాక్షి, హైదరాబాద్:** కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల్లో వచ్చే వర్షాకాల సీజన్ ముందు వరకు తమకు 157 టీఎంసీల అవసరాలుంటాయని రాష్ట్రం తెల్చింది. ఈ మేరకు వచ్చే ఏడాది మే చివరి వరకు తమ అవసరాలను పేర్కొంటూ కృష్ణా బోర్డుకు లేఖ రాసింది. ఇందులో శ్రీశైలంప్రాజెక్టుపై ఆధారపడ్డ కల్వకుర్తి ఎత్తిపోతలకు 22 టీఎంసీలు, నాగార్జునసాగర్ కింద హైదరాబాద్ తాగునీరు, ఏఎంఆర్‌పీ, మిషన్ భగీరథ అవసరాలకు కలిపి 45 టీఎంసీలు, ఎడమ కాల్వ కింద అవసరాలకు 90 టీఎంసీలు కలిపి మొత్తంగా 135 టీఎంసీలు అవసరం ఉంటుందని పేర్కొంది. ఇక ఈ వాటర్ ఇయర్‌లో కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల్లో రెండు తెలుగు రాష్ట్రాలు 645.36 టీఎంసీల మేర వినియోగించుకోగా ఇందులో తెలంగాణ వాటా 219 టీఎంసీలుగా ఉందని, అయితే అందులో రాష్ట్రం కేవలం 148 టీఎంసీలు మాత్రమే వినియోగించిందని తెలిపింది. ప్రస్తుతం శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల్లో కనీస నీటి మట్టాలకు ఎగువన 250 టీఎంసీల మేర నీటి లభ్యత ఉందని, అందులో తెలంగాణకు 160 టీఎంసీల మేర వాటా ఉంటుందని బోర్డు దృష్టికి తెచ్చింది.

## ఫిబ్రవరిలో అనాథల అంతర్జాతీయ సదస్సు

### హాజరు కానున్న ఉపరాష్ట్రపతి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు

**సాక్షి, హైదరాబాద్:** వచ్చే ఫిబ్రవరి 8, 9 తేదీల్లో రెండ్రోజుల పాటు అనాథల అంతర్జాతీయ సదస్సును నాగోల్ సమీపంలోని జె–కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నట్లు ఫోర్స్ (ఫోర్స్ ఫర్ ఆర్ఫన్ కమ్యూనిటీ ఎంపవర్‌మెంట్ ) అధ్యక్షుడు గాదె ఇన్నయ్య తెలిపారు. శనివారం బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య అనాథల అంతర్జాతీయ సదస్సు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథల హక్కుల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వీరికి రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించాలని, ఉచిత విద్యతో పాటు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కోరారు. అనంతరం గాదె ఇన్నయ్య మాట్లాడుతూ ఈ సదస్సుకు ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుతో పాటు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, పలువురు ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, టి.నందగోపాల్, రాంకోటి తదితరులు పాల్గొన్నారు.

## 181 మందికి 'రాష్ట్ర ప్రజాస్వామ్య పురస్కారాలు'

**సాక్షి, హైదరాబాద్:** స్థానికసంస్థల ఎన్నికల నిర్వహణలో సమర్థంగా వ్యవహరించిన అధికారులకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) అవార్డులను అందజేయనుంది. 'తెలంగాణ ప్రజాస్వామ్య అవార్డు'ల పేరిట జనవరి 11న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. ఎన్నికలు జరిగిన 32 జిల్లాల నుంచి సగటున ఆరుగురు అధికారులను సన్మానించనుంది. ఈ పురస్కారాలు అందుకునే వారిలో జిల్లా స్థాయి అధికారి మొదలు.. క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 181 మందికి ఈ అవార్డులు అందజేయనున్నారు.

## ఐదు జిల్లాలకు కొత్తగా డీఆర్‌డీవోలు

**సాక్షి, హైదరాబాద్:** కొన్నాళ్లుగా ఖాళీగా ఉన్న ఐదు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)లకు సారథులను ప్రభుత్వం నియమించింది. మహబూబ్‌నగర్, ములుగు, మహబూబాబాద్, గద్వాల, నారాయణపేట జిల్లాలకు కొత్తగా డీఆర్‌డీవోలను నియమిస్తూ శనివారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట డీఆర్‌డీఏలో అదనపు పీడీగా పని చేస్తున్న ఎస్.వెంకట్‌రెడ్డిని మహబూబ్‌నగర్ డీఆర్‌డీవోగా నియమించారు. మహబూబాబాద్ జెడ్పీ డిప్యూటీ సీఈవోగా వ్యవహరిస్తున్న విద్యుల్లతకు ములుగు జిల్లా, ఖమ్మం డీఆర్‌డీఏ అదనపు పీడీగా విధులు నిర్వహిస్తున్న విద్యాచందనకు మహబూబాబాద్ డీఆర్‌డీవో గా పోస్టింగ్ ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ డిప్యూటీ సీఈవో డి.పురుషోత్తంను జోగులాంబ గద్వాల్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారిగా నియమించారు. నారాయణపేట డీఆర్‌డీవోగా అదే జిల్లా జెడ్పీ సీఈవోగా పని చేస్తున్న కలిందినికి బాధ్యతలు అప్పగించారు.



హైదరాబాద్‌లో శీతాకాల విడిది ముగించుకొని ఢిల్లీ బయలుదేరిన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులకు శనివారం హకీంపేట విమానాశ్రయంలో ఘనంగా వీడ్కోలు పలుకుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్. చిత్రంలో బొంతు రామ్మోహన్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్ తదితరులు

# చేదెక్కనున్న చక్కెర!

▶ మొదటి పేజీ తరువాయి

నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుత ప్లాంటేషన్ సీజన్‌లోనూ చెరకు సాగు విస్తీర్ణం ఆశాజనకంగా లేదని చక్కెర శాఖ వర్గాలు చెప్తున్నాయి. వచ్చే ఏడాది (2020–21) రాష్ట్రంలో చక్కెర ఉత్పత్తి సగానికి పడిపోతుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో చక్కెర పరిశ్రమల పూర్తిస్థాయి క్రషింగ్ సామర్థ్యం 33 లక్షల నుంచి 36 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, ఈ ఏడాది 15 లక్షల మెట్రిక్ టన్నులకు మించి క్రషింగ్ జరిగే పరిస్థితి కనిపించడం లేదు.

**కష్టకాలంలో కర్మాగారాలు..**

ఈ ఏడాది చెరకు రైతులకు టన్నుకు సగటున రూ.3,080 చొప్పున మద్దతు ధర (ఎఫ్ఆర్‌పీ) చెల్లిస్తుండగా, పొరుగున ఉండే కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన చక్కెర కర్మాగారాలు అదనంగా టన్నుకు రూ.100 నుంచి రూ.150 వరకు చెల్లిస్తున్నాయి. స్థానికంగా క్రషింగ్ ఆలస్యంగా ప్రారంభం కావడం, పొరుగు రాష్ట్రాల్లో ఎక్కువ ధర లభిస్తుండటంతో రైతులు పొరుగు రాష్ట్రాలకు చెరకు తరలించేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు గత ఏడాది ఆల్కహాల్ తయారీకి సహకరించిన కర్మాగారాలకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీని విడుదల చేయాల్సి ఉంది. కాకతీయ, గణపతి చక్కెర కర్మాగారాల్లో కార్మికులు, యాజమాన్యం నడుమ నెలకొన్న వివాదాలు కూడా క్రషింగ్‌పై కొంత ప్రభావం చూపాయి. చెరకు సాగుకు రైతులు మొగ్గు చూపకపోవడం, క్రషింగ్ సామర్థ్యానికి సరిపడా చెరకు సరఫరా కాకపోవడంతో సీజన్‌ను కుదించాల్సిన పరిస్థితిలో యాజమాన్యాలు ఉన్నాయి. గత ఏడాది 24.83 లక్షల మెట్రిక్ టన్నుల చెరకును క్రషింగ్ చేసి, 2.56 లక్షల టన్నుల చక్కెర ఉత్పత్తి సాధించారు. ఈ ఏడాది రాష్ట్రంలోని ఏడు కర్మాగారాల పరిధిలో చక్కెర ఉత్పత్తి 1.6 లక్షల టన్నులకు మించకపోవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కర్మాగారాల వద్ద కిలో చక్కెర ధర రూ.35 పలుకుతుండగా, బయట మార్కెట్ ధరలతో పోలిస్తే తమకు అంతగా లాభసాటిగా లేదని కర్మాగారాల ప్రతినిధులు చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెరకు సాగును ప్రోత్సహించని పక్షంలో రాబోయే రోజుల్లో చక్కెర కర్మాగారాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటాయనే ఆందోళన అటు కర్మాగారాలు, ఇటు చెరకు రైతులు వ్యక్తం చేస్తున్నారు.

# 173 కేసులతో ఏసీబీ సరికొత్త రికార్డు

### రెవెన్యూ, హోం, మునిసిపల్ శాఖల్లో అత్యధికం

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సరికొత్త రికార్డు సృష్టించింది. లంచం అడిగిన వారిని అడిగినట్లు పకడ్బందీగా వలపన్ని అరెస్టులు చేస్తోంది. 2019 జనవరి 1 నుంచి డిసెంబర్ 28 వరకు ఏకంగా 173 కేసులు నమోదు చేసింది. ఈ మేరకు 2019లో ఏసీబీ తాను నమోదు చేసిన కేసుల జాబితాను శనివారం విడుదల చేసింది. ఆ జాబితా ప్రకారం, దాదాపు అన్నిశాఖల్లోని ఉద్యోగులపై కేసులు నమోదు చేసింది. ఈ ఏడాది అధికంగా రెవెన్యూ, హోం, మునిసిపల్ శాఖల్లోనే ఎక్కువ కేసులు నమోదు కావడం గమనార్హం. తెలంగాణ వచ్చాక ముఖ్యమంత్రి ఏసీబీకి పూర్తిస్థాయిలో స్వేచ్ఛనిచ్చారు. దీంతో దాడుల విషయంలో దూకుడు ప్రదర్శిస్తూ.., పకడ్బందీగా వలపన్ని ఏసీబీ కేసులు నమోదు చేస్తోంది.

**నమోదైన కేసుల వివరాలు ఇలా..**

| డిపార్ట్‌మెంట్ | 2018 | 2019 |
|---|---|---|
| రెవెన్యూ | 37 | 54 |
| హోం | 20 | 18 |
| మునిసిపల్ | 15 | 25 |
| పంచాయతీరాజ్ | 13 | 10 |
| విద్యుత్ | 08 | 12 |
| న్యాయ | 06 | 05 |
| నీటిపారుదల | 05 | 03 |
| వ్యవసాయ | 04 | 02 |
| విద్య | 04 | 04 |
| వైద్య, ఆరోగ్య | 04 | 13 |
| ఆర్టీఏ– ఆర్‌అండ్‌బీ | 04 | 03 |
| ఇతరులు | 19 | 24 |
| మొత్తం | 139 | 173 |

# విద్యుత్ వీలింగ్ చార్జీల పెంపు!

### ఈఆర్సీకి డిస్కంల ప్రతిపాదనలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు వీలింగ్ చార్జీల పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి ఈ నెల 16న సమర్పించాయి. 2019–2024 మధ్య కాలానికి సంబంధించి మల్టీ ఇయర్ కంట్రోల్ టారిఫ్ పేరుతో ఈ ప్రతిపాదనలు చేశాయి. దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం డిస్కంలు పత్రికా ప్రకటన ద్వారా అధికారికంగా ప్రకటించనున్నాయి. విద్యుత్ సరఫరా సేవల కోసం విద్యుత్ పంపిణీ వ్యవస్థ, అనుబంధ సదుపాయాలను వినియోగించుకునేందుకు డిస్కంలు వినియోగదారుల నుంచి వీలింగ్ చార్జీలు వసూలు చేస్తాయి. విద్యుత్ టారిఫ్‌లో వీలింగ్ చార్జీలు అంతర్భాగమై ఉంటాయి. డిస్కంల నుంచి కాకుండా బహిరంగ విపణీ (ఓపెన్ యాక్సెస్) నుంచి నేరుగా కొనుగోలు చేసిన విద్యుత్‌ను తమకు అవసరమైన చోట సరఫరా చేయించుకునే భారీ పరిశ్రమలు, రైల్వేస్ వంటి వినియోగదారులపై వీలింగ్ చార్జీల పెంపు ప్రభావం నేరుగా పడనుంది. డిస్కంల నుంచి విద్యుత్ సరఫరా పొందే వినియోగదారులపై దీని ప్రభావం పరోక్షంగా ఉండనుందని అధికార వర్గాలు తెలిపాయి. వీలింగ్ చార్జీల పెంపునకు సంబంధించి డిస్కంలు సమర్పించిన ప్రతిపాదనలపై ఈఆర్సీ ప్రజాభిప్రాయాలు సేకరించడంతో పాటు బహిరంగ విచారణ నిర్వహించనుంది. అనంతరం కొత్త వీలింగ్ చార్జీలను ఖరారు చేస్తూ మల్టీఇయర్ టారిఫ్ ఉత్తర్వులను జారీ చేయనుంది.

# అన్ని స్థానాల్లో గులాబీ జెండా ఎగరాలి

### పార్టీ నేతలతో భేటీలో కేటీఆర్



**సాక్షి, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ కేడర్‌ను సమన్వయపరిచి అన్ని స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేసే విధంగా పనిచేయాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. శనివారమిక్కడ మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లతో ఆయన భేటీ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల వ్యూహంపై విస్తృతంగా చర్చించారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రస్తుతమున్న రాజకీయ పరిస్థితులను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. అన్ని వార్డులు, డివిజన్లలో టీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచే విధంగా పనిచేయాలని, ప్రతిపక్షాల నుంచి అంతగా పోటీ లేకున్నా.. సీరియస్‌గా ఎన్నికలను తీసుకోవాలని సూచించారు. ప్రతిపక్షాలకు అవకాశం లేకుండా అన్ని స్థానాల్లో టీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. ప్రజలు ఓట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారని, వారికి ప్రభుత్వ పథకాలను మరోసారి గుర్తు చేస్తే కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, వి.శ్రీనివాస్ గౌడ్, పువ్వాడ అజయ్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, బాజిరెడ్డి గోవర్ధన్, హరిప్రియ నాయక్, నన్నపనేని నరేందర్, రాములు నాయక్, దివాకర్ రావు, పైలట్ రోహిత్ రెడ్డి, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు పాల్గొన్నారు.

# ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారు

### మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ● శాసనసభ కమిటీల చైర్మన్లతో సమావేశం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అద్భుతంగా అమలవుతున్నాయని, ప్రభుత్వం పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ, మండలి కమిటీల చైర్మన్‌లు సకాలంలో సమావేశాలు నిర్వహించాలని, సభ్యులందరూ హాజరయ్యేలా చూసుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ పనితీరుకు ప్రజల్లో మంచి పేరుందని, దీనిని నిలుపుకునేందుకు కృషి చేయాలన్నారు. శాసనసభ కమిటీ హాల్‌లో శాసనసభ స్పీకర్ పోచారంశ్రీనివాస్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శాసనసభ, శాసన మండలి కమిటీల చైర్మన్‌లు, చీఫ్ విప్‌లు, విప్‌ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 'లెజిస్లేటర్ కమిటీ ఎట్ గ్లాన్స్', 'లెజిస్లేటివ్ కమిటీస్–ఏ డైరెక్టరీ'అనే పుస్తకాలను పోచారం, గుత్తా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ కమిటీల సమావేశాలతో సభ్యులకు సూక్ష్మ స్థాయిలో సమస్యలపై అవగాహన కలుగుతుందన్నారు. శాసనసభ, మండలికి సంబంధించి 23 కమిటీలను నియమించామని పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పాలనలో కీలక బాధ్యత పోషించే బాధ్యత కమిటీలపై ఉందన్నారు. పని చేయని అధికారులతో పని చేయించే బాధ్యత తీసుకోవాలన్నారు. అధిక సమావేశాలు నిర్వహిస్తే అన్ని సమస్యలను పరిష్కరించవచ్చన్నారు. ప్రభుత్వ నిధులు సక్రమంగా ఖర్చు అవుతున్నాయా? లేదా? అని కమిటీలు పరిశీలించి చూడాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సూచించారు. ఈ సమావేశానికి మండలి కార్యదర్శి వి.నర్సింహాచార్యులు, కమిటీల చైర్మన్లు సోలిపేట రామలింగారెడ్డి, ఎ.జీవన్‌రెడ్డి, కె.యాదయ్య, డీఎస్ రెడ్యానాయక్, వై.అంజయ్య, ఫరీదుద్దీన్, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, వి.గంగాధర్‌గౌడ్, సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రీ, చీఫ్ విప్‌లు బోడకుంటి వెంకటేశ్వర్లు, దాస్యం వినయ్ భాస్కర్, విప్‌లు ఎంఎస్ ప్రభాకర్‌రావు, టి.భానుప్రసాద్‌రావు, కె.దామోదర్‌రెడ్డి, అరికెపుడి గాంధీ, రేగా కాంతారావు, బాల్క సుమన్, గొంగిడి సునీత తదితరులు హాజరయ్యారు.

# దొంగనాటకాలు ప్రజలు గమనించాలి

▶ మొదటి పేజీ తరువాయి

మోసం చేసిందని చెప్పారు. ప్రజల్ని మోసం చేసిన టీఆర్ఎస్‌కు మున్సిపల్ ఎన్నికల్లో ఓట్లడిగే అర్హత కూడా లేదని, ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. తామేమీ మున్సిపల్ ఎన్నికలకు భయపడడం లేదని, రిజర్వేషన్లు ఖరారు చేసిన తర్వాత నామినేషన్ల దాఖలు కొంత సమయం మాత్రమే అడిగామని చెప్పారు. అయినా ఓటరు జాబితా, రిజర్వేషన్లు ఖరారు చేయకుండా ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన ఘనత తెలంగాణ ఎన్నికల కమిషన్‌కే దక్కుతుందని ఆయన ఎద్దేవా చేశారు. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ..నిరసన ర్యాలీ శాంతియుతంగా చేస్తామన్నా అనుమతించకపోవడం దారుణమని, తెలంగాణలో ఆర్ఎస్ఎస్‌కి ఒక న్యాయం, కాంగ్రెస్ పార్టీకి ఒక న్యాయమా అని ప్రశ్నించారు. టీఆర్ఎస్‌కు వారి పార్టీ కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. దేశంలో, రాష్ట్రంలో నియంత పాలనకు త్వరలోనే స్వస్తి పలుకుతామని ధీమాను వ్యక్తం చేశారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్.సి.కుంతియా మాట్లాడుతూ..తెలంగాణలో కేసీఆర్, ఎంఐఎం పార్టీలు మోదీ కోసం పనిచేస్తున్నాయని, అందుకే తిరంగా ర్యాలీకి కూడా అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. శరణార్థులకు పౌరసత్వాన్ని మతంతో ముడిపెట్టడం అన్యాయమని, అందుకే ఎన్నార్సీని కాంగ్రెస్ విమర్శిస్తోందని చెప్పారు. అనంతరం టీపీసీసీ నేతలు సత్యాగ్రహ దీక్షను విరమించారు. ఈ దీక్షలో సీఎల్పీ మాజీ నేత కె.జానారెడ్డి, మాజీ మంత్రులు శ్రీధర్‌బాబు, షబ్బీర్‌అలీ, మర్రి శశిధర్ రెడ్డి, గీతారెడ్డి, చిన్నారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు పొన్నం ప్రభాకర్, జెట్టి కుసుమకుమార్, ఎమ్మెల్యే సీతక్క, టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి బోసురాజు, మాజీ ఎంపీ వీహెచ్, ఏఐసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ దాసోజు శ్రావణ్‌కుమార్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు బల్మూరి వెంకట్‌రావు, అనిల్‌కుమార్ యాదవ్, నేరెళ్ల శారద, టీపీసీసీ నేతలు ఇందిరా శోభన్, ఫిరోజ్‌ఖాన్, గౌస్‌లతో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఉద్రిక్తతల నడుమ

కాంగ్రెస్ పార్టీ 135వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా అంతకుముందు గాంధీభవన్‌లో ఉత్తమ్ కుమార్‌రెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ తలపెట్టిన 'సేవ్ ఇండియా ర్యాలీ'కి పోలీసులు అనుమతివ్వకపోవడంతో ఆ పార్టీ నేతలతో కలసి ఆయన గాంధీభవన్‌లోనే సత్యాగ్రహ దీక్షకు దిగారు. గాంధీభవన్ పరిసరాల్లో పోలీసులు పెద్ద ఎత్తున పహారా ఏర్పాటు చేయడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈసందర్భంగా పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తల నడుమ వాగ్వాదం, తోపులాటలు జరిగాయి. గాంధీభవన్‌కు వస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు బయటే అడ్డగించి కొందరిని అదుపులోకి తీసుకున్నారు.



శనివారం గాంధీ భవన్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తల ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

## టీఆర్ఎస్ పతనానికి ఈ దీక్ష వేదిక ప్రతిన పూనాలి: భట్టి

టీఆర్ఎస్ పతనానికి సత్యాగ్రహ దీక్ష వేదికగా ప్రతిన పూని కాంగ్రెస్ కార్యకర్తలు ముందుకెళ్లాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. దేశ విభజనకు కారణమవుతున్న చట్టాలను వ్యతిరేకిస్తూ దేశాన్ని ఓ కుటుంబంలాగా ముందుకు నడిపించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. అందుకే ఎన్నార్సీకి వ్యతిరేకంగా తాము ఉద్యమిస్తున్నామని చెప్పారు. తాము శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహిస్తే టీఆర్ఎస్ నిజస్వరూపం బయటపడుతుందనే దుర్మార్గపు ఆలోచనతో, ఆందోళనతో ఆ పార్టీ తమకు అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. నాటి బ్రిటిష్ పాలనలో కూడా ఉప్పుపై పన్నుకు వ్యతిరేకంగా గాంధీజీ సత్యాగ్రహం చేసేందుకు అనుమతి వచ్చిందని, సామ్రాజ్యవాద శక్తుల కంటే కేసీఆర్ ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. ఎంఐఎం, టీఆర్ఎస్‌లు కలసి బీజేపీ అధికారంలోకి రావడానికి పునాదులు వేస్తున్నాయని, హైదరాబాద్‌లోని ఈ రెండు పార్టీలను కదిలించకపోతే రాష్ట్రంలో స్వేచ్ఛగా బతికే పరిస్థితి లేదన్నారు. ఈ ఒక్కరోజు దీక్ష ఆపినంత మాత్రాన కాంగ్రెస్ పని అయిపోలేదన్నారు. ప్రతి ఇంటి గుండెను, గ్రామాన్ని, పట్టణాన్ని పలకరించి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఆయన కోరారు.

## ఇదం జగత్



... గ్రాఫిక్స్ రూపంలో!

# మనం సాధించింది ఎంత?



2000 సంవత్సరం ఆరంభంలోనే 20 ఏళ్లకి సాధించాలని కొన్ని లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. కానీ అనుకున్నది సాధించడంలో బాగా వెనుకబడే ఉన్నాం. 20 ఏళ్ల కింద బ్రిక్ దేశాలుగా పిలిచే బ్రెజిల్, రష్యా, చైనా, భారత్లు 2020 నాటికి అత్యంత శక్తమంతమైన దేశాలుగా ఎదుగుతాయని భావించారు. కానీ బ్రెజిల్, రష్యాలు ఆశించినంతగా పోటీ ఇవ్వలేకపోయాయి. చైనా బాగా అభివృద్ధి చెందితే, భారత్ ఫర్వాలేదన్న స్థితికి వచ్చింది.

**లక్ష్యం:** జీడీపీ 8–9% వరకు కొనసాగించాలి

**సాధించింది:** 2004–09 మధ్య కాలంలో స్థూల జాతీయోత్పత్తి బాగానే ఉండేది. కానీ పెద్ద నోట్ల రద్దు తర్వాత దారుణంగా పడిపోయింది. ఇప్పుడు రికార్డు స్థాయిలో జీడీపీ 5 శాతం కంటే తక్కువకు పడిపోయింది.

**లక్ష్యం:** పేదరిక నిర్మూలన

సాధించింది: ఆకలి కేకల నుంచి తీవ్ర దారిద్ర్యం నుంచి దాదాపు బయటపడ్డాం. కానీ నెలకు రూ.7 వేల కంటే తక్కువ సంపాదన ఉన్నవారు జనాభాలో దాదాపు 60 శాతం మంది వరకు ఉన్నారు.

**లక్ష్యం:** అందరికీ ఆరోగ్యం

**సాధించింది:** అనారోగ్య సమస్యల నుంచి తప్పించి ఆయుఃప్రమాణాన్ని 69 ఏళ్లకు పెంచాలని అనుకున్నాం. ఇప్పుడు సరిగ్గా అదే దశలో ఉన్నాం. కానీ చైనా, బ్రెజిల్ కంటే ఇది తక్కువే. ఆ దేశాల్లో సగటు ఆయువు 75 ఏళ్ల వరకు ఉంది. ఆరోగ్య రంగంలో మాత్రమే భారత్ పరిస్థితి మెరుగ్గా ఉంది. 'ఆయుష్మాన్ భారత్'ద్వారా 80 శాతం మంది నిరుపేదలకు వైద్య సౌకర్యాలు అందుతున్నాయి.

**లక్ష్యం:** నిరుద్యోగ నిర్మూలన

**సాధించింది:** ఈ అంశంలో మనం సాధించిందేమీ లేదు. గత 45 ఏళ్ల కాలంలో ఎన్నడూ ఎరుగని నిరుద్యోగ సమస్యను ప్రస్తుతం ఎదుర్కొంటున్నాం.

**లక్ష్యం:** అందరికీ విద్య

**సాధించింది:** అందరికీ విద్య లక్ష్యంతో ముందుకు వెళ్తే ప్రాథమిక దశలో మంచి ఫలితాలనే రాబట్టాం. మధ్యాహ్న భోజన పథకం, సర్వ శిక్షా అభియాన్, విలేజ్ స్కూల్ బిల్డింగ్స్తో చాలా మంది బడిబాట పట్టారు. కానీ కాలేజీల్లో ఉన్నత విద్య చదివే వారి శాతం బాగా తక్కువగా ఉంది. ప్రాథమిక విద్య అభ్యసించిన వారిలో 20 శాతం మంది మాత్రమే కాలేజీలో అడుగుపెడుతున్నారు. అదే అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించేవారు 87శాతం, బ్రిటన్లో 57 శాతం, చైనాలో 39 శాతంగా ఉంది.

# బొగ్గు గనుల పై సౌర వెలుగులు

## సింగరేణి ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్లు

- ఓవర్ బర్డెన్ డంప్ యార్డుల్లో ఏర్పాటుకు చర్యలు
- రిజర్వాయర్లలోనూ సోలార్ ప్యానెళ్లు
- 300 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం
- రూ.1,350 కోట్లు కేటాయింపు

**గోదావరిఖని:** సింగరేణిలో సౌర వెలుగులు విరజిమ్మనున్నాయి. బొగ్గు ఉత్పత్తికే పరిమితమైన సింగరేణి సంస్థ.. ఇప్పటికే థర్మల్ విద్యుత్ను ఉత్పత్తి చేసి కొత్త శకంలోని అడుగిడింది. ప్రస్తుతం మరో అడుగు ముందుకేసి పర్యావరణ అనుకూల సోలార్ విద్యుత్ తయారీపై దృష్టి పెట్టింది. సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలు, ఓపెన్కాస్ట్ ఓవర్ బర్డెన్ డంప్ యార్డులు, రిజర్వాయర్లపై కూడా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి విద్యుత్ను ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతోంది. సుమా రు 1,500 ఎకరాల్లో 300 మెగావాట్ల విద్యుత్ కోసం రూ.1,350 కోట్లు ఖర్చు చేసేందుకు నిర్ణయించింది. దీనికోసం సంస్థ ప్రత్యేక విభాగాన్ని కూడా ఏర్పాటు చేసింది. బొగ్గును వెలికి తీసిన అనంతరం కుమురం భీం జిల్లాలో డోర్లి–1, డోర్లి–2 ఉపరితల గనులు మూతపడ్డాయి. డోర్లి–1 ఉపరితల గని 227 హెక్టార్లలో విస్తరించి ఉండగా, డోర్లి–2 గని 24.13 హెక్టార్లలో ఉంది. కాగా, మంచిర్యాల, చెన్నూరు, మందమర్రి ప్రాంతాల్లో సోలార్ ప్లాంట్లను స్థాపించడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. 300 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా సింగరేణి సంస్థ టెండర్లు ఆహ్వానించింది. ఒక్కో మెగావాటు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ఐదెకరాల స్థలం అవసరమవుతుందని నిర్ణయించారు. మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.4.5 కోట్ల వరకు ఖర్చువుతుం దని అధికారులు గుర్తించారు. మొదటి దశలో 129 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సంస్థ నిర్ణయించింది. ఇందు కోసం మొదటి దఫా కాంట్రాక్టు పనులను బీహెచ్ఈఎల్కు అప్పగించింది. వీటికి సంబంధించిన పనులు వేగంగా సాగుతున్నాయి.

**90 మెగావాట్లు అదానీ పవర్కు..**

రెండో దశ కింద భూపాలపల్లిలో 10, మందమర్రిలో 43, కొత్తగూడెంలో 37 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ పనులను అదానీ పవర్కు కేటాయించారు. మరో 81 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లను ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. డోర్లీ, ఎస్టీపీపీ రిజర్వాయిర్, మంచిర్యాల జిల్లా చెన్నూర్, కొత్తగూడెంలలో ఈ ప్లాంట్లను ఏర్పాటు చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

**రిజర్వాయర్లలో సోలార్ ప్యానెళ్లు..**

సింగరేణి రిజర్వాయర్లలో కూడా సోలార్ ప్యానెళ్లు పెట్టే యోచనలో యాజమాన్యం ఉంది. శ్రీరాంపూర్ పవర్ప్లాంట్ సమీపంలోని రిజర్వాయర్లో 10 మెగావాట్ల విద్యుత్ ప్యానెళ్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే బెల్లంపల్లి ప్రాంతంలోని డోర్లీ –1 ఓసీపీలో 5 మెగావాట్ల విద్యుత్ ప్యానెళ్లను ఏర్పాట్లు చేయనున్నారు.

**సింగరేణికే సోలార్ విద్యుత్**

సోలార్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్ను మొత్తం సొంతానికే వినియోగించుకోవాలని సింగరేణి సంస్థ నిర్ణయించింది. సింగరేణి పరిధిలోని గనుల్లో వాడే విద్యు త్ను ఇప్పటి వరకు ట్రాన్స్కో నుంచి కొనుగోలు చేస్తుండగా ఇకపై సోలార్ విద్యుత్ను వినియోగించాలని సంస్థ నిర్ణయించింది.

**పంటలు పండించడానికి ప్రయోగాలు**

ఇదిలా ఉండగా కొమురంభీం జిల్లాలోని డోర్లి–1, డోర్లి–2 ఉపరితల గనుల్లో పది మెగావాట్ల విద్యుత్ను ఉత్పత్తి చేసే సోలార్ ప్యానెల్లు ఏర్పాటు చేయడంతోపాటు, సారవంవతమైన మట్టిని వేసి పంటలు పండించనున్నారు. డోర్లి–1 ఉపరితల గని వద్ద ఆరు ఎకరాల్లో ఇటీవలే శనగ విత్తనాలను వేశారు. ఈ ప్రయత్నం విజయవంతమైతే మిగతా చోట్ల కూడా పంటలు పండించాలని సింగరేణి అధికారులు యోచిస్తున్నారు.



ఆర్జీ-3 ఏరియాలో నిర్మిస్తున్న సోలార్ ప్లాంట్

### వేగంగా మొదటి దశ పనులు



సోలార్ ప్లాంట్ల మొదటి దశ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. శ్రీరాంపూర్ థర్మల్ప్లాంట్ ఆవరణలో 10 మెగావాట్ల సోలార్ ప్లాంట్ పనులు 90 శాతం, మణుగూరు 80 శాతం, ఆర్జీ–3 40లో శాతం పనులు పూర్తయ్యాయి. మరో 15 రోజుల్లో సోలార్ విద్యుత్ను ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఉత్పత్తి చేసిన విద్యుత్ను సంస్థలోనే వినియోగించాలని నిర్ణయించాం.

*– చంద్రశేఖర్, సింగరేణి డైరెక్టర్*

## కూర్మావతారంలో భద్రాద్రి రామయ్య



**భద్రాచలంటౌన్:** వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారు కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ రూపంలో ఉన్న రామయ్యను బేడా మండపంలో వేంచేపు చేసి, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. తర్వాత అంతరాలయంలో రాజభోగం నివేదించారు.

## ఒవైసీ పొలిటికల్ బ్రోకర్: అర్వింద్



**సుభాష్నగర్ (నిజామాబాద్ అర్బన్):** ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఓ పొలిటికల్ బ్రోకర్ అని, ముఖ్యమంత్రి కేసీఆర్ ముల్లాగా వ్యవహరిస్తున్నారని ఎంపీ ధర్మపురి అర్వింద్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఒవైసీ నడిపిస్తున్నారని ఆరోపించారు. శనివారం నిజామాబాద్లో ఎంపీ విలేకరులతో మాట్లాడారు. ఒవైసీ నిజామాబాద్కు వచ్చి సెక్యులరిజం గురించి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, ఆయనతో సెక్యులరిజం గురించి చెప్పించుకునే దౌర్భగ్యం ఏ భారతీయుడికి పట్టలేదన్నారు.

## దివ్యాంగురాలిపై అఘాయిత్యం

- నిందితుడు పెద్దనాన్న కొడుకే
- నిజామాబాద్ జిల్లాలో ఘటన

**బోధన్టౌన్:** సోదరి అవుతుందన్న విషయం మరిచి చిన్నాన్న కూతురిపైనే కన్నేశాడో కీచకుడు. మిత్రుడితో కలసి రెండేళ్లుగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భవతి కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని బీటీనగర్కు చెందిన యువతి (19) దివ్యాంగురాలు. అదే ప్రాంతంలో నివాసముంటున్న ఆ యువతి పెద్దనాన్న కుమారుడు నవీన్ మాయ మాటలు చెప్పి లోబరచుకున్నాడు. మిత్రుడు రవితో కలసి రెండేళ్లుగా అత్యాచారం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆమెలో శారీరక మార్పులు గమనించిన తల్లిదండ్రులు ఏం జరిగిందని ఆరా తీయగా విషయం తెలిసింది. బాధితురాలు ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి. అయితే, ఏం చేయాలో తెలియక తల్లిదండ్రులు కుల పెద్దలను ఆశ్రయించగా వారు ఈ విషయాన్ని బయటకు రాకుండా యత్నించారు. దీంతో బాధితులు వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీని కలసి జరిగిన విషయం చెప్పారు. దీంతో ఆమె వారిని వెంట బెట్టుకుని శనివారం పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు.

# మినిస్టర్ మాస్టారు!

- సంగారెడ్డి జిల్లాలో పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి హరీశ్రావు
- విద్యార్థులకు ప్రశ్నలు
- జవాబులు చెప్పకపోవడంతో ఉపాధ్యాయులపై అసహనం



కంది పాఠశాలలో పదో తరగతి విద్యార్థినితో మాట్లాడుతున్న మంత్రి హరీశ్రావు

**సంగారెడ్డి రూరల్:** ప్రభుత్వ, రాజకీయ కార్యకలాపాలతో నిత్యం తీరిక లేకుండా గడిపే ఆర్థిక శాఖ మంత్రి హరీశ్రావు మాస్టారు అవతారం ఎత్తారు. శనివారం సంగారెడ్డి జిల్లాలో పర్యటించిన మంత్రి, మండల కేంద్రమైన కందిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సాంఘిక శాస్త్రం, గణితం.. తదితర సబ్జెక్టుల్లో పదో తరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి విషయ పరిజ్ఞానాన్ని పరిశీలించారు. ఎన్ని ఎక్కాలు వచ్చు.. అని అడిగి 17వ ఎక్కం చదవాలని సూచించారు. అయితే విద్యార్థులు ఎవరూ చెప్పలేకపోయారు. కనీసం 12, 13వ ఎక్కం చెప్పాలని అడిగినా చెప్పలేని విద్యార్థులు తమకు కేవలం పదవ ఎక్కం వరకు మాత్రమే వచ్చని తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీల్లో ఉపాధ్యాయుల పేర్లను రాయాలని మంత్రి అడగడంతో ఆరుగురు విద్యార్థుల్లో ఇద్దరు మాత్రమే సక్రమంగా రాయగా, మిగతా నలుగురు రాయలేకపోయారు. దీంతో మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలా ఐతే విద్యార్థులు ఎలా పాసవుతారని మంత్రి ఉపాధ్యాయులపై అసహనం వ్యక్తం చేశారు. అన్ని సబ్జెక్టుల్లో అవగాహన ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువులో వెనుకబడి ఉంటే ఉత్తీర్ణత సాధించడం కష్టంగా ఉంటుందన్నారు. ఇలాంటి చదువులతో పోటీ ప్రపంచంలో ఎలా నెగ్గుకొస్తారని ప్రశ్నించారు. వెనుకబడిన పదవ తరగతి విద్యార్థులపై శ్రద్ధపెట్టి ప్రత్యేక తరగతులు నిర్వహించి, బాగా చదివించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులందరూ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణులయ్యేలా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

## ప్రభుత్వ ఆస్పత్రికి కరెంట్ కట్

**చింతలపాలెం:** సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శనివారం ట్రాన్స్కో అధికారులు కరెంటు కట్ చేశారు. దాదాపు రూ.11.7 లక్షలు విద్యుత్ బిల్లుల బకాయిలు పేరుకుపోవడంతో కనెక్షన్ తొలగించారు. ఫలితంగా రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ను సంప్రదించగా.. విద్యుత్ బకాయిలు ఉన్న మాట వాస్తవేనని అన్నారు. నిధులు రాగానే బకాయిలు చెల్లిస్తామని చెప్పారు.



భాగిర్తిపల్లిలో నిందితుడి ఇల్లు ధ్వంసం చేసిన గ్రామస్తులు

## భగ్గుమన్న భాగిర్తిపల్లి

- బీమా డబ్బుల కోసం బామ్మర్ది హత్య
- మృతుడి బావ సహా మరో ఇద్దరి ఇళ్ల ధ్వంసం

**భిక్కనూరు:** రైతుబీమా డబ్బుల కోసం సొంత బామ్మర్దినే హత్య చేశాడంటూ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శనివారం ఆగ్రహోదగ్రులయ్యారు. మృతుడి బావతో పాటు మరో ఇద్దరు నిందితుల ఇళ్లను ధ్వంసం చేశారు. దీంతో కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం భాగిర్తిపల్లిలో ఉద్రిక్తత నెలకొంది. గ్రామానికి చెందిన శేఖర్ (21) రామాయంపేట శివారులోని ఓ బావిలో శుక్రవారం శవమై కనిపించిన విషయం విదితమే. అతడి మృతికి బావ రాజశేఖర్, మరో ఇద్దరు కారణమని కుటుంబ సభ్యులు, స్థానికులు శనివారం ఆందోళనకు దిగారు. నిందితుల ఇళ్లపై దాడి చేసి, ఫర్నిచర్ను ధ్వంసం చేశారు. ఆందోళన విరమించాలని, నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని సర్దిచెప్పడంతో పోలీసులు సర్దిచెప్పడంతో వారు శాంతించారు.

**బీమా డబ్బుల కోసమే..!**

శేఖర్ సోదరిని అదే గ్రామానికే చెందిన రాజశేఖర్ గతంలో పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్నాడు. అప్పట్లో దీనిపై గొడవ జరగ్గా, కుల పెద్దలు సర్దిచెప్పడంతో అంతా కలసిపోయారు. అయితే, శేఖర్ తల్లి ఇటీవల మృతి చెందగా, రైతుబీమా పథకం కింద రూ.5 లక్షలు వచ్చాయి. ఈ డబ్బుల్లో తమకు వాటా ఇవ్వాలంటూ రాజశేఖర్ గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో తన బావ స్నేహితుడైన భిక్షపతి విందు ఇస్తానని రామాయంపేటకు రావాలని గురువారం ఆహ్వానించడంతో శేఖర్ బైక్పై వెళ్లాడు. శుక్రవారం ఉదయం రామాయంపేట సమీపంలో గల బావిలో శేఖర్ శవమై కనిపించాడు. బీమా డబ్బుల కోసమే శేఖర్ను అతని బావ రాజశేఖర్, మరో ఇద్దరు కలసి హత్య చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



శనివారం వసతిగృహం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థినిలు

## 'గురుకుల' విద్యార్థినికి గర్భం

- ఆసిఫాబాద్ జిల్లాలో కలకలం
- అధికారుల విచారణ
- ప్రేమ వ్యవహారమే కారణమని వెల్లడి

**సాక్షి, ఆసిఫాబాద్:** కుమురం భీం జిల్లా కేంద్రమైన ఆసిఫాబాద్లోని గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని గర్భం దాల్చడం కలకలం సృష్టించింది. అయితే.. ప్రేమ వ్యవహారమే కారణమని అధికారుల విచారణలో తేలింది. వివరాలు.. గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో చదువుతున్న 10 మంది విద్యార్థినులకు ఇటీవల రుతుస్రావం సమస్య ఎదురైంది. దీంతో నవంబర్ 21న కళాశాల సిబ్బంది ఆదిలాబాద్ రిమ్స్లో పరీక్షలు చేయించారు. ఇందులో ముగ్గురిపై అనుమానంతో గర్భనిర్ధారణ పరీక్షలు చేయించారు. వారికి మొదట పాజిటివ్ వచ్చింది. ధ్రువీకరణ కోసం మళ్లీ వారం తర్వాత రావాల్సిందిగా వైద్యులు సూచించారు. అయితే.. కళాశాల సిబ్బంది మళ్లీ రిమ్స్కు వెళ్లకుండా స్థానికంగా ఉన్న ఆసుపత్రిలోనే వైద్య పరీక్షలు చేయించారు. ఇందులో ఒక విద్యార్థిని మాత్రమే గర్భం దాల్చినట్లు తేలింది. ఈ విషయం బయటకు పొక్కడంతో ఆదివాసీ సంఘాలు ఆందోళన చేపట్టాయి. కాగా, శనివారం ఆర్డీఓ సిడాం దత్తు, గిరిజన సంక్షేమ శాఖ జీసీడీవో శకుంతల, డీసీపీవో మహేశ్, ఐసీడీఎస్ పీడీ సావిత్రి శనివారం విచారణ చేపట్టారు. గర్భానికి ప్రేమ వ్యవహారమే కారణమని తేల్చారు.

**మా కళాశాలను బద్నాం చేస్తారా?**

ఈ విషయం మీడియాలో విస్తృతంగా ప్రచారం జరగడంతో కళాశాల విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కళాశాల పేరు ప్రఖ్యాతులు భంగం కలిగేలా మీడియాలో ప్రచారం చేశారని, ఇందులో ప్రిన్సిపాల్ పాత్ర ఏమీ లేదని వసతిగృహ భవనం ఎదుట ధర్నాకు దిగారు. డీఎస్పీ సత్యనారాయణ విద్యార్థినులతో మాట్లాడి శాంతిపజేశారు. కాగా, ఈ ఘటనపై విచారణ కోసం ఆలస్యంగా రావడంపై విద్యార్థి సంఘాలు ఆర్డీఓ లక్ష్మయ్యను అడ్డుకున్నాయి.

## కాలుష్యానికి పరాకాష్ట



నల్లని కాలుష్యపు నీటిని పోస్తున్న బోరు

**భూదాన్పోచంపల్లి:** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్పోచంపల్లి మండలంలోని దోతిగూడెం పరిధిలో కాలుష్యం పరాకాష్టకు చేరింది. గ్రామం పరిధిలోని కంపెనీలు వ్యర్థ రసాయనాలను యథేచ్ఛగా భూగర్భంలోకి వదులుతుండటంతో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయి. శనివారం గ్రామానికి చెందిన కంది మోహన్రెడ్డి పొలంలో బోరు ముక్కుపుటాలు అదిరే ఘాటైన వాసనతో ఇలా నల్లని కాలుష్య జలాన్ని బయటికి విరజిమ్మింది.



## కృత్రిమ మేధ కొత్త పరుగులు



ఏమో కారు ఎగరావచ్చు.. డ్రైవర్ లేకుండా రోడ్లపై పరుగులు పెట్టావచ్చు.. షాపింగ్ మాల్‌కి వెళ్తే రోబో షేక్‌హ్యాండ్‌తో మనల్ని ఆహ్వానించవచ్చు. అదంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తోనే సాధ్యమవుతుంది. కొత్త దశాబ్దంలో ఇక కృత్రిమ మేధదే హవా. ఇప్పటికే ఆపరేషన్ చేసే రోబోల్ని చూస్తున్నాం. ట్రాఫిక్ కంట్రోల్ చేసే పోలీసు రోబోలు అందుబాటులోకి వచ్చాయి. ఆస్పత్రుల్లో, పంట పొలాల్లో, మాల్స్‌లో కూడా రోబోలు కనిపించనున్నాయి. భారత్ మాత్రమే కాదు ఈ ఏడాది కృత్రిమ మేధపై ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులు పెరుగుతున్నాయి. ప్రపంచంలోని ప్రతి ఇద్దరు పరిశోధకుల్లో ఒకరు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా జరిగే పరిశోధనల్లోనే పాలుపంచుకోనున్నారు. ఏఐ పారిశ్రామిక, సేవా రంగాన్ని ఒకే చోటుకు తీసుకురానుంది. ఈ కృత్రిమ మేధతో ఉద్యోగాలు పోతాయన్న అపోహ కూడా ఇప్పుడు తొలగిపోయింది. ఎన్నో ఉద్యోగ అవకాశాల్ని ఈ రంగం కల్పించనుంది. మన దేశంలో కృత్రిమ మేధ రంగంలో 2018లో 40 వేల మంది నిపుణులు ఉంటే, 2019లో 72 వేల మంది ఉన్నారు.

## వీఆర్ ఫిట్‌నెస్ ఇదో కొత్త ట్రెండ్



ఇవాళ, రేపు అందరిలోనూ ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా వ్యక్తులు ఫిట్‌గా ఉంటేనే దేశం ఫిట్‌గా ఉంటుందని ఓ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. శారీరక వ్యాయామం ఏడాది పొడవునా కొనసాగించాలంటే మనకు వాతావరణ పరిస్థితులు అనుకూలించడం లేదు. వర్షాకాలంలో వాకింగ్ చేయాలంటే కష్టం. చలికాలంలో ఆరుబయట కూర్చొని యోగా చేయలేం. అలాంటి వారి కోసమే వర్చువల్ రియాలిటీ ఫిటినెస్ అందుబాటులోకి రానుంది. మనం ఏ పనైనా చేయాలంటే చుట్టూ ఉన్న వాతావరణం అత్యంత ముఖ్యం. మన ఇంట్లో కూర్చున్నా మనకు నచ్చిన వాతావరణాన్ని కల్పించేదే వర్చువల్ రియాలిటీ (వీఆర్). వీఆర్ సెట్‌ని తలకి అమర్చుకుంటే చాలు. మన మనసుకి నచ్చిన తోటలో కూర్చొని, నులివెచ్చని సూర్య కిరణాలు వంటికి తగిలిన అనుభూతి కలుగుతుంది. అప్పుడు హాయిగా యోగా మ్యాట్ మీద కూర్చొని ఇంట్లోనే వ్యాయామం చేయొచ్చు. ప్రపంచవ్యాప్తంగా 2019లో వీఆర్ హెడ్‌సెట్స్ అమ్మకాలు 5.2 కోట్లు ఉంటే 2023 నాటికి 10 కోట్లకు చేరుకోవచ్చని అంచనా. వర్చువల్ రియాలిటీకి వాస్తవికతను జోడించేలా అగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్) అందుబాటులో ఉన్నాయి. ఈ కొత్త దశాబ్దంలో ఈ రెండింటినీ కలిపి మిక్స్‌డ్ రియాలిటీ(ఎంఆర్) రానుంది. ఇదే జరిగితే మన మనసుకి నచ్చినవన్నీ నెట్టింట్లోకే వచ్చేస్తాయి.

# వాడివేడిగా ఎస్‌ఈసీ సమావేశం

- ఎన్నికల తేదీలు రీషెడ్యూల్ చేయాలన్న కాంగ్రెస్, ఇతర పక్షాలు
- సాధ్యం కాదన్న కమిషన్.. వాకౌట్ చేసిన కాంగ్రెస్
- ప్రభుత్వానికి తొత్తులా పనిచేస్తున్నారని ఆరోపణ

**సాక్షి, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లకు సంబంధించి రాజకీయ పార్టీలతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్‌ఈసీ) నిర్వహించిన సమావేశం వాడివేడిగా జరిగింది. సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకుని మున్సిపల్ ఎన్నికల తేదీలను రీషెడ్యూల్ చేయాలంటూ తాము చేసిన విజ్ఞప్తిపై ఎస్‌ఈసీ నుంచి సానుకూలత వ్యక్తం కాలేదని కాంగ్రెస్, ఇతర పార్టీల నేతలు పేర్కొన్నారు. తాము ఇచ్చిన సలహాలు, సూచనలను పట్టించుకోకపోగా ఎస్‌ఈసీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని, అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ కాంగ్రెస్‌నేతలు మర్రి శశిధర్‌రెడ్డి, గోపిశెట్టి నిరంజన్ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డి పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని, అఖిలపక్ష సమావేశంలో ఆయన ఉపయోగించిన పరుష పదజాలానికి నిరసనగా సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రిజరేషన్లు ప్రకటించాకే ఎన్నికలు నిర్వహించాలని కోరితే తనపై దాడి చేశారని, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని దళిత బహుజన పార్టీ నేత కృష్ణ స్వరూప్ ఆరోపించారు. టీఆర్‌ఎస్, ఎంఐఎం మినహా దాదాపు మిగతా అన్ని పార్టీలు ఎన్నికల తేదీలు రీ షెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశాయి. దీంతో సమావేశం ఒకింత రసాభాసగా మారింది. తమతో పరుషంగా మాట్లాడిన కృష్ణ స్వరూప్‌ను పోలీసుల సహాయంతో బయటకు పంపించాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. శనివారం ఎస్‌ఈసీ వద్ద గుర్తింపు పొందిన పార్టీలు, రాజకీయపక్షాలతో కమిషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వి.నాగిరెడ్డి ముందుగా ఎన్నికల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లు, షెడ్యూల్ విడుదల గురించి వివరించారు. మున్సిపాలిటీల కాలపరిమితి ముగిసేలోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని, రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో ఎన్నికలు నిర్వహించొచ్చని మున్సిపల్ చట్టంలో ఉందని, ఎన్నికల నిర్వహణలో జాప్యం జరగడంతో తామే కోర్టుకు వెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికే మున్సిపల్ ఎన్నికలు ఆలస్యమయ్యాయని, మెజారిటీ మున్సిపాలిటీల కాలపరిమితి ముగిసి 7 నెలలు గడిచినందున, సమ్మక్క, సారక్క జాతరను దృష్టిలో పెట్టుకుని వచ్చే నెల 25లోగా ఎన్నికలు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు నాగిరెడ్డి చెప్పారు. ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటుంటే తనను అకారణంగా విమర్శిస్తున్నారని, కొందరు చెత్త, చెత్తగా మాట్లాడుతున్నారని, తన వద్ద పోలీసులు లేరని, ఉంటే వారిని పోలీస్‌స్టేషన్‌కు పంపేవాడినంటూ వ్యాఖ్యానించారు. కమిషనర్ హోదాలో ఉండి అలా వ్యాఖ్యానించడం ఆయన ఔన్నత్యానికి సరికాదని కాంగ్రెస్ నేతలు అభ్యం తరం వ్యక్తం చేశారు. పండుగ తర్వాత నోటిఫికేషన్ ఇవ్వాలని, సాయంత్రం 6 తర్వాత ప్రచారానికి అనుమతించేలా నిబంధనలు సడలించాలని కోరారు. టీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశానికి జనగామ మున్సిపల్ కమిషనర్ హాజరయ్యారని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నేత డీజీ నరసింహారావు డిమాండ్ చేశారు. ఎన్నికలు వాయిదా వేయించేందుకు కాంగ్రెస్ యత్నిస్తోందని టీఆర్‌ఎస్ ప్రతినిధి గట్టు రామచంద్రరావు అన్నారు. మున్సిపల్ ఎన్నికలను అనుకున్న తేదీల్లో నిర్వహించాలని ఎంఐఎం ఎమ్మెల్సీ సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రీ కోరారు. ఓటర్ల జాబితా, రిజర్వేషన్లు లేకుండా షెడ్యూల్ విడుదల చేయడం సరికాదని బీజేపీ నేత జి.మనోహర్‌రెడ్డి అభ్యంతరం తెలిపారు.

### వాయిదా వేయలేం..

ఇప్పటికే ప్రకటించిన మేరకు మున్సిపల్ ఎన్నికలుంటాయని, వాటిని వాయిదా వేయలేమని నాగిరెడ్డి స్పష్టం చేశారు. ఈ నెల 30 నాటికి ఓటర్ల జాబితా వెలువడుతుందని, వచ్చే నెల 6వ తేదీకల్లా రిజర్వేషన్లు ఇస్తే 7న నోటిఫికేషన్ ఇస్తామన్నారు. ఒకవేళ ప్రభుత్వం రిజర్వేషన్లు ఇవ్వలేకపోతే నోటిఫికేషన్ జారీ చేయలేమని తెలిపారు. కార్యక్రమంలో విశ్వేశ్వరరావు (టీజేఎస్), బాలమల్లేశ్ (సీపీఐ) రావుల చంద్రశేఖర్‌రెడ్డి (టీడీపీ), నాగరాజు (తెలంగాణ లోక్‌సత్తా) ఇతర పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.

### ఇష్టారీతిగా వ్యవహరిస్తోంది.

తమ అభిప్రాయాలను పట్టించుకోలేదని, ఈసీ ఇష్టారీతిన, రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని, ప్రభుత్వ ఇష్ట ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేసిందని మర్రి శశిధర్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికల కమిషన్ అధికార పార్టీకి, ప్రభుత్వానికి తొత్తులా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రిజర్వేషన్లు ప్రకటించకుండా ఎన్నికలు నిర్వహించడం మొదటిసారి చూస్తున్నామని, అధికార పార్టీకి వత్తాసు పలికేలా నాగిరెడ్డి నియంతలా మాట్లాడుతున్నారని నిరంజన్ విమర్శించారు.



శనివారం ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## హైదరాబాద్ ఇమేజ్ పెంచేలా నిర్వహించాలి

**జనవరి 13 నుంచి 15 వరకు కైట్, స్వీట్ ఫెస్టివల్: శ్రీనివాస్‌గౌడ్**

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్ నగరం బ్రాండ్ ఇమేజ్‌ని మరింత పెంచేలా కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహించాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం, పర్యాటక, సాంస్కృతిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గత ఐదేళ్లుగా ఇంటర్నేషనల్ కైట్, స్వీట్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జనవరి 13 నుంచి 15 వరకు జరిగే ఈ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇంటర్నేషనల్ కైట్, స్వీట్ ఫెస్టివల్ 2020 నిర్వహణపై శనివారం ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఫెస్టివల్‌ను సందర్శించడానికి వచ్చే వారికి మెరుగైన సదుపాయాలు, సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. ఇంటర్నేషనల్ స్వీట్ ఫెస్టివల్‌కు వివిధ దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానించి ఆ దేశాల స్వీట్స్ వెరైటీలను ప్రదర్శనలో పాల్గొనేలా ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లో స్థిరపడిన వివిధ రాష్ట్రాల ప్రజలను స్వీట్ ఫెస్టివల్‌లో భాగస్వామ్యం చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి టూరిజం కమిషనర్, స్పోర్ట్స్ ఎండీ దినకర్‌బాబు, టూరిజం ఎండీ మనోహర్, టూరిజం అధికారులు ఓం ప్రకాశ్ శిధర్, స్వీట్ నిర్వాహకులు పాల్గొన్నారు.




సబ్ ఇన్‌స్పెక్టర్ల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

## ప్రజా రక్షణే ధ్యేయంగా పని చేయాలి: డీజీపీ

**సాక్షి, హైదరాబాద్:** సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రజా రక్షణే ధ్యేయంగా పోలీసులు పని చేయాలని డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం తెలంగాణ స్టేట్ పోలీసు అకాడమీ (టీఎస్‌పీఏ)లో 175 మంది రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలతో మమేకమై, సేవాభావమే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని పోలీసులకు పిలుపునిచ్చారు. జాతీయ, అంతర్జాతీయ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. విషయ పరిజ్ఞానం, ఐటీ, నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం, వ్యక్తిగత క్రమశిక్షణపై నిరంతరం శ్రద్ధ వహించాలని హితవు పలికారు. పోలీసు శాఖలోకి మహిళలు మరింతగా రావాల్సిన అవసరముందని టీఎస్‌పీఏ అడిషనల్ డీజీ అభిలాష బిస్త్ అభిప్రాయం వ్యక్తం చేశారు. టీఎస్‌పీఏ డైరెక్టర్ వీకే సింగ్ మాట్లాడుతూ అకాడమీలో ట్రైనీలకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.



తెలంగాణ విద్యార్థి యూనియన్ మహాసభలో ప్రసంగిస్తున్న చంద్రకుమార్

## మార్పులో భాగస్వాములు కావాలి

**విద్యార్థులకు జస్టిస్ చంద్రకుమార్ పిలుపు**

**సాక్షి, హైదరాబాద్:** సమాజ మార్పులో విద్యార్థులు భాగస్వాములు కావాలని విశ్రాంత జస్టిస్ చంద్రకుమార్ పిలుపునిచ్చారు. జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని, సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. విద్య కేవలం ఉద్యోగాల కోసం కాకుండా ప్రజలకు మెరుగైన జీవితాన్ని అందించే సమాజం కోసం పాటుపడాలన్నారు. శనివారం ఓయూ క్యాంపస్ ఆడిటోరియంలో ప్రారంభమైన తెలంగాణ విద్యార్థి యూనియన్ రాష్ట్ర మహాసభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అసమానతలు తొలిగిపోయి అందరికి సమాన అవకాశాలు కల్పించే సమాజ నిర్మాణం కోసం జరుగుతున్న ప్రయత్నాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. విద్యావంతులైన లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సీఎం కేసీఆర్ చూపించాలన్నారు. కార్యక్రమంలో ఓయూ అధ్యాపకులు పురుషోత్తం, టీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.అంజి, తెలంగాణ తీన్మార్ వ్యవస్థాపక అధ్యక్షుడు వరంగల్ రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రాచీన కళలను కాపాడుకోవాలి

**పల్లా రాజేశ్వర్‌రెడ్డి అభినందన సభలో వక్తలు**

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రానికి వారసత్వ సంపద అయిన ప్రాచీన కళలను కాపాడుకోవాలని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ అధికార ప్రతినిధి సముద్రాల వేణుగోపాలాచారి పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో కళలు, కళాకారులు ఉద్యమ స్ఫూర్తిని నింపారని గుర్తు చేశారు. శనివారం రవీంద్ర భారతిలో కళావాహిని ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి అభినందన పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మరుగునపడిన ప్రాచీన కళలకు మంచి గుర్తింపు తీసుకువస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కళల పట్ల అభిమానం కలిగిన వ్యక్తి అని, కళాకారులకు పింఛన్ పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం కళావాహిని సంస్థ ఆధ్వర్యంలో జనవరిలో నిర్వహించబోయే తెలంగాణ కళాజాతర కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో రాణిస్తున్న ప్రముఖులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ భూపతిరెడ్డి, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి, బీసీ కమిషన్ సీనియర్ సభ్యుడు వకులాభరణం కృష్ణమోహన్‌రావు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మీ చీఫ్‌కు రాజకీయాలతో పనేంటి?

- సైన్యాధ్యక్షుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దేశ చరిత్రలోనే మొదటిసారి
- ఇదే వైఖరి కొనసాగితే దేశం పాకిస్తాన్‌లా మారుతుంది
- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



**సాక్షి, హైదరాబాద్:** దేశ ప్రజలను రాజకీయ నాయకులు తప్పుదోవలో నడిపిస్తున్నారంటూ ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ చేసిన వ్యాఖ్యలను సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తప్పుబట్టారు. అసలు ఆర్మీ చీఫ్‌కు దేశ అంతర్గత రాజకీయాలతో పనేంటని ఆయన ప్రశ్నించారు. దేశ చరిత్రలో ఆర్మీ చీఫ్ రాజకీయాల గురించి మాట్లాడటం ఇదే మొదటిసారని, సాయుధ దళాల్లో కూడా రాజకీయ జాడలు కనిపించడం ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పర్యటన సందర్భంగా హైదరాబాద్‌కు వచ్చిన ఏచూరి శనివారం సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆర్మీ చీఫ్ రాజకీయాలు మాట్లాడే ధోరణి దేశాన్ని మరో పాకిస్తాన్‌లా మారుస్తుందన్న విషయాన్ని గ్రహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని, కానీ కేంద్ర మంత్రులు కూడా రావత్ వ్యాఖ్యలను సమర్థిస్తూ మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ పౌరసత్వ రిజిస్టర్ (ఎన్‌పీఆర్)ను 2003లో వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలోనే హోంమంత్రి అద్వానీ పార్లమెంటులో ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. 2014లో రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు మోదీ ప్రభుత్వం ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో కూడా దేశవ్యాప్తంగా ఎన్నార్సీని అమలు చేస్తామని చెప్పారని, ఇది పార్లమెంటు రికార్డుల్లో ఉందన్నారు. కానీ మోదీ మాత్రం దేశవ్యాప్తంగా ఎన్నార్సీ గురించి తాము చర్చించలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

**కేసీఆర్ డబుల్ డ్రామా..**

సీఏఏ, ఎన్నార్సీ, ఎన్‌పీఆర్ విషయాల్లో సీఎం కేసీఆర్ డబుల్ డ్రామా ఆడుతున్నారని అర్థమవుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. ఎంఐఎంతో ఉన్న స్నేహం కారణంగా ముస్లింల ఓట్లు కావాలి కాబట్టి సీఏఏ బిల్లును పార్లమెంటులో వ్యతిరేకించారన్నారు. ఇటీవల పత్రికల్లో వస్తున్న వార్తల ఆధారంగా కేసీఆర్ తన వైఖరిని మార్చుకున్నారని అర్థమవుతోందని, అది నిజం కావాలని తాము కోరుకుంటున్నామన్నారు. మున్సిపల్ ఎన్నికలపై ప్రశ్నించగా బీజేపీ, టీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లలో ఏ పార్టీతోనూ మున్సిపల్ ఎన్నికల్లో పొత్తు ఉండబోదని, మిగిలిన పార్టీలతో పొత్తులకు తాము సిద్ధమని తమ్మినేని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జి.నర్సింగరావు, రాములు పాల్గొన్నారు.

### హింసకు పోలీసులే కారణం...

దేశంలో జరుగుతున్న హింసా ఘటనలకు పోలీసులే కారణమని, వారే ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ ప్రజలపై ఆరోపణలు చేస్తున్నారని ఏచూరి ఆరోపించారు. తాము ప్రజల మీద ఒక్క బుల్లెట్ కూడా ప్రయోగించడం లేదని కేంద్రం చెబుతుంటే.. దేశవ్యాప్తంగా ఎన్నార్సీ ఆందోళనల్లో 27 మంది ఎలా చనిపోయారని ప్రశ్నించారు. ఎన్‌పీఆర్ తయారీ కోసం గతంలో 15 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళి ఉండేదని, ఇప్పుడు మరో 6 ప్రశ్నలు కలిపారని ఏచూరి చెప్పారు. కలిపిన ప్రశ్నల్లో మీ తల్లిదండ్రులు ఎక్కడి వారో, ఎప్పుడు పుట్టారో చెప్పాల్సి ఉంటుందని, ఇది పేదలను వేధించడమేనన్నారు. ప్రభుత్వాలు నిరూపించేంత వరకు ఈ దేశంలో నివసించే వారంతా దేశ పౌరులేనని, కానీ కేంద్రం మాత్రం ప్రజలు దేశ పౌరులని నిరూపించుకునేంత వరకు ఈ దేశ పౌరులు కాదని అంటోందని ఎద్దేవా చేశారు. ఇదే వైఖరి కొనసాగితే ఎన్నార్సీలో అనుమానిత(డి) కేటగిరీ కింద ఒక మతానికి చెందిన ప్రజలుండే అవకాశముందని, ఇది మత ఘర్షణలకు దారితీసే అవకాశమూ లేకపోలేదని అభిప్రాయపడ్డారు. ఇది కచ్చితంగా రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందన్నారు. ఎన్నార్సీని అమలు చేయడం లేదని 12 రాష్ట్రాల ముఖ్యమంత్రులు చెప్పారని, తెలంగాణ సీఎం కేసీఆర్ కూడా తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న లక్ష్మణ్. చిత్రంలో రాజాసింగ్, రాంచందర్‌రావు

# టీఆర్‌ఎస్‌ది ముస్లిం సంతుష్టీకరణే

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్**

**సాక్షి, హైదరాబాద్:** పౌరసత్వ సవరణ చట్టంలో ముస్లిం అనే పదం లేకపోవడంతో పాటు ఇతర షరతులు ఒప్పుకోకపోవడం వల్లే పార్లమెంట్‌లో ఈ చట్టాన్ని వ్యతిరేకించినట్లు ఉందని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొనడం ముస్లిం సంతుష్టీకరణ తప్పిస్తే మరొకటి కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆరోపించారు. టీఆర్‌ఎస్ పార్టీ సెక్యులర్ పార్టీ అని చెప్పుకోవడం నేతి బీరకాయలో నెయ్యి చందంగా ఉందని ఎద్దేవా చేశారు. సవరణ చట్టంలో ముస్లిం అనే పదం లేకపోవడాన్ని ప్రధానంగా పెట్టి మున్సిపల్ ఎన్నికల్లో ఓట్లు అడిగే దమ్ము టీఆర్‌ఎస్‌కు ఉందా? అని ప్రశ్నించారు. శనివారం పౌరసత్వ సవరణ చట్టంపై బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన వర్క్‌షాపులో లక్ష్మణ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, టీఆర్‌ఎస్ పార్టీ ప్రతి విషయాన్ని ముస్లిం కోణంలోనే చూస్తున్నాయని మండిపడ్డారు. పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌లలో మత హింసను ఎదుర్కోలేక భారతదేశం వచ్చిన శరణార్థుల కోసం పౌరసత్వ సవరణ చట్టం తీసుకొస్తే.. ఇందులోనూ ముస్లిం పదం కోసం పట్టుబట్టడం నిజాం, రజాకార్ పోకడలకు నిదర్శనమని ఆరోపించారు. రాష్ట్రంలో పాలనను గాలికొదిలేసి ఫామ్‌హౌస్‌కే పరిమితమైన సీఎం పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోతున్న నేపథ్యంలో టీఆర్‌ఎస్ పార్టీ ప్రత్యామ్నాయంగా కేటీఆర్‌ను సిద్ధం చేస్తున్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సర్కార్ వైఫల్యాలను పక్కదారి పట్టించేందుకు ఆయన తర్వాత కేటీఆర్ సీఎం అవుతారంటూ ప్రచారంలో పెడుతున్నారని విమర్శించారు.

**ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం..**

రాజకీయ దురుద్దేశంతో ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వార్డులలో రిజర్వేషన్ ప్రక్రియను ప్రకటించకుండా మున్సిపోల్స్ షెడ్యూల్ విడుదలను వ్యతిరేకిస్తున్నామని లక్ష్మణ్ తెలిపారు. పంచాయతీ ఎన్నికలలో ఇద్దరు సంతానం నిబంధనలు పెట్టి మున్సిపల్ ఎన్నికలలో ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఇది మైనారిటీ ఓట్ల కోసమా.. ఎన్నికల కోసమా అని అర్థం చేసుకోలేని పరిస్థితుల్లో ప్రజలు లేరని వ్యాఖ్యానించారు. ఎంఐఎం సీఏఏపై ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు, వారి కుట్రలను భగ్నం చేసేందుకు ఈనెల 30న హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో సభలు, ర్యాలీలు నిర్వహిస్తామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ పోటీ చేయాలని బీజేపీ నిర్ణయించింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజాసింగ్, ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# నీ లాంటోళ్ల అంతు చూస్తాం..

- హైదరాబాద్ సీపీపై టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ ధ్వజం
- సోమవారం గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని వెల్లడి



**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్‌పై టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అంజనీ కుమార్ ఐపీఎస్‌గా విధులు నిర్వర్తించడానికి పనికిరాడని, అవినీతిపరుడని, వ్యక్తిత్వం లేనివాడని, దిగజారినోడని విమర్శించారు. నీలాంటి ఓవరాక్షన్ చేసే వాళ్ల అంతు చూస్తాం అంటూ హెచ్చరించారు. శనివారం గాంధీభవన్‌లో జరిగిన 'సత్యాగ్రహ దీక్ష' సందర్భంగా జరిగిన పరిణామాలు, పోలీసుల వైఖరిపై ఉత్తమ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంజనీ కుమార్‌పై ఫైర్ అయ్యారు. 'నిన్న, ఈ రోజు జరిగిన పరిణామాలపై నేను వ్యక్తిగతంగా, కాంగ్రెస్ పార్టీ పరంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాం. జాతీయ పార్టీగా, దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీగా, 135 ఏళ్ల చరిత్ర గల పార్టీ గా, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా మేం ఓ ర్యాలీ నిర్వహిస్తామని కోరితే ఈ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కొందరు తొత్తులు అవమానకరంగా వ్యవహరిస్తూ మా ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారు. గాంధీ భవన్‌లో జరుగుతున్న దీక్షలో పాల్గొనడానికి వచ్చిన కార్యకర్తలను దీక్ష జరుగుతుండగానే నిర్బంధిస్తారా? రాష్ట్ర పోలీసు అధికారులు కేసీఆర్‌కు, ఆర్‌ఎస్‌ఎస్‌కు తొత్తులుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా అంజనీ కుమార్ దిగజారిపోయాడు. మమ్మల్ని అవమానపర్చే విధంగా మాట్లాడాడు. ఆరెస్సెస్ ర్యాలీకి రోడ్లు ఖాళీ చేసి అనుమతినిస్తారా? దారుస్సలాంలో ఎంఐఎం సమావేశాలు జరిగినట్టు మేం కూడా గాంధీభవన్‌లో దీక్ష చేస్తున్నాం. వారికి అనుమతి ఇచ్చినప్పుడు మాకెందుకు ఇవ్వరు? అంజనీ కుమార్.. నీ సంగతి చూస్తాం. ఎక్కడి నుంచో ఉద్యోగం చేసుకోవడానికి వచ్చావు. చేసుకుని పో. నీ వైఖరిపై మేం చాలా సీరియస్‌గా ఉన్నాం. ఇలా ఓవరాక్షన్ చేసిన వారిని ఊరుకోం. అంతు చూస్తాం. ఐపీఎస్ బదులు నువ్వు కేపీఎస్ అని పెట్టుకో. ఇలాంటి చెంచాలు ఐపీఎస్ అధికారులుగా పనికిరారు. అంజనీ కుమార్ చిట్టా తీసి సోమవారం గవర్నర్‌ను కలిసి ఆయన్ను తొలగించాలని ఫిర్యాదు చేస్తాం. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్(8) కింద హైదరాబాద్‌లో శాంతిభద్రతలను పర్యవేక్షించాల్సిన అధికారం గవర్నర్‌కు పదేళ్ల పాటు ఉన్నందున దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరతాం' అని ఉత్తమ్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు.

# ఉత్తమ్ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడు!

- ర్యాలీకి అనుమతివ్వలేదనే కమిషనర్‌పై అభాండాలు
- ఉత్తమ్ వాఖ్యలపై విరుచుకుపడ్డ మంత్రి తలసాని



**సాక్షి, హైదరాబాద్:** ర్యాలీకి అనుమతివ్వలేదనే అక్కసుతో పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్‌పై లేనిపోని అభాండాలు మోపడం పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిగజారుడుతనానికి నిదర్శనమని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఎంపీగా వ్యవహరిస్తున్న ఉత్తమ్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం సరైంది కాదని, శాంతిభద్రతల పరిరక్షణలో కమిషనర్ సేవలు ఎనలేనివని, హైదరాబాద్ పోలీసులకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన అధికారిని తులనాడడం దురదృష్టకరమని విమర్శించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ర్యాలీలు, సభలకు అనుమతిస్తారే తప్ప రాజకీయ పార్టీల ప్రయోజనాలకోసం కాదని గుర్తుంచుకోవాలన్నారు. గతంలో కాంగ్రెస్ నిర్వహించిన పలు కార్యక్రమాలకు అనుమతిచ్చింది కూడా ఈ అధికారే అనే విషయాన్ని ఉత్తమ్ మరచిపోయినట్లున్నారని ఎద్దేవా చేశారు. పోలీసుశాఖపై లేనిపోని ఆరోపణలు చేయడం ఉత్తమ్ లాంటి నాయకులకు తగదని, ఇకనైనా ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడితే మంచిదని తలసాని హెచ్చరించారు. అనుమతిస్తే మంచి అధికారి, అనుమతించకుంటే అవినీతి అధికారి అంటూ మీడియాలో గగ్గోలు పెట్టడం ఆయన చౌకబారు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. క్రమశిక్షణకు మారుపేరైన ఆర్మీలో పనిచేసిన ఉత్తమ్.. ప్రభుత్వ అధికారుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యానించడం మంచిపద్ధతి కాదని శ్రీనివాస్‌యాదవ్ హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గతంలో ఎన్నడు కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లకోసం మాట్లాడని ఉత్తమ్ నేడు ఎన్నికల్లో గెలవలేమనే భయంతో లేనిపోని ఆరోపణలు చేస్తూ ఎన్నికలను వాయిదా వేయాలనుకుంటున్నారని తలసాని అన్నారు.

## ఊహాజనిత అంచనాలు వద్దు

**అన్ని శాఖలకు ఆర్థిక శాఖ సూచనలు**

**సాక్షి, హైదరాబాద్:** రానున్న ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ తయారీ కసరత్తును ఆర్థిక శాఖ ముమ్మరం చేసింది. ప్రతి ఏడాది లాగానే అన్ని శాఖలు తమ శాఖల నిర్వహణకు అవసరమైన నిధులు, సంక్షేమ పథకాలకు అవసరమయ్యే నిధుల అంచనాలతో ఈనెల 28 నుంచే ఆర్థిక శాఖ వెబ్‌సైట్‌లో ప్రతిపాదనల సమర్పణకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు అన్ని శాఖల విభాగాధిపతులు బడ్జెట్ అంచనాల ప్రతిపాదనలకు అనుసరించాల్సిన నిబంధనలతో కూడిన ఉత్తర్వులను ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం విడుదల చేశారు. పథకాల అమలుకు అవసరమయ్యే నిధుల అంచనాలను నిర్ణీత ఫార్మాట్‌లలో ప్రతిపాదించని పక్షంలో ఆర్థిక శాఖ ఎలాంటి బడ్జెట్ విడుదల చేయబోదని, ఇందుకు సంబంధిత శాఖలే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బడ్జెట్ అంచనాల ప్రతిపాదనల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, శాఖలకు అవసరమయ్యే బడ్జెట్ విషయంలో ఊహాజనిత అంచనాలకు పోవద్దని సూచించారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధుల ఖర్చును హేతుబద్ధీకరించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, కార్యాలయాల నిర్వహణ, అద్దెలు, వాహనాలు, నీరు, విద్యుత్ తదితర పథకాల అంచనాలను సమర్పించాలన్నారు.

పేలుడు ధాటికి పూర్తిగా దెబ్బతిన్న కారు



# సోమాలియాలో మారణహోమం

## 78 మంది దుర్మరణం.. 125 మందికి గాయాలు

**మొగదిషు:** సోమాలియా రాజధాని మొగదిషులో శనివారం సంభవించిన భారీ కారు బాంబు పేలుడులో 78 మంది ప్రాణాలు కోల్పోయారు. రాజధానికి నైరుతి ప్రాంతంలోని చెక్‌పోస్ట్ వద్ద ట్రాఫిక్ భారీగా ఉన్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో మృతుల సంఖ్య ఎక్కువగా ఉంది. పేలుడు ధాటికి ఘటనా ప్రాంతంలో మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. కొన్ని మృతదేహాలు గుర్తు పట్టడానికి కూడా వీల్లేకుండా కాలిపోయాయి. కొన్ని వాహనాలు మంటల్లో పూర్తిగా కాలిపోగా మరికొన్ని నుజ్జునుజ్జయ్యాయి. ఈ ఘటనలో కళాశాల బస్సు పేలిపోవడంతో మృతుల్లో అత్యధికులు విద్యార్థులే ఉన్నారు. ప్రస్తుతానికి మృతులు 78 మంది, క్షతగాత్రులు 125 వరకు ఉన్నప్పటికీ ఈ సంఖ్య ఇంకా పెరిగే సూచనలున్నాయని అధికారులు తెలిపారు. ఈ ఘటనకు బాధ్యత తమదేనంటూ ఏ ఉగ్ర సంస్థా ఇప్పటివరకు ప్రకటించుకోలేదు. అల్ ఖాయిదా అనుబంధ అల్ షబాబ్ దేశంలో తరచూ కారు బాంబు దాడులకు పాల్పడుతోంది. శనివారం జరిగిన పేలుడు రెండేళ్లలోనే అత్యంత తీవ్రమైంది. 2017లో మొగదిషులో ట్రక్కు బాంబు పేలి 512 మంది చనిపోగా 300 మంది గాయపడ్డారు.



నెత్తురోడుతున్న బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

## క్లుప్తంగా...

### మీ పని మీరు చూసుకోండి

**ఆర్మీ చీఫ్‌పై మండిపడిన చిదంబరం**

**తిరువనంతపురం:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా ప్రజలు, విద్యార్థులు చేస్తున్న నిరసనలను ఉద్దేశించి ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పి.చిదంబరం మండిపడ్డారు. తిరువనంతపురంలో నిరసన ర్యాలీలో చిదంబరం మాట్లాడారు. 'రాజకీయ నాయకులుగా మేమేం చేయాలో మాకు తెలుసు. ఆర్మీ చీఫ్‌గా మీ పని మీరు చూసుకోండి. యుద్ధంలో ఎలా పోరాడాలో మేం మీకు చెబుతున్నామా? మీ ఆలోచనల ప్రకారం మీరు యుద్ధం చేయండి. రాజకీయ నాయకులుగా మా పని మేం చేస్తాం'అని స్పష్టం చేశారు.

### సీఎం రావత్ ఆస్తులపై ఈసీకి సీబీడీటీ నివేదిక



**న్యూఢిల్లీ:** ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి త్రివేంద్ర సింగ్ రావత్ తన చరాస్తుల విషయం ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించకుండా దాచారని వచ్చిన ఫిర్యాదుపై, కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ).. ఎన్నికల కమిషన్‌కు 'ఫీడ్‌బ్యాక్ రిపోర్ట్' పంపింది. డెహ్రాడూన్ నివాసి నుంచి అందిన ఫిర్యాదు మేరకు, ఎన్నికల నిఘా విభాగం 2017లో దానిని సీబీడీటీకి పంపించి, నివేదిక ఇవ్వాలని కోరింది. ఈ కేసుపై దర్యాప్తును లక్నోలోని ఆదాయపు పన్ను (ఇన్వెస్టిగేషన్) డైరెక్టర్ జనరల్ నిర్వహించారు. 'నివేదిక స్వీయ వివరణాత్మకమైనది'అని సీబీడీటీ నుండి ఎన్నికల సంఘానికి రాసిన లేఖలో స్పష్టం చేశారు.

### మరింత ముదిరిన చలి

**న్యూఢిల్లీ:** ఉత్తరాదిన చలి గాలుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. ఢిల్లీలో శనివారం ఈ సీజన్‌లోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చాలా ప్రాంతాల్లో మైనస్ 2 ఉష్ణోగ్రత నమోదైంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే విమాన సర్వీసులను పొగమంచు కారణంగా దారి మళ్లించినట్లు ఢిల్లీ విమానాశ్రయ అధికారులు తెలిపారు. హౌరా– న్యూఢిల్లీ పూర్వా ఎక్స్‌ప్రెస్ సహా 24 రైళ్లు 2 నుంచి 4 వరకు ఆలస్యంగా నడుస్తున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. ఢిల్లీ–జైపూర్ హైవేపై 15 వాహనాలు ఒకదానినొకటి ఢీకొని ఇద్దరు చనిపోయారు. 12 మంది గాయపడ్డారు. తీవ్ర వాతావరణ పరిస్థితులను సూచిస్తూ జారీ చేసే రెడ్ కలర్ వార్నింగ్‌ను పంజాబ్, హరియాణా, ఢిల్లీ, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, బిహార్‌లకు వాతావరణ విభాగం శనివారం జారీ చేసింది.

### రెండో 'తేజస్' అహ్మదాబాద్–ముంబై మధ్య

**న్యూఢిల్లీ:** ఐఆర్‌సీటీసీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో తేజస్ రైలు త్వరలో అహ్మదాబాద్–ముంబై నగరాల మధ్య పరుగులు పెట్టనుంది. వచ్చే నెల 17న రైల్వే శాఖ తేజస్ రైలు ప్రారంభం కానున్నట్లు సమాచారం. జనవరి 19న కమర్షియల్ సర్వీసు ప్రారంభం కానుంది. గురువారం మినహా వారంలో మిగతా ఆరు రోజులు ఈ రైలు పరుగులు పెట్టనుంది. ఢిల్లీ–లక్నో నగరాల మధ్య తొలి తేజస్ రైలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ప్రయాణికుల సౌకర్యార్థం రైలులో అత్యాధునిక సౌకర్యాలను కల్పించారు. ఒకవేళ రైలు ఆలస్యమైతే ప్రయాణికులకు పరిహారం అందిస్తున్నారు. తేజస్ రైలు ఒక గంట పాటు ఆలస్యమైతే ప్రయాణికులకు రూ.100.. రెండు గంటల కంటే ఎక్కువసేపు ఆలస్యమైతే రూ.250 పరిహారంగా అందిస్తున్నారు.

### గాయపడిన పోలీస్ ప్రాణం కాపాడిన ముస్లిం

**ఆగ్రా:** పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశమంతటా పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల్లో ఓ ముస్లిం మత గురువు మానవత్వం ప్రదర్శించాడు. కోపంతో రాళ్లు విసురుతున్న నిరసనకారుల నుంచి గాయపడిన ఓ పోలీస్ కానిస్టేబుల్‌ను కాపాడాడు. ఉత్తరప్రదేశ్‌లో ఫిరోజాబాద్ జిల్లాలోని ఓ మసీదులో గత వారం ప్రార్థనలు ముగించుకుని వస్తున్న 52 ఏళ్ల హాజీ ఖాదిర్‌కు కానిస్టేబుల్ అజయ్ కుమార్ గాయాలతో కనిపించాడు. నిరసనకారులు అజయ్‌పై దాడికి ప్రయత్నించగా ముందు తనను చంపి కానిస్టేబుల్‌పై దాడి చేయమని ఆందోళనకారులకు అడ్డు నిలిచాడు. అజయ్‌ను దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాడు. పోలీసులు అజయ్‌ను ఆగ్రాలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. ఖాదిర్ ప్రదర్శించిన తెగువ, మానవత్వాలను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

# ఇది రెండో నోట్ల రద్దు..!

- ఎన్పీఆర్, ఎన్నార్సీ అమలుతో దేశంలో తీవ్ర పరిస్థితులు
- గువాహటిలో జరిగిన ర్యాలీలో రాహుల్ విసుర్లు
- కాంగ్రెస్ వ్యవస్థాపక దినం సందర్భంగా దేశవ్యాప్త ప్రదర్శనలు



గువాహటిలో జరిగిన భారీ ర్యాలీనుద్దేశించి ప్రసంగిస్తున్న రాహుల్

**న్యూఢిల్లీ/గువాహటి/లక్నో:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తలపెట్టిన జాతీయ జనాభా పట్టిక(ఎన్పీఆర్), ఎన్నార్సీలు రెండో విడత నోట్లరద్దు వంటివని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఇవి అమలైతే నోట్లరద్దును మించిన దారుణ పరిస్థితులను దేశం మరోసారి ఎదుర్కోనుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ 135వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా అస్సాం రాజధాని గువాహటిలో జరిగిన పార్టీ ర్యాలీలో, అంతకుముందు ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్పీఆర్, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా అస్సాంలో జరిగిన హింసాత్మక ఘటనలు మునుపటి పరిస్థితులను గుర్తుకు తెస్తున్నాయంటూ రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. లక్నోలో జరిగిన వ్యవస్థాపక దినోత్సవంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె.. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితోనే యావత్ దేశం మరోసారి బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతోందని పేర్కొన్నారు. పార్టీ వ్యవస్థాపక దినాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాహుల్ పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ప్రధాని మన్మోహన్, సీనియర్ నేతలు ఏకే ఆంటోనీ, మోతీలాల్ ఓరా, ఆనంద్ శర్మ తదితరులు హాజరయ్యారు. ఎన్పీఆర్, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా ఇప్పటికే నిరసనలు సాగిస్తున్న పార్టీ, వ్యవస్థాపక దినం సందర్భంగా రాజ్యాంగాన్ని రక్షించండి–దేశాన్ని కాపాడండి(సేవ్ కాన్‌స్టిట్యూషన్– సేవ్ ఇండియా) అంటూ రాష్ట్ర రాజధానుల్లో ప్రదర్శనలు చేపట్టింది. భారత్‌కే తమ మొదటి ప్రాధాన్యమని 135వ వ్యవస్థాపక దినం సందర్భంగా కాంగ్రెస్ పేర్కొంది. 'స్వాతంత్ర్య సాధనే లక్ష్యంగా అవతరించిన పార్టీ, దేశమే ప్రథమమనే ఆశయానికి కట్టుబడింది. 135 ఏళ్ల ఐక్యత, 135 ఏళ్ల న్యాయం, 135 ఏళ్ల సమానత్వం, 135 ఏళ్ల అహింస, 135 ఏళ్ల స్వాతంత్ర్యం. నేడు మనం 135 ఏళ్ల భారత జాతీయ కాంగ్రెస్ ఉత్సవాలు జరుపుకుంటున్నాం' అని శనివారం ట్విట్టర్‌లో పేర్కొంది.

**అస్సాం సంస్కృతిని నాశనం చేయనివ్వం**

అస్సాం సంస్కృతి, గుర్తింపులను నాశనం చేసేందుకు బీజేపీ, ఆర్ఎస్ చేస్తున్న ప్రయత్నాలను కొనసాగనివ్వబోమని రాహుల్ స్పష్టం చేశారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాల కారణంగా రాష్ట్రంలో మరోసారి హింసాత్మక వాతావరణ నెలకొనే అవకాశం ఉందన్నారు. ఈశాన్య రాష్ట్రాల గుర్తింపును, భాషలను అణచివేయడం అంటే వారిని బీజేపీ ఇంకా గుర్తించలేదని అర్థమన్నారు. తీవ్ర పోరాటాలతో ఇక్కడి ప్రజలు సాధించుకున్న అస్సాం ఒప్పందాన్ని యథాతథంగా అమలు చేసి, ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించాలని బీజేపీ ప్రభుత్వాన్ని ఆయన కోరారు. బీజేపీ ఉన్న ప్రతిచోటా ప్రజల మధ్య కలహాలు, హింస, విద్వేషం ఉంటాయన్నారు. నోట్లరద్దు, జీఎస్టీ అమలుతో మోదీ ప్రభుత్వం భరతమాతపై దాడి చేసిందని విమర్శించారు. 'ప్రతి పేద వ్యక్తీ భారతీయ పౌరుడా కాదా అని నిరూపించుకోవడమే ఎన్నార్సీ, ఎన్పీఆర్‌ల ఉద్దేశం. ఈ తమాషా అంతా నోట్ల రద్దు రెండో విడత మాదిరిగా మారనుంది. నోట్ల రద్దు కంటే మించి దారుణ పరిస్థితులను ప్రజలు ఎదుర్కోనున్నారు' అని రాహుల్ అన్నారు. అబద్ధాల కోరు అంటూ బీజేపీ తనపై చేస్తున్న విమర్శలపై స్పందిస్తూ.. 'దేశంలో డిటెన్షన్ సెంటర్లు(నిర్బంధ కేంద్రాలు) లేవంటూ ప్రధాని మోదీ చేసిన ప్రసంగం, దానికి జతచేసిన డిటెన్షన్ సెంటర్ ఫొటోతో నేను చేసిన ట్వీట్‌ను మీరు చూసే ఉంటారు. అబద్ధం చెప్పేది ఎవరో మీరే తేల్చండి' అని ఆయన పేర్కొన్నారు.

## పోలీసులు నాపై చేయి చేసుకున్నారు

### ప్రియాంకా గాంధీ ఆరోపణ

లక్నో పోలీసులు తనపై చేయి చేసుకున్నారని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ ఆరోపించారు. సీఏఏ నిరసనల్లో పాల్గొన్నారనే ఆరోపణలతో రిటైర్డు ఐపీఎస్ అధికారి ఎస్ఆర్ దారాపురిని పోలీసులు అరెస్ట్‌చేశారు. ఆయన నివాసానికి ప్రియాంక శనివారం సాయంత్రం నాటకీయ ఫక్కీలో వెళ్లారు. 'దారాపురి నివాసం వైపు వెళ్తుండగా పోలీసులు నా వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో వాహనం దిగి నడిచి వెళ్తుండగా ఓ మహిళా పోలీసు నా గొంతు పట్టుకుంది. మరొకరు నన్ను వెనక్కి నెట్టేయడంతో కింద పడిపోయా. మెడ పట్టుకుని పైకి లేపారు' అని చెప్పారు. 'వారి నుంచి తప్పించుకుని కొంతదూరం నడిచి, మరికొంతదూరం ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేశా. పోలీసులకు తెలియకుండా చివరికి దారాపురి నివాసానికి చేరుకోగలిగా' అని చెప్పారు.



టూవీలర్‌పై వెనుక కూర్చొని వెళ్తున్న ప్రియాంక

# నేడు సీఎంగా హేమంత్ ప్రమాణం

**మరో ఇద్దరు మంత్రులు కూడా..**

**న్యూఢిల్లీ/రాంచీ:** హేమంత్ సోరెన్ నేతృత్వంలో జార్ఖండ్‌లో నూతన ప్రభుత్వం ఆదివారం కొలువుదీరనుంది. ముఖ్యమంత్రిగా హేమంత్ సోరెన్‌తో పాటు కాంగ్రెస్, ఆర్జేడీల నుంచి ఒక్కొక్క మంత్రి చొప్పున ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. జార్ఖండ్ ముక్తి మోర్చా, (జేఎంఎం) దాని భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ)ల్లో మంత్రుల ఎంపిక ఖరారైనట్లు తెలిసింది. దీని ప్రకారం జేఎంఎం నుంచి ఆరుగురికి, కాంగ్రెస్ నుంచి నలుగురికి, ఆర్జేడీ నుంచి ఒకరికి మంత్రి పదవులు ఖరారయ్యాయి. కాంగ్రెస్‌కు అసెంబ్లీ స్పీకర్ పదవి ఇచ్చే అవకాశమున్నట్లు సమాచారం. లేదా మరో మంత్రి పదవి వరించనున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. 81 అసెంబ్లీ స్థానాలున్న జార్ఖండ్‌లో జేఎంఎం 30 స్థానాలు గెలుపొందగా, కాంగ్రెస్ 16, ఆర్జేడీ 1 స్థానం గెలుచుకున్నాయి. అసెంబ్లీలో విశ్వాస పరీక్ష నెగ్గిన తర్వాత మంత్రివర్గ విస్తరణ చేపట్టే అవకాశముందని వెల్లడించాయి. కాగా, కాంగ్రెస్‌లో ఆ పార్టీ సీనియర్ నేతలు అలాంగిర్ ఆలం, రామేశ్వర్ ఓరాన్, రాజేంద్ర ప్రసాద్ సింగ్‌లకు మంత్రి పదవులు దాదాపు ఖరారయ్యారని, మరొకరిని ఎంపిక చేయాల్సి ఉందన్నాయి. ప్రమాణ స్వీకారానికి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్, ముఖ్యమంత్రులు కమల్‌నాథ్ (మధ్యప్రదేశ్), భూపేశ్ బఘేల్ (ఛత్తీస్‌గఢ్), అశోక్ గెహ్లోత్ (రాజస్తాన్), మమతా బెనర్జీ (పశ్చిమ బెంగాల్), ఉద్ధవ్ ఠాక్రే (మహారాష్ట్ర), అరవింద్ కేజ్రీవాల్ (ఢిల్లీ), హాజరుకానున్నారు.



రాంచీలో ఇంట్లో పుస్తకం చదువుతున్న హేమంత్

# యుద్ధనేరాల విచారణకు ఐరాస నిధులు

**2020 బడ్జెట్‌ను ప్రకటించిన ఐరాస**

**ఐక్యరాజ్య సమితి:** సిరియా, మయన్మార్‌లలో జరిగిన యుద్ధ నేరాల విచారణ కోసం ఐక్యరాజ్య సమితి తన బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. 2020 సంవత్సరానికి గాను ఐరాస సర్వ ప్రతినిధి సభ శుక్రవారం 307 కోట్ల డాలర్లను కేటాయించింది. గత ఏడాదితో పోల్చి చూస్తే బడ్జెట్ స్వల్పంగా పెరిగింది. 2019లో 290 కోట్ల డాలర్ల బడ్జెట్ ఉండేది. ఐక్యరాజ్య సమితి సచివాలయానికి అదనపు బాధ్యతలు అప్పగించడం, ద్రవ్యోల్బణం, డాలర్ మారకం విలువలో తేడాల కారణంగా బడ్జెట్‌ను పెంచినట్టు యూఎన్ దౌత్యవేత్తలు వెల్లడించారు. యెమన్‌లో పరిశీలకుల బృందం, హైతిలో రాజకీయ బృందాల ఏర్పాటు, సిరియా అంతర్యుద్ధం, మయన్మార్‌లో రోహింగ్యా ముస్లింలపై జరిగిన దాడులకు సంబంధించిన నేరాలపై విచారణకు ఈ బడ్జెట్‌లో నిధుల్ని వినియోగించనున్నారు. ఇలా యుద్ధ నేరాల విచారణకు ఐక్యరాజ్య సమితి నిధులు కేటాయించడం ఇదే తొలిసారి. గతంలో యూఎన్ స్వచ్ఛందంగా ఈ నేరాల విచారణకు ఆర్థిక సాయాన్ని అందించేది. జూన్‌లో ప్రపంచవ్యాప్తంగా శాంతి స్థాపన కోసం 600 కోట్ల వార్షిక బడ్జెట్‌ను ప్రకటించింది. ఇప్పుడు కొత్త సంవత్సరం వేళ ప్రత్యేకంగా మరో బడ్జెట్‌ను ప్రకటించింది.



ప్రపంచవ్యాప్తంగా సైబర్ నేరాలు అధికమవుతుండడంతో వాటిని నిరోధించడానికి ఒక కొత్త అంతర్జాతీయ ఒప్పందాన్ని ఐరాస రూపొందిస్తోంది. దీనికి సంబంధించిన తీర్మానాన్ని శుక్రవారం ఐరాస సర్వ ప్రతినిధుల సభ ఆమోదించింది. ఈ తీర్మానాన్ని

**కొత్త సైబర్ ఒప్పందం**

యూరోపియన్ యూనియన్, అమెరికా, మరి కొన్ని దేశాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. యూఎన్‌లో ఈ తీర్మానం 79–60 ఓట్ల తేడాతో గట్టెక్కింది. ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు చెందిన నిపుణులతో ఒక కమిటీ వేసి సైబర్ నేరాలు నిరోధించడానికి కసరత్తు జరుగుతుంది.

# రాజస్తాన్ సర్కారు దవాఖానాలో దారుణం

- ఒక్క నెలలోనే 77 మంది శిశువులు మృత్యువాత
- కోటా ప్రభుత్వ ఆస్పత్రిలో వసతులు మృగ్యం



**జైపూర్:** రాజస్తాన్ రాష్ట్రం కోటా నగరంలోని జేకే లోన్ తల్లీ పిల్లల ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక్క డిసెంబర్ నెలలో ఇప్పటి వరకు 77 మంది శిశువులు మృత్యువాతపడ్డారు. ఆస్పత్రిలో అసౌకర్యాలు, పనిచేయని పరికరాల కారణంగానే వీరంతా మృతి చెందినట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సతీశ్ పూనియా ఆరోపించారు. ఇంత దారుణం జరిగినా ప్రభుత్వంలో చలనం లేదని, మంత్రులెవరూ ఆస్పత్రికి వెళ్లి సమీక్షించిన దాఖలాల్లేవని మండిపడ్డారు. అయితే, గడిచిన ఆరేళ్ల గణాంకాలతో పోలిస్తే ఇవే అతి తక్కువ మరణాలని ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ అంటున్నారు. 'గతంలో ఇక్కడ ఏడాదికి 1,500 మంది శిశువులు చనిపోయిన సందర్భాలు ఉన్నాయి. ప్రతి రాష్ట్రంలో, ప్రతి ఆస్పత్రిలో రోజుకు కనీసం ఐదారుగురు పసివాళ్లు చనిపోతూనే ఉంటారు. ఇక్కడా అదే జరుగుతోంది. జేకే ఆస్పత్రిలో శిశు మరణాలను సీరియస్‌గా తీసుకుని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను విధుల నుంచి తొలగించాం' అని వివరించారు. కాగా, పసికందుల మృతిపై కోటా నియోజకవర్గ ఎంపీ, లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా ఆందోళన వ్యక్తం చేశారు. తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## 'పాకిస్తాన్ వెళ్లిపోండి!'

**మీరట్:** పౌరసత్వ సవరణ చట్టాని(సీఏఏ)కి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఆందోళనకారులను 'పాకిస్తాన్ వెళ్లిపోండి' అని మీరట్‌లోని ఓ పోలీసు ఉన్నతాధికారి చేసిన వ్యాఖ్యలు వివాదమయ్యాయి. సీఏఏకి వ్యతిరేకంగా మీరట్‌లో డిసెంబర్ 20న లిసారీ గేట్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో ఆందోళనకారులను ఉద్దేశించి మీరట్ ఎస్పీ అఖిలేష్ నారాయణ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అయ్యింది. 'నిరసన సందర్భంగా పాక్‌కు మద్దతుగా కొందరు నినాదాలు చేస్తున్నారు. భారత్‌లో ఉండి పాకిస్తాన్‌కు మద్దతుగా నినాదాలు చేసే వారు ఆ దేశానికే వెళ్లిపోండి'అని తాను వారికి సలహా ఇచ్చానని సింగ్ చెప్పారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ శనివారం తీవ్రంగా తప్పుబడ్డారు.

# జైట్లీ సంస్కరణలు ప్రశంసనీయం

**పుస్తకావిష్కరణలో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు**

**సాక్షి, న్యూఢిల్లీ:** దేశ హితాన్ని తన ప్రథమ కర్తవ్యంగా భావించి చివరిదాకా అదే సిద్ధాంతానికి కట్టుబడిన వ్యక్తి అరుణ్ జైట్లీ అని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. జైట్లీ జయంతి సందర్భంగా ఢిల్లీలో ఉపరాష్ట్రపతి నివాసంలో 'ద రినైసన్స్ మ్యాన్: ద మేనీ ఫాసెట్స్ ఆఫ్ అరుణ్ జైట్లీ' పుస్తకాన్ని వెంకయ్య ఆవిష్కరించారు. తర్వాత వెంకయ్య మాట్లాడారు. 'జైట్లీ దశాబ్దాలుగా నాకు ఆత్మీయ మిత్రుడు. ముఖ్యమైన సమయాల్లో ఆయన విలువైన సూచనలు ఇచ్చేవారు. అలాంటి జైట్లీ ఇకలేరనే విషయాన్ని ఇప్పటికీ నమ్మలేకున్నా'అని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆర్థిక మంత్రి బాధ్యతలు చేపట్టిన జైట్లీ రాష్ట్రాల ఆర్థిక మంత్రులను కలుపుకొని ఏకాభిప్రాయ సాధనతో కీలకమైన జీఎస్టీ వంటి పన్ను సంస్కరణలు తీసుకొచ్చారని ప్రశంసించారు. పుస్తకాన్ని వెంకయ్య కొడుకు హర్షవర్ధన్, కూతురు దీప తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో జైట్లీ భార్య సంగీత, లోక్‌సభ స్పీకర్ బిర్లా, కేంద్ర మంత్రి మురళీధరన్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్య, జైట్లీ భార్య సంగీత

# అరుణగ్రహంపై జీవం కోసం...

- 'ది మార్స్ 2020 మిషన్' ఆవిష్కరణ
- వచ్చే ఏడాది జూన్‌లో మార్స్‌పైకి దూసుకుపోనున్న రోవర్

**పాసడీనా (అమెరికా):** వచ్చే ఏడాది అరుణ గ్రహంపైకి పంపనున్న 'ది మార్స్ 2020 మిషన్' అంతరిక్ష నౌక (రోవర్) ద్వారా నాసా ఆ గ్రహంపై ఇప్పటివరకు ఏమైనా జీవం ఉందా అన్న అంశాన్ని పరిశోధించనుంది. అంతేకాదు భవిష్యత్తులో మానవుని మనుగడ సాధ్యమవుతుందా అనేది కూడా తెలుసుకోనున్నట్లు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా శాస్త్రవేత్తలు తెలిపారు. అరుణ గ్రహంపైకి పంపనున్న అంతరిక్ష నౌకను శుక్రవారం శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. అమెరికాలోని లాస్‌ఏంజెలెస్ పాసడీనాలో ఉన్న జెట్ ప్రొపల్షన్ ల్యాబొరేటరీలో ఈ నౌకను శాస్త్రవేత్తలు రూపొందించారు. గత వారమే ఈ నౌకను విజయవంతంగా పరీక్షించారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో శాస్త్రవేత్తలు ఈ అంతరిక్ష నౌకను తొలిసారిగా ప్రపంచానికి చూపించారు. ఈ నౌక 2020 జూలైలో ఫ్లోరిడాలోని కేప్ కెనవరెల్ నుంచి అంతరిక్షంలోకి దూసుకుపోయి 2021 ఫిబ్రవరిలో అరుణగ్రహంపై ల్యాండ్ కానుంది. ఈ రోవర్‌పై 23 కెమెరాలు, మార్స్‌పై గాలి శబ్దాలు వినేందుకు రెండు రిసీవర్లు, రసాయనిక చర్యలను విశ్లేషించేందుకు లేజర్లను వాడినట్లు డిప్యూటీ మిషన్ లీడర్ మట్ వాలేస్ తెలిపారు. క్యూరియాసిటీ రోవర్ మాదిరిగానే 6 చక్రాలను అమర్చారు. ఈ రోవర్ దాదాపు కారు పరిమాణంలో ఉంటుంది. అక్కడి ఒక్క రోజులో పూర్తిస్థాయిలో 200 గజాల స్థలాన్ని తూర్పారా పట్టే పనిని రోవర్‌కు అప్పగించారు. దీనికి చేతులు, నేలను తవ్వేందుకు డ్రిల్ అమర్చారు. ఒకప్పుడు అరుణగ్రహంపై వెచ్చటి ఉపరితల జలం, చిక్కటి వాతావరణం, దీని చుట్టూ అయస్కాంత శక్తి ఉండేదని వివరించారు. దీన్నిబట్టి ఏకకణ జీవం ఉండేదని తాము భావిస్తున్నట్లు చెప్పారు. రోవర్ దిగే స్థలంపై పరిశోధన చేశాక ఎంపికచేశారు. ఈ స్థలంలో ఒకప్పుడు సరస్సు ఉండేదని తెలిపారు. 350 కోట్ల ఏళ్ల ఇది నదీ వ్యవస్థతో అనుసంధానమై ఉండొచ్చని భావిస్తున్నట్లు వివరించారు. ఈ రోవర్ ప్రయోగం తర్వాత ప్రతిష్ఠాత్మకమైన అరుణగ్రహంపైకి మానవసహిత అంతరిక్ష నౌకను పంపనున్నారు.



అరుణ గ్రహంపై పరిశోధనలు చేయనున్న రోవర్ ఇదే

## పెజావర పీఠాధిపతి పరిస్థితి విషమం



**సాక్షి బెంగళూరు:** తీవ్ర అనారోగ్యంతో వారం రోజులుగా చికిత్స పొందుతున్న ఉడుపి పెజావర పీఠాధిపతి విశ్వేశతీర్థ స్వామీజీ ఆరోగ్యం క్షీణిస్తోంది. దీంతో లక్షలాది భక్తులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. న్యుమోనియా, పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన చికిత్సకు స్పందించడం లేదు. ఉడుపి సమీపంలోని మణిపాల్ ఆస్పత్రిలో ఆయనను వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఢిల్లీ ఎయిమ్స్ నుంచి కూడా వైద్య నిపుణులు వచ్చారు. మఠంలోనే తుది శ్వాస వదలాలనే ఆయన ఆఖరి కోరిక మేరకు ఆదివారం ఉడుపి శ్రీకృష్ణ మఠానికి తరలించనున్నారు. రక్తపీడనం పడిపోయింది, రెండు రోజులుగా స్వామీజీ స్పృహలో లేరని వైద్యులు తెలిపారు. మెదడు పనిచేయడం లేదన్నారు. స్వామీజీ దాదాపుగా బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు చెబుతున్నారు. శనివారం సీఎం యడియూరప్ప వైద్యులను కలిసి ఆయన ఆరోగ్యంపై విచారించారు.

సాక్షి
6 నల్లగొండ । ఆదివారం । డిసెంబర్ । 29 । 2019
www.sakshi.com

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్యమాసం, తిథి శు.తదియ ఉ.11.32 వరకు, తదుపరి చవితి, నక్షత్రం శ్రవణం రా.8.22 వరకు, తదుపరి ధనిష్ఠ వర్జ్యం రా.11.04 నుంచి 12.46 వరకు దుర్ముహూర్తం సా.4.02 నుంచి 4.46 వరకు, అమృతఘడియలు... ఉ.9.17 నుంచి 11.02 వరకు.

సూర్యోదయం : 6.34
సూర్యాస్తమయం : 5.31
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

# తోడేళ్ల సత్యాగ్రహం!!

## జనతంత్రం


వర్ధెల్లి మురళి

‘ప్రపంచం బాధ శ్రీశ్రీ బాధయితే, కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ’ అని చలం చేసిన వ్యాఖ్యానం తెలుగు సాహిత్యంలో ఒక నానుడిగా నిలిచిపోయింది. సరిగ్గా ఇటువంటి సందర్భమే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను కుదిపేస్తున్నది. అభివృద్ధి వికేంద్రీకరణకు తోడుగా పాలనా వికేంద్రీకరణ కూడా అవసరమన్న ఆలోచనను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించగానే ‘కొంతమంది’కి కాళ్లకింద భూమి కదిలినట్టు అనిపించడం మొదలైంది. ఇలా కదులుతున్న భూమి సుమారు నాలుగున్నరవేల ఎకరాలని ఇప్పటి దాకా తేలింది. గట్టిగా విచారణ జరిగితే ఈ భూమి పరిమాణం మరికొంచెం పెరగొచ్చు. అయితే ఈ ‘కొంతమంది’ చేస్తున్న ప్రచారం భిన్నంగా ఉంది. నాలుగువేల ఎకరాలూ, ముప్ఫయ్ నాలుగువేల ఎకరాలూ కాదు, ఈ భూకంపం ధాటికి యావదాంధ్రదేశం కంపిస్తున్నది. ఇంకా చెప్పాలంటే భారతదేశమే కదిలిపోతున్నదని చెప్పడానికీ, చెప్పించడానికీ ఈ పది రోజుల్లో చేయని ప్రయత్నం లేదు. విసరని రాయి లేదు.

ముందుగా కులం కార్డును ప్రయోగించారు. అమరావతి చుట్టుపట్ల ప్రాంతాల్లో బలంగా వున్న సామాజిక వర్గాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. కులం మీద కక్షతో వ్యవహరిస్తున్నారనీ, ఒక సామాజికవర్గమంతా ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిని సృష్టించారని ఆక్రోశం వెళ్లగక్కారు. కానీ, పెద్దగా స్పందన కనబడలేదు. రాజధానికి భూములిచ్చిన ఆ 29 గ్రామాల్లోని కొంతమంది రైతులు ధర్నాలకు కూర్చోవడం మినహా పక్కనే వున్న విజయవాడలోగానీ, గుంటూరులోగానీ ప్రజలెవరూ వీధుల్లోకి రాలేదు. సీఎం ఆలోచనను తప్పుపట్టనూ లేదు. దీంతో కంగుతిన్న సదరు ‘కొంతమంది’ మరికొన్ని మాయాపాచికలను ప్రయోగించడం మొదలుపెట్టారు. రాష్ట్రంపై అవగాహన లేని ఢిల్లీ ‘మేధావులను’, కొన్ని అద్దె మైకులను రంగంలోకి దించారు. అసలు ఈ ‘కొంతమంది’ ముఠా ఏమిటో ఆ ముఠాకూ కులం కార్డుకూ ఉన్న సంబంధం ఏమిటో ముందుగా పరిశీలిద్దాం.

కృష్ణా డెల్టా చుట్టూ ఆవరించి వున్న ప్రస్తుత కృష్ణా, గుంటూరు జిల్లాలు, పశ్చిమ గోదావరి జిల్లాలో కొంత భాగాన్ని కలిపి పూర్వం కమ్మనాడుగా పిలిచేవారు. ఇక్ష్వాకుల కాలం నాటికే ఈ పేరు వ్యాప్తిలోకి వచ్చిందని చరిత్ర చెబుతున్నది. ఈ రెండున్నర జిల్లాల పరిధిలో నివసించిన వారందరినీ కమ్మవారుగా పిలిచేవారనీ, వారే కాకతీయ, విజయనగర సామ్రాజ్యాల్లో సైనికులుగా, సేనాపతులుగా పనిచేసి దక్షిణదేశమంతటా విస్తరించి కమ్మకులం వారుగా స్థిరపడ్డారనే వాదన వుంది. ఓరుగల్లు కేంద్రంగా ప్రస్తుత తెలంగాణ ప్రాంతాన్ని పరిపాలించిన ముసునూరి కాపయనాయకుడి కాలం నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్టీ రామారావు ప్రమాణ స్వీకారం చేసిన కాలం వరకు, సుమారు ఆరు శతాబ్దాలపాటు అందుబాటులో ఉన్న కమ్మవారి చరిత్ర ప్రగతిశీలమైన ప్రస్థానంగానే పరిగణించాలి. కృషితో నాస్తి దుర్భిక్షం అనే సూత్రాన్ని నమ్ముకొని ఎదిగారు. శ్రమ, తెలివితేటలు పెట్టుబడులుగా అన్ని జీవన రంగాలకు క్రమంగా విస్తరించారు. జాతీయోద్యమం, సంఘ సంస్కరణ ఉద్యమాల్లో వీరి పాత్ర గణనీయంగానే ఉన్నది. ముఖ్యంగా హేతువాద ఉద్యమం కమ్యూనిస్టు ఉద్యమాలకు వెన్నెముకలుగా వీరు నిలిచారు. ఈ రెండు ఉద్యమాల ప్రభావం వీరిపై బలంగా ఉన్నందువలన మెజారిటీ కమ్మవారు అభ్యుదయ వాదులుగా, సామాజిక మార్పులను స్వాగతించేవారుగా స్థిరపడినారు.




త్రిపురనేని రామస్వామి చౌదరి వంటి సంస్కర్తలు, చంద్ర, మాకినేని, మోటూరి, వేములపల్లి వంటి ఆదర్శ కమ్యూనిస్టులు ఎన్జీరంగా వంటి జాతీయ నాయకులు, వెలగపూడి, ముళ్లపూడి, కెఎల్ఎన్ ప్రసాద్ తదితర పారిశ్రామిక కుటుంబాలు, ఎన్టీఆర్, అక్కినేని వంటి నటశిఖరాలు, నార్ల, ఏబీకే తదితర పాత్రికేయ దిగ్గజాలు వారి వారి రంగాల్లో నూతన ప్రమాణాలను నెలకొల్పారు.

ఎన్టీఆర్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎనభయ్యో దశకం చివరి రోజుల నుంచి పరిస్థితులు మారడం ప్రారంభమైంది. చంద్రబాబు జమానా మొదలైన దగ్గర నుంచి ఈ మార్పులు వేగం పుంజుకొని తెలుగుదేశం పార్టీలో, కమ్మవారిలో నడమంత్రపు శ్రీమంతుల ప్రాబల్యం పెరిగింది. స్వయానా చంద్రబాబు నాయకత్వంలోనే, రాజకీయవేత్తలు, మీడియా ప్రముఖులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, విద్యావ్యాపారవేత్తలు, వైద్యవ్యాపారవేత్తలు, కొందరు సినీరంగం వారితో కూడిన ఒక అనధికార సిండికేట్ వ్యవస్థ ఉనికిలోకి వచ్చింది. ఈ సిండికేట్ ముఠాలో కోర్ గ్రూప్‌గా కమ్మవారే ఉన్నప్పటికీ, కొంతమంది ఇతరులకు కూడా ప్రవేశం లభించింది. కృషితో నాస్తి దుర్భిక్షం అనే తొలి నాటి ఆదర్శం స్థానంలో ఎలాగైనా సంపాదించు అనే కొత్త సూత్రం తెరపైకి వచ్చింది. డబ్బుతో దేన్నయినా కొనవచ్చు అనేది ఈ ముఠా మౌలిక సిద్ధాంతం వీరికి పెత్తనం లభించిన దగ్గరనుంచే ఓట్లను కొనుగోలు చేయడం, ప్రజాస్వామిక వ్యవస్థలను దిగజార్చడం, రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టుపట్టించడం తెలుగునాట ప్రారంభమైంది. ఈ నయాధోరణి మిగిలిన నాయకులు, కార్యకర్తల శ్రేణుల్లోకి ప్రవేశించింది. అభ్యుదయ భావాల స్థానంలో వారి మెదళ్లలో ఆధిపత్య భావజాలం ప్రవేశించింది. ఒంటినిండా అహంభావం రుద్దుకున్నారు. రెండున్నర జిల్లాల ఆధిపత్య ధోరణులకు నిరసనగానే తొంభయ్యో దశకంలో తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన యథార్థాన్ని ఇక్కడ గుర్తుతెచ్చుకోవాలి. రెండున్నర జిల్లాల పట్ల వ్యతిరేకత క్రమంగా ఆంధ్ర వ్యతిరేకతగా మారి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉధృతమైంది. రాష్ట్ర విభజన తర్వాత తిరిగి చంద్రబాబు అధికారంలోకి రావడంతో ఈ ఆధిపత్యపు ఆగడాలు మరీ శృతిమించినట్టు మొన్నటి ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. కమ్మనాడుగా భావించే రెండున్నర జిల్లాల్లోని 40 అసెంబ్లీ సీట్లలో చచ్చీచెడి నాలుగు సీట్లను మాత్రమే టీడీపీ గెలుచుకోగలిగింది. నడమంత్రపు సిరి ముఠా కారణంగానే మిగతా సామాజిక వర్గాల నుంచి తాము వేరుపడిపోతు న్నామన్న గ్రహింపు ఎన్నికల తర్వాత సాధారణ కమ్మ వారిలో వచ్చిందని చెబుతున్నారు. అందుకనే ‘కొంతమంది’ ముఠా సభ్యులు చేసిన ‘భూకంప’ బాధిత ఆక్రందనను వారు పట్టించుకోలేదని, కులం కార్డు ఫలితమివ్వక పోవడంతో ఈ ముఠా ఇతర ప్రయత్నాలు ప్రారంభించిందని చెబుతున్నారు.

తాజాగా శేఖర్‌గుప్తా అనే ఒక సీనియర్ ఇంగ్లిష్ పాత్రికేయుని వీడియో స్టోరీని ప్రచారంలో పెట్టారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవరకు శేఖర్ గుప్తా అవగాహనా రాహిత్యాన్ని ఈ కథనం ఎత్తిచూపింది. తూర్పుతీరంలో ఒక మహానగరం అవసరం అంటాడు. ఇప్పటికే అక్కడ అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నాన్ని విస్మరించి గ్రీన్‌ఫీల్డ్ నగరం కావాలంటాడు. చండీగఢ్ తర్వాత మరో గ్రీన్‌ఫీల్డ్ నగరం రాలేదని వాపోతాడు. దేశ విభజన జరిగినప్పుడు పంజాబ్ రెండు ముక్కలై పెద్దముక్క పాకిస్తాన్‌లోకి వెళ్లింది. దాంతోపాటు లాహోర్ మహానగరం కూడా పాకిస్తాన్‌కు వెళ్లింది. ఇండియాలో మిగిలిన పంజాబ్ రాజధాని అవసరాలను తీర్చడానికి 1952లో చండీగఢ్‌ను నిర్మించారు. లాహోర్ లేని లోటును చండీగఢ్ తీర్చగలిగిందా? ఉమ్మడి పంజాబ్‌లో (ప్రస్తుత హర్యానా) జన్మించిన శేఖర్ గుప్తా పుర్రెలో ఈ ప్రశ్న మొలకెత్తలేదా? మరో వందేళ్లకు కూడా లాహోర్ వంటి మహానగరంగా చండీగఢ్ తయారు కాలేదు. లాహోర్‌ను పక్కనబెడదాం. పంజాబ్ గ్రామీణ ప్రాంతాల నుంచి వలస వచ్చే ప్రజలకు పంజాబ్‌లోని లూథియానా నగరం కల్పించగలిగినంత ఉపాధి అవకాశాలను కూడా కల్పించలేని స్థితిలో చండీగఢ్ వున్నది. అటువంటప్పుడు మన గ్రీన్‌ఫీల్డ్ అమరావతి ఎన్ని వందల యేళ్లకు మహా నగరం అవుతుంది? మూడు రాజధానుల ప్రకటన చూస్తుంటే ‘తుగ్లక్ డబుల్ కెఫీన్‌తో 20 కప్పుల కాఫీ తాగి తీసుకున్న నిర్ణయంలా’ ఉందని అక్కసుతో కూడిన వ్యాఖ్యానం చేశాడు. ఇటువంటి వాక్యాలు రాయాలంటే నాలుగు పెగ్గులైనా వేసి ఉండాలి, లేదా ఎవరైనా రాసిచ్చినదైనా చదివి ఉండాలి. ఇటువంటి ప్రీ ఫ్యాబ్రి కేటెడ్ రచనలు ఇకముందు మరిన్ని వెల్లువెత్తవచ్చు. ప్రజల వివేకం మీద మన నడమంత్రపు సిరి ముఠాకు చిన్నచూపు కనుక ఇటువంటి ప్రయత్నాలను కొన సాగిస్తూనే వుంటారు.

అమరావతి నుంచి రాజధానిని తరలిస్తున్నారన్న ప్రచారం నిజానికి వాస్తవ దూరం. శాసనసభ అక్కడే వుంటుంది. దాని సిబ్బంది అక్కడే ఉంటుంది. మంత్రులూ, ఎమ్మెల్యే క్వార్టర్లు అక్కడే వుంటాయి. హైకోర్టు కర్నూలుకు వెళుతుంది. సెక్రటేరియట్, ముఖ్యమంత్రి కార్యాలయం విశాఖ వెళ్తాయి. అంటే అమరావతి గ్రాండ్ డిజైన్‌లోంచి ఐదారువేల మంది పనిచేసే వ్యవస్థలను మాత్రమే ఇప్పుడు తగ్గించారు. ఆ వ్యవస్థలకు బదులుగా మెడికల్, ఎడ్యుకేషనల్ హబ్‌లను అమరావతికి కేటాయిస్తారని వార్తలు వస్తున్నాయి. శుక్రవారం నాడు జరిగిన కేబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రాధమ్యాలపై కీలకమైన చర్చ జరిగినట్టు తెలిసింది. మానవ వనరుల అభివృద్ధిపై పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే సంకల్పించింది. నాడు – నేడు కార్యక్రమం పేరుతో పాఠశాలలు, వైద్యశాలల అభివృద్ధికి 26 వేల కోట్లు ఖర్చు చేయవలసి వుంది. గ్రేటర్ రాయలసీమ ప్రాంతాలకు గోదావరి జలాలను తరలించే కార్యక్రమానికి 60 వేల కోట్లు ఖర్చు చేయవలసి వుంటుంది. వైఎస్ ప్రారంభించిన జలయజ్ఞం ప్రాజెక్టులు పూర్తికావడానికి మరో 25 వేల కోట్లు కావాలి. రైతు భరోసా, అమ్మ ఒడి, సామాజిక పెన్షన్లు, తాగునీటి సరఫరా గ్రిడ్ మొదలైన పథకాలకు భారీగా నిధులు అవసరమవుతాయి. ఈ నేపథ్యంలో ఒక్క రాజధాని నగరం మీద ఎకాఎకిన ఒక లక్షా పదివేల కోట్ల రూపాయలను ఖర్చు చేయడం అసాధ్యం. బాబు తొలి ఐదేళ్లలో ఖర్చు పెట్టినట్టు కేవలం ఐదారువేల కోట్లను మాత్రమే మరో ఐదేళ్లలో ఖర్చుచేసే వెసులుబాటు వుంటుంది. ఈ లెక్కన వందేళ్లకుగానీ అమరావతికి ఒక రూపం ఏర్పడదు. అదే పదివేల కోట్లు ఖర్చు చేస్తే విశాఖ నగరం మౌలిక వసతులు భారీగా అభివృద్ధి చెంది ఉపాధి అవకాశాలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతాయి. ఈ పరిస్థితుల్లో ఇంగితంతో కూడిన నిర్ణయం తీసుకోకపోతే మన పరిస్థితి ‘న ఘర్‌కా.. న ఘాట్‌కా’ చందంగా తయారవుతుందని సమావేశంలో సీఎం కామెంట్ చేసినట్టు సమాచారం.

జీఎన్ రావు కమిటీ నివేదికలో సూచించినట్టుగా విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా ప్రకటించినట్లయితే, ముఖ్యమంత్రి పీఠం అక్కడే వుంటే, ఆయనే స్వయంగా నగర అభివృద్ధిని పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. ఆగ్నేయాసియా దేశాలకు, ఇండో–చైనా దేశాలకు, దూర ప్రాచ్య దేశాలకు భారతీయ గేట్‌వేగా ఉండగల లొకేషన్, నగరం తలాపున దేశంలో ఏ నగరానికి అందు బాటులో లేనన్ని ఖనిజ నిక్షేపాలు ఉన్న కారణంగా రానున్న ఐదు పదేళ్లలోనే ఆంధ్రరాష్ట్ర గ్రోత్ ఇంజన్‌గా నిలబడగల అర్హతను సాధించి, ఆ తర్వాతి కాలంలో దేశంలోని అగ్రశ్రేణి నగరాల సరసన చేరగల అన్ని అర్హతలూ విశాఖ నగరానికి ఉన్నాయి.

muralivardelli@yahoo.co.in

## బిపిన్ రావత్ (ఆర్మీ చీఫ్)
# రాయని డైరీ

మాధవ్ శింగరాజు

మంచి మాట చెప్పడానికి లేనప్పుడు మంచి స్థానంలో ఉండి వ్యర్థమనిపిస్తుంది. ‘ పిల్లల్ని చదువుకోనివ్వండి. వాళ్ల హాస్టళ్లలోకి వెళ్లి పాలిటిక్స్ ప్లే చెయ్యకండి’ అని మంచి చెప్పినందుకు..‘ఆర్మీ చీఫ్ మంచి చెప్పడం ఏంటని’ రెండు రోజులుగా దేశంలో మంచి–చెడు, భారత్–పాక్, హిందూ–ముస్లిం అని డివైడ్ టాక్ నడుస్తోంది! దేశం ఒక్కటే, దేశంలోని మనుషులంతా ఒక్కటే అని మళ్లీ నాచేత మంచి చెప్పించుకునేంత వరకు ఈ నాయకులు ఆగేలా లేరు.

మంచి చెప్పేవాళ్లు లేకపోతే మంచి చెయ్యడానికి ఆర్మీ దిగవలసి వస్తుంది. ఒకేసారి మంచి చెయ్యడానికి దిగకుండా, మొదటే మంచి చెబితే మంచికి దిగే అవసరం ఉండదని చెప్పడం మంచి ప్రయత్నమే కదా!

అయినా నేనెందుకు మంచి మాట్లాడానో నాకు గుర్తుకు రావడం లేదు. నా చేత మంచిని మాట్లాడించిన వాళ్లెవరో కూడా గుర్తు లేదు. ఏదో హెల్త్ ప్రోగ్రామ్‌కి పిలిస్తే వెళ్లాను. బాగా గుర్తు చేసుకుంటే అక్కడ నేను మాట్లాడిన రెండు మంచి మాటలు మాత్రం గుర్తుకొస్తున్నాయి. నాయకుడంటే ఎలా ఉండాలో చెప్పాను. నాయకుడు ముందు నడవాలనో, వెనకుండి ముందుకు నడిపించాలనో చెప్పాను. అంత వరకే!

ఇంటికొచ్చి టీవీ చూసుకుంటే.. నేను వెళ్లిన హెల్త్ ప్రోగ్రామ్ రావడం లేదు. హెల్త్ ప్రోగ్రామ్‌లో నేను మాట్లాడిన మంచి మాటలు రావడం లేదు. యోగేంద్ర యాదవ్ అనే ఆయన టెలికాస్ట్ అవుతున్నాడు! ‘ఆయన అన్నది నిజమే’ అంటున్నాడు. ‘మోదీని దృష్టిలో పెట్టుకునే ఆయన ఆ మాట అన్నాడు’ అంటున్నాడు. ఎవరీయన అని చూశాను. ‘హక్కుల కార్యకర్త’ అని పేరు కింద



వేస్తున్నారు. ‘ఆయన’ అని ఆయన అంటున్నది నా గురించే!

దిగ్విజయ్ సింగ్, అసదుద్దీన్ ఒవైసీ, బ్రిజేష్ కాలప్ప.. ఇంకా ఎవరెవరో స్క్రీన్ మీదకు వచ్చిపోతున్నారు. కాలప్ప పేరు వినగానే నాకు జనరల్ కరియప్ప గుర్తుకొచ్చారు. ఇండియన్ ఆర్మీ ఫస్ట్ జనరల్ ఆయన. కరియప్ప కూడా డ్యూటీలో ఉండగా మంచి మాట్లాడే ఉంటారు. అప్పుడిన్ని పేపర్లు, ఇన్ని టీవీ చానళ్లు, ఇన్ని ప్రతిపక్షాల లేవు కాబట్టి ఆయన మంచి మాటలు రంగు మారకుండా మంచి మాటలుగానే ప్రజల్లోకి వెళ్లి ఉంటాయి.

ఈ కాలప్ప ఎవరా అని చూశాను. కాంగ్రెస్ స్పోక్స్‌పర్సన్! ‘పౌరసత్వ చట్టం గురించి రావత్‌ని మాట్లాడనిస్తే, చట్టాన్ని తీసుకెళ్లి ఆయన చేతుల్లో పెట్టినట్లే’ అంటున్నాడు! ఒవైసీ కూడా వేలు పైకెత్తాడు. ‘నిన్ను నువ్వు తెలుసుకో’ అంటున్నాడు. అంటే నన్ను హద్దుల్లో ఉండమని! ఆయనకెప్పుడూ హద్దుల గొడవే! దిగ్విజయ్ కూడా ఏదో అన్నాడు కానీ, ఏదో ఒకటి అనకపోతే బాగుండదన్నట్లుగా అన్నాడు.

‘పర్స్ జాగ్రత్త’ అని అకౌంటెంట్ జనరల్ చెబితే తప్పు లేదు, ‘పాలన జాగ్రత్త’ అని అటార్నీ జనరల్ చెబితే తప్పు లేదు, ‘విద్యార్థులు జాగ్రత్త’ అని ఆర్మీ జనరల్ చెబితే తప్పయిందా!

నేనైనా నాయకులు ఎలా ఉండాలో చెప్పకుండా, ప్రజలు ఎలా ఉండాలో చెప్పి ఉండాల్సింది. ఆ తేడాను నాయకులు అర్థం చేసుకునేలోపు నా రిటైర్మెంట్ వచ్చేసేది. అప్పుడీ ఒవైసీకి, కాలప్పకీ మాట్లాడ్డానికి ఏమీ దొరక్కపోయేది.

డిసెంబర్ 31న నా రిటైర్మెంట్. కొత్తగా పెట్టిన ‘చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్’ పోస్టులోకి నన్ను తీసుకోవడం కోసం మోదీకి అనుకూలంగా మాట్లాడానని వీళ్ల అనుమానం. పైకి మాట్లాడేవారికి మోదీ ఎప్పుడూ పవర్ ఇవ్వలేదు. నేనూ అంతే. పవర్ కోసం పైకి మాట్లాడకుండా ఉన్నదెప్పుడూ లేదు. పవర్ రావడం, పవర్‌లో ఉండటం, పవర్ పోవడం.. వీటి గురించి పవర్‌ఫుల్ మనుషులెప్పుడూ పట్టించుకోరు.

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### అంతర్జాతీయం



“ఇది అంతర్జాతీయ అవమానం. అంతర్జాతీయ బాలల హక్కుల ఒడంబడిక ఆమోదానికి ‘బీజేపీ పాలనలో ఉన్న ఉత్తరప్రదేశ్‌కు ఇది వర్తించదని’ ప్రభుత్వం ఒక అనుబంధం చేర్చాలి. సిగ్గుచేటు”
– శశిథరూర్, ఎంపీ

### సందర్భం



“దేశంలో టెలివిజన్ మీడియా ఒక ప్రత్యేక చారిత్రక సందర్భంలో నడుస్తోంది. ఈ మీడియాలో పనిచేస్తున్నవారు అశక్తులకు, అణచివేతకు గురయ్యేవారికీ అండగా నిలుస్తారా లేక కక్ష సాధింపుతో అధికార మదంతో వ్యవహరించే వారికి వత్తాసు పలికి చరిత్రలో కలిసిపోతారో వారే నిర్ణయించుకోవాలి”
– మిర్జా వాహెద్, జర్నలిస్ట్

### నమ్మొద్దు



“మన గోప్యత హక్కుకు, డేటా సంరక్షణకు చట్టపరమైన రక్షణ లేనప్పుడు జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) అయినా, ఎన్నార్సీ అయినా ఒకటే. ప్రస్తుత డేటా సంరక్షణ బిల్లు ప్రభుత్వానికి అపరిమిత హక్కులిస్తోంది. ఈ అబద్ధాల ప్రభుత్వాన్ని నమ్మడానికి లేదు. ఎన్పీఆర్ వద్దు, ఎన్నార్సీ వద్దు, సీఏఏ వద్దు”
– మహువా మొయిత్రా, ఎంపీ

### వెళ్లండి



“పాకిస్తాన్ జిందాబాద్ అనే వారిని పాకిస్తాన్ వెళ్లమన కుండా ఇంకేమంటాం? భారతదేశంపై తీవ్ర ద్వేషం ఉండి, పోలీసులపై రాళ్లు రువ్వేకంటే.. పాకిస్తాన్‌ను అంత ఇష్టంగా ప్రేమిస్తున్నప్పుడు అక్కడికే వెళ్లండి. అందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ మేం చేస్తామని ఉత్తరప్రదేశ్ పోలీసులు అంటున్నారు”
– మహేష్ విక్రమ్ హెగ్డే, జర్నలిస్ట్

### ఇద్దరు



“దేశంలో అత్యంత ప్రమాదకరమైన ‘టుక్డే టుక్డే గ్యాంగ్’లో చాలా ప్రమాదకరమైన ఇద్దరు దుర్యోధనుడు, దుశ్శాసనుడు. వాళ్లిద్దరూ బీజేపీలోనే ఉన్నారు. వారిపట్ల అప్రమత్తంగా ఉండండి”
– యశ్వంత్ సిన్హా, కేంద్ర మాజీ మంత్రి

### అభిప్రాయం



“ఎన్నో ఏళ్లుగా సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో నాకు చాలా తీవ్రమైన అభిప్రాయ భేదాలు ఉన్నాయి. సుమారు 2006వ సంవత్సరం నుంచి ఆయన జరిపే చర్చల్లో అతిథిగా పాల్గొంటున్నా. ఆ విషయం బహిరంగంగానే చెప్పా. మేం ఒకరిని ఒకరం బ్లాక్ కూడా చేసుకున్నాం. అయితే, మేమెప్పుడూ ఒకరినొకరం తిట్టుకోలేదు, దిగజారుడుగా వ్యవహరించలేదు”
– ఆదిత్యా రాజ్ కౌల్, జర్నలిస్ట్

### లాభం



“ఈరోజు ఓ సోమాలియా వ్యక్తి కారుతో ఆత్మాహుతి దాడికి పాల్పడి 65 మంది అమాయక ప్రజల మృతికి కారకుడయ్యాడు. అతడూ చనిపోయాడు. దీని వల్ల ఇస్లాం లాభపడిందా? నిజానికి లేదు. ఎంత కాలం ముస్లింలు తమ మూర్ఖత్వాన్ని ప్రదర్శిస్తారు?”
– తస్లీమా నస్రీన్, రచయిత్రి

## నిశ్శబ్ద నిష్క్రమణ

సమాజాన్ని తమ పదునైన పదాలతో, కవితలతో ఊపేసిన దిగంబర కవుల్లో ఒకరైన భైరవయ్య నిశ్శబ్దంగా నిష్క్రమించారు. తదనంతరం దిగంబర కవుల్లోని ఆరుగురిలో నలుగురు విరసంలోకి వెళ్లగా, మహాస్వప్నతో కలిసి భైరవయ్య బయటే ఉండిపోయారు. ఆ సందర్భంలోనే ‘రా’ అనే కవితా సంపుటి వెలువరించారు. 8 డిసెంబర్ 1942లో నరసాపురంలో జన్మించిన ఆయన విజయవాడ, హైదరాబాద్‌లో చదువుకున్నారు. మొదట్లో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేసినా తరువాత విశాఖ వెళ్లి ప్రింటింగ్ ప్రెస్ నిర్వహించారు. అప్పటికే సాహిత్యంతో, సాహితీవేత్తలతో ఆయనకు సంబంధాలు దాదాపు తెగిపోయాయి. కొంతకాలానికి విజయనగరం జిల్లా బొబ్బిలికి సమీపంలోని దత్తిరాజేరు దగ్గర వింధ్యవాసి గ్రామంలో భైరవానంద స్వామిగా ఒక ఆచార్యపీఠం నెలకొల్పారు. ఈ నెల 19న చివరి శ్వాస విడిచిన ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన జీవితం ఎన్ని మలుపులు తిరిగినా సాహిత్యాభిమానులకు ఆయన భైరవయ్యగానే ఎప్పటికీ గుర్తుండిపోతారు.


నివాళి

–దేశరాజు

# పోతనాంతరంగం భాగవతం

భాగవతం అమృతఫలం అందించిన పోతన నాదోపాసకుడు. సంగీత, సాహిత్య మర్మములెరిగినవాడు. ఈ విషయం పోతన పద్యనడకల్లో బహిర్గతమవుతుంది. భాగవతాన్ని అనుభవించి ఆ అనుభవ, అనుభూతులను పద్యమకరందంలో అందించిన ధన్యుడు కూడా పోతన అన్నది విదితమే. భాగవతం ద్వితీయ స్కందంలో అద్వితీయంగా నాదోపాసనను గురించి స్పష్టం చేశాడు పోతన. దానికి ప్రత్యక్షోదాహరణం ఈ పద్యం

*‘‘సీ. సాంద్ర శరచ్చంద్ర చంద్రికా ధవళిత*
*విమల బృందావన వీధియందు*
*దనరి దైవత రుషభ గాంధార నిషాద*
*పంచమ షడ్జమధ్యమ స్వరములోని*
*గళాలు జాతులు మూర్ఛనల్ గలుగ వేణు*
*నాళ వివరాంగుళాన్యాస లాలనమున*
*మహిత గతింబాడె నవ్యక్త మధురముగను*
*బంకజాక్షుండు దారువు లంకురింప’’ (భాగవతం 2–188)*

పై పద్యం ద్వారా పోతన తనకు గల సంగీత పాండిత్యాన్ని బహిర్గతం చేశాడు. పద్యాదిలో చంద్రిక రాగ ప్రస్తావన కనబడుతుంది. అంతేగాకుండా చంద్రిక రాగ ప్రస్తారాన్ని ఆరోహణ, అవరోహణల్లో నిర్దేశించాడు. పైపద్యం ఒక్కటిచాలు పోతన సంగీత పాండిత్యాన్ని తెలుసుకోవడానికి.

అలాగే లక్షణ శ్రీకృష్ణుని పరిణయ మాడిన వైనాన్ని తెలుపుతున్న (దశమస్కందం ఉత్తర భాగం 1096) సందర్భంలో పోతన పద్యాన్ని ఇలా రాగబద్ధం చేశాడు.

‘చం. కొలదిక మీరంగా డమరు గోముఖ డిండిమ.... నటీనటనముల్ దనరాశి’’(భాగవతం 10 ఉభా –1096)

పై పద్యంలో పదిహేను వాద్య విశేషాలను తన నాదోపాసనా ప్రతిభకు తార్కాణంగా తెలియ చేశాడు పోతన. మరోపద్యం భాగవతం దశమ స్కందంలో 767 పద్యంలో..

**‘‘తే. మౌళి పింఛము కంఠధామమున మెరయ**
**విలసిత గ్రామముగ నొక్క వేణువందు**
**బ్రహ్మగాంధర్వ గీతంబు పరగజేసె జతుర**
**నటమూర్తి గోపాలచక్రవర్తి’**

పై పద్యంలో భువనమోహినీ రాగాల ప్రస్తావన కనిపిస్తుంది. పోతన భాగవతంలో ప్రయోగించిన పదప్రయోగాల లాలిత్యానికి సంగీతం ఒక భాగమైంది. భాగవతాన్ని సంగీత సాహిత్య సమలంకృతంగా శ్రీవాణి పదార్చన చేసి ఆ భాగవత ఫలాన్ని శ్రీరామాంకితం చేసి తను ధన్యుడై ప్రపంచ జాతిని ధన్యుల్ని చేశాడు.

శిక్షలు, వివాహ వేడుకలు, ఆటలు, చల్దులు, ఊరగాయలు తెలుగువారికి చవిచూపిన చతురుడు పోతన అంటే అతిశయోక్తి కాదేమో. పోతన నానుడులు కూడా అసలైన తెలుగుతనంతో దర్శింపచేశాడు. 'ఊరకరారు మహాత్ములు', 'వారిజాక్షులందు వైవాహికములందు' వంటివి గూడా పరిచయం చేశాడు. కుచేలుని 'బహుకుటుంబి'గా పరిచయం చేస్తాడు. అంతే కాకుండా తన భాగవ



తంలో భక్తిచేత మాత్రమే భగవంతుడు సంతసిస్తాడని ప్రహ్లాదుని చేత పలికిస్తాడు. భగవంతుడు నిరంతరం భక్తులను కనిపెట్టుకుని ఉంటాడనే సత్యానికి ఒక ఉపమానాన్ని కూడా జోడిస్తాడు.

**‘‘నాకు మేలుగోరు నా భక్తుడగువాడు**
**భక్త జనుల కాన పరమగతియు**
**భక్తుడెందు చనిన బరతెంతు వెనువెంట**
**గోవు వెంట దగులు కోడె భంగి’’ (9–118)**

పై పద్యం అంతలో ‘గోవు వెంట దగులు కోడె భంగి’ అనే ప్రయోగం అర్థవంతమైన అర్థాలంకారంతో అలరారింది. పోతన భాగవతంలో ప్రయోగించిన ప్రతి అంశం ఒక నిర్దిష్ట ప్రమాణంలో ఉంటుంది. గజేంద్రమోక్ష ఘట్టంలో సార్వజనీన తత్వం, సార్వకాలీనత్వం కనిపిస్తుంది. నిత్యం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడే జీవులంతా కూడా గజేంద్రుని వంటి వారే. నిరంతరం భగవంతుని కరుణకై ప్రార్థిస్తున్న వారే. ఈ విషయాన్ని నాడే గజేంద్రుని నోట పోతన ఇలా పల్కించాడు. **‘‘భక్తజనముల దీనులి పాలివాడు**
**వినడె చూడడె తలపడ వేగరాడె’’ (8–87)**

అలాగే నిర్గుణ పరబ్రహ్మ తత్వాన్ని పోతన గజేంద్రమోక్షంలో అద్భుతంగా తెలియజేశాడు. **‘‘లావొక్కింతయు.... సంరక్షింపు భద్రాత్మకా’’** పద్యం పోతన తెలియజేసిన పరబ్రహ్మ తత్వానికి సాక్షీభూతంగా నిలుస్తుంది. పోతన గజేంద్రుని మొరను అతనిపరంగానే కాక విశ్వం లోని జీవులందరి పరంచేస్తూ తెలియజేశాడు. విద్య అవసరాన్ని నాడే పోతన గుర్తించి వ్యక్తి, వ్యవస్థల పరంగా ఇలా తెలియజేశాడు.

**‘‘చదువని వాడజ్ఞుండగు**
**చదివిన సరసద్వివేక చతురత కలుగున్**
**జదువగ వలయును జనులకు**
**జదివించెద నార్యులొద్ద జదువుము తండ్రీ’’**

పోతన భాగవత సమాజాన్ని మనసుతోనూ, తాను ఉన్న సమాజాన్ని ధర్మదృష్టితోనూ పరిశీలించాడు. వ్యక్తి వ్యవస్థ పరస్పరం ఒక ఆధారభూతం అంటూ అందుకు అనేక తార్కాణాలతో భాగవత ఆంధ్రీకరణలో తెలియజేశాడు. వ్యక్తి సత్యవ్రతం వ్యవస్థకు ఆదర్శం కావాలని అభిలషించాడు. అలాగే వ్యక్తి ప్రవర్తనపరంగా గర్వం కూడనిదని, గర్వించిన వారంతా కనుమరుగయ్యారని వామనావతార ఘట్టంలో రాక్షసరాజు బలి నోట పలికించాడు (8.590). **‘కారే రాజులు రాజ్యముల్‌గలుగవే గర్వోన్నతింబొందరే, వారేరి సిరిమూట గట్టుకుని పోవంజాలిరే’** అనే తన ప్రకటిత భావానికి బలిని ఎంచు కుని పై భావాన్ని తెలియజేశాడు.

తన జీవితంలో తృప్తిని ఎంతగా పొందాడో దాన్నే వామనునిచే తెలియజేశాడు. **‘దృష్టిం చెందని మనుజుడు సప్త ద్వీపములైన జక్కంబడునె’ (8–573)** అని తెలిపాడు. ఇది ఒక రకంగా చెప్పాలంటే పోతన అంతరంగ ఆవిష్కరణే. వ్యక్తి వికాసం నడవడిలోనే ఉందని అది సామాన్యునికైనా, అసమాన్యునికైనా సర్వసాధారణంగా తెలియజేశాడు. జ్ఞానకాండను భాగవతం ద్వారా నిక్షిప్తం చేశాడు. పోతన భాగవతంలో శ్రీకృష్ణుడు మానవునిగా తన మాట, చేత తత్వాలను తెలియజేయడానికి నటించాడనే విషయం పోతన ఆధారాల సహితంగా నిరూపితం చేశాడు.

మానవుల జీవిత గమనాలను నియంత్రణం చేసి ఆత్మ తత్వ స్వరూపుడైన భగవంతుని ఉనికిని తన భాగవతంలో అంతరంగ ఆవిష్కరణతో శాశ్వతం చేసి మానవ జాతికి దివ్య మార్గదర్శనం చేసిన పోతన కవి సంగీతకర్త (నాదోపాసకుడు), దార్శనికునిగా స్థిర చిర యశస్వి అయ్యాడు. భక్తి జ్ఞానకాసారం భాగవతంగా అందించిన పోతన తెలుగు సాహిత్య పేటి.

(పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో 30–12–2019న ‘పలికెద భాగవతం’ పద్యపఠన పోటీల బహుమతి ప్రదానోత్సవం సందర్భంగా)

డాక్టర్ నోరి రాజేశ్వరరావు
మొబైల్ : 73370 85511

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

ఫార్టీ సిక్స్ ఇయర్స్ ఇండస్ట్రీ అల్లు అరవింద్!
ఇప్పటికీ బిజీ!
కూర్చోడానికి కూడా ఖాళీ ఉండదు.
అంత ఖాళీ లేనప్పుడు ఇప్పుడెలా కూర్చున్నారు?!
ఇంత దగ్గరగా! ఇంత లవ్‌లీగా! ఇంత ప్లెజెంట్‌గా!
ఇదంతా ఆయన బెటర్ హాఫ్ నిర్మల ఆయనకు ఇచ్చిన స్పేస్!
స్పేస్ చేసుకోవడం కాదు..
స్పేస్ ఇచ్చుకోవడం ఉంటే.. ఆ దాంపత్యం
ఎప్పటికీ స్వీట్ అండ్ స్ట్రాంగ్ అంటున్నారు..
మిస్టర్ అండ్ మిసెస్ అల్లు అరవింద్.

# స్వీట్ అండ్ స్ట్రాంగ్



నిర్మల, అల్లు అరవింద్

■ **మీ పెళ్లి బంధం 'అల్లుకున్న' రోజుల గురించి?**

**అరవింద్:** (నవ్వుతూ)... మా నాన్నగారు, నిర్మల పెదనాన్న ఫ్రెండ్స్. 'మా అబ్బాయికి పెళ్లి చేయాలనుకుంటున్నాను. మావాడు పల్లెటూరి అమ్మాయిని చేసుకోనంటున్నాడు. మినిమమ్ విజయవాడ అమ్మాయి అంటున్నాడు. చూడండి' అని ఆయనతో మా నాన్నగారు అంటే, 'మా తమ్ముడు కూతురు పెళ్లీడుకొచ్చింది. వాళ్లతో మాట్లాడతాను' అన్నారాయన. ఆ తర్వాత నాన్న గారు వెళ్లి చూసొచ్చి, 'అమ్మాయి బాగుంది. నాకు నచ్చింది' అని చెప్పేశారు. నేను చూడ్డానికి వెళ్లాక పెద్దగా ఇంటర్వ్యూలు లేవు. అమ్మాయిని చూపించారు. అంతే.. తాంబూలాలు మార్చుకున్నారు.

■ **పెళ్లిచూపులకి, పెళ్లికి మధ్య గ్యాప్ ఎంత?**

**అరవింద్:** 1974లో మా పెళ్లి జరిగింది. పెళ్లి చూపులకి, పెళ్లికి మధ్య ఐదు నెలలు గ్యాప్ వచ్చింది. ఆ గ్యాప్‌లో ఓసారి కాఫీకి తీసుకెళదామని ట్రై చేశాను. 'మా అమ్మను అడగండి' అంది. 'నువ్వు అడుగు. వాళ్లు పంపిస్తే వెళదాం' అన్నాను. ఊహూ అంది. యాక్చువల్‌గా మా అత్తగారు పాతకాలం మనిషిలా ఉండరు. అప్పట్లో మా అత్తగారిని మ్యానేజ్ చేసుకుని ఉంటే, ఈవిడని కాఫీకి తీసుకెళ్లగలిగేవాడిని. ముందు అది తెలియలేదు. ఆ తర్వాత మా అత్తగారు పాతకాలపు మనిషి కాదని తెలిసింది.

■ **మీకు ముగ్గురు సిస్టర్స్. మీ పెళ్లయ్యేనాటికే వాళ్ల పెళ్లయిందా?**

**అరవింద్:** నా చెల్లి వసంత పెళ్లి, మా పెళ్లి ఒక్క రోజు తేడాలో జరిగింది. ఏప్రిల్ 7న మా పెళ్లి. 8న ఇద్దరి రిసెప్షన్ ఒకే రోజు జరిగింది.

■ **మరి.. పెళ్లయ్యాక కాఫీకి వెళ్లారా?**

**నిర్మల:** వెళ్లాం. మా రిసెప్షన్ మదరాసులో జరిగింది. ఆ వేడుక కోసం మా అమ్మానాన్న వచ్చారు. వాళ్లని రిసీవ్ చేసుకోవడానికి స్టేషన్‌కి వెళ్లాం. ఇంటికి వచ్చేటప్పుడు భుహారీ హోటల్‌లో కాఫీ తాగాం. అప్పట్లో అది పెద్ద హోటల్.

■ **అరవింద్‌గారిలో మీకు నచ్చిన లక్షణాలు?**

**నిర్మల:** దేన్నీ సీరియస్‌గా తీసుకోరు. కూల్‌గా ఉంటారు. అది బాగా నచ్చుతుంది. అయితే మా పెళ్లయిన కొత్తలో 'ఏంటీ.. ఏం చెప్పినా సీరియస్‌గా తీసుకోరు' అనుకునేదాన్ని.

**అరవింద్:** మామూలుగా భర్త అంటే కొంచెం సీరియస్‌గా అలా ఉంటారు కదా. నేనలా ఉండకపోయేసరికి కొంచెం కన్‌ఫ్యూజ్ అయింది. ఇంత లైట్‌గా ఉన్నారేంటి అనుకుంది. అయితే కొన్ని సందర్భాల్లో నా కోపం చూసి, ఓహో కోపం కూడా వస్తుందనుకుంది.

■ **మీ కుటుంబానికి సినిమా పరిశ్రమతో సంబంధం లేదు కదా.. మరి 'అల్లువారింట్లో' అడ్జస్ట్ కావడానికి ఇబ్బందిపడ్డారా?**

**నిర్మల:** మా నాన్నగారిది ఆయిల్ బిజినెస్. సినిమాలతో సంబంధం లేదు. దాంతో పూర్తిగా వేరే కల్చర్‌లోకి వచ్చినట్లు అనిపించింది. మాది బిజినెస్ ఫ్యామిలీ కాబట్టి ఇంట్లో చాలామంది పనివాళ్లు ఉండేవారు. నాన్న బిజినెస్ వ్యవహారాలు చూసుకునేదాన్ని. అంత లిబరల్‌గా పెంచారు. నన్ను క్వీన్‌లానే చూసుకున్నారు.

■ **మరి అత్తింట్లో కూడా క్వీన్‌లానే ఉన్నారా?**

**నిర్మల:** అరవింద్‌గారు, ఇంకా అందరూ అలానే చూసుకుంటారు (నవ్వుతూ).

**అరవింద్:** అయితే తనకు కుటుంబ బాధ్యతలు ఎక్కువ. ఇంటికి పెద్ద కోడలిగా అన్నీ చూసుకుంది. పెళ్లికి ముందు ఉన్నంత లిబరల్‌గా అయితే లేదు.

■ **జాయింట్ ఫ్యామిలీనే కదా?**

**నిర్మల:** అవును. మా పెళ్లితో పాటు ఒక ఆడపడుచుకి పెళ్లయింది. తను కూడా కొన్నాళ్లు మాతోనే ఉంది. ఈయన అక్కగారు పెళ్లి చేసుకోలేదు. అప్పటికి సురేఖ (చిరంజీవి సతీమణి) గారికి కూడా పెళ్లి కాలేదు. సురేఖగారిది, నాదీ ఇంచు మించు ఒకే ఏజ్ కావడంతో బాగా కలిసిపోయేవాళ్లం. మా పుట్టింట్లో మా మేనత్తలతో కలిసి పెరిగాను. అలా ఉమ్మడి కుటుంబం నాకు అలవాటే. దాంతో ఇబ్బందిగా అనిపించలేదు.

**అరవింద్:** తనకి మనుషులంటే ఇష్టం.

■ **చిరంజీవిగారు, సురేఖగారి పెళ్లి మీ చేతుల మీద జరిగిందనుకోవచ్చా?**

**అరవింద్:** అవును... దగ్గరుండి తనే బాధ్యతగా చేసింది.

■ **స్క్రీన్‌పై మీ మావయ్య (అల్లు రామలింగయ్య) గారు కనిపిస్తే చాలు నవ్వులే నవ్వులు. నటుడిగా అంత జోవియల్‌గా కనిపించిన ఆయన మీతో ఎలా ఉండేవారు?**

**అరవింద్:** ఈవిడకి ఆయన వెరీ గుడ్ ఫ్రెండ్.

**నిర్మల:** అవును. మావయ్యగారు వెరీ ఫ్రెండ్లీ.

**అరవింద్:** ఆయనకు భోజనం పెట్టడం అన్నీ చేసేది. వయసు పైబడిన తర్వాత నాన్నకు ఆరోగ్యం సహకరించకపోతే భోజనం తినిపించేది. మామాకోడలు అంత బాగుండేవాళ్లు.

**నిర్మల:** నన్ను కూతుళ్లతో సమానంగా చూశారు. ఎప్పుడూ నన్ను పేరుతో పిలవలేదు. 'అమ్మాయి' అనే పిలిచేవారు. ఆయన షూటింగ్ నుంచి ఇంటికొచ్చాక వీళ్లెవరూ దొరికేవారు కాదు. దాంతో ఏదైనా చెప్పాలనుకుంటే నాతోనే షేర్ చేసుకునేవారు.

**అరవింద్:** నాపై చాడీలు కూడా చెప్పేవారు. 'ఆ వెధవ...' అంటూ నన్ను తిట్టేవారు. మా కాపురంలో పుల్లలు పెట్టేవారు కూడా (నవ్వులు).

**నిర్మల:** అవును.. 'చూడమ్మాయి.. వాడు లేట్‌గా వస్తున్నాడంటే పని ఉందని కాదు.. నువ్వు జాగ్రత్తగా ఉండాలి' అనేవారు.

**అరవింద్:** ఎలా చెప్పేవారంటే.. 'అమ్మాయి.. వాడు పది తర్వాత ఇంటికి వచ్చాడు. అంత పనేం లేదు. ఓ కంట కనిపెట్టు' అనేవారు.

■ **అవి విన్నప్పుడు మీకు భయం అనిపించేదా?**

**నిర్మల:** అలా ఏం లేదు. మావయ్యగారు అలా అన్నారని ఆయనతో చెప్పేదాన్ని. ఇద్దరం నవ్వుకునేవాళ్లం.

**అరవింద్:** నాన్నతో ఫ్రెండ్లీగా ఉండడంతో పాటు చాలా గౌరవం కూడా ఇచ్చేది. అంతెందుకు? ఇప్పటికీ మా అమ్మ అలా హాల్‌లోకి వస్తే టక్కున లేచి నిలబడుతుంది.

**నిర్మల:** ఆ రోజుల్లో అత్తగారు అంటే.. అలానే గౌరవించేవాళ్లు. ఆరోగ్యం సహకరించినంత వరకూ అత్తయ్యగారే అన్నీ చూసుకున్నారు. వంట చేసేటప్పుడు మాత్రం ఏం చేయాలని మాట్లాడుకుని చేసేవాళ్లం. నేను నాన్‌వెజ్ పెద్దగా తిననని నాకోసం వేరే చేసేవారు. నాకు వేడిగా తినడం అలవాటు. అందుకని అందరి కోసం వెయిట్ చేయకుండా తినమనేవారు. దాంతో నాకు అమ్మ ఇంటికి, అత్తింటికి తేడా తెలియలేదు.

■ **భార్యాభర్తలు కష్ట సుఖాలను సమానంగా పంచుకుంటూ ముందుకెళ్లడం మంచి వైవాహిక జీవితానికి నిదర్శనం. మీ జీవితంలో జరిగిన ఓ విషాద ఘటన (కుమారుడు చనిపోవడం) తాలూకు బాధను ఎలా అధిగమించారు?**

**అరవింద్:** ఫ్యామిలీ సపోర్ట్ ముఖ్యం అండీ. నిర్మల కూడా చాలా ధైర్యం ఉన్న మనిషి. మా మూడో అబ్బాయి శిరీష్ పుట్టడం వెనకాల ఒక కారణం ఉంది. బన్నీ తర్వాత పుట్టిన అబ్బాయి చనిపోయాడు. ఆ బాబుకి ఐదేళ్లు. మాకు ఊహించని షాక్. ముగ్గురు బాబులు ఉన్నారు కదా, ఇక పిల్లలు వద్దనుకుని ఆపరేషన్ చేయించుకుంది. కానీ మూడో బాబు చనిపోయాక.. మళ్లీ తన కడుపున ఆ బాబు పుడతాడని, 'రీకేనలైజేషన్' (మళ్లీ పిల్లలు పుట్టడానికి) చేయించుకోవాలనుకుంది. 30ఏళ్ల క్రితం వైద్యశాస్త్రం ఇంత అభివృద్ధి చెందలేదు. అయినా తను ఆ నిర్ణయం తీసుకుంది. 'మేజర్ ఆపరేషన్ సార్. మూడు గంటలు జరుగుతుంది. అయినా పిల్లలు పుట్టే చాన్స్ పది శాతమే' అని డాక్టర్ అన్నారు. అప్పట్లో మూడు గంటల ఆపరేషన్ అంటే లైఫ్ రిస్క్ ఉంటుంది. ఇద్దరు పిల్లలు ఉన్నారు కదా.. వద్దని నిర్మలతో అన్నాం. గైనకాలజిస్ట్ కూడా ఇదే చెప్పారు. అయినా సరే నిర్మల ఒప్పుకోలేదు. ఆపరేషన్ చేయించుకుంది. కానీ, ఆ తర్వాత కొన్ని నెలల వరకూ గర్భం రాలేదు. దీంతో ఓ వైద్య పరీక్ష చేశాం. సారీ.. ఆపరేషన్ ఫెయిల్ అయ్యింది అన్నారు. ఈ విషయం ఆమెకు చెప్పడానికి సందేహించాం. కానీ తనకు తెలిసిపోయింది. అయితే 'ఐ విల్ గెట్ బ్యాక్ మై సన్' అంది నిర్మల. అన్నట్లుగానే.. ఆ తర్వాతి నెల తను 'కన్సీవ్' అయింది. అలా పుట్టిన బాబే శిరీష్.

**నిర్మల:** ఆ బాబు చనిపోయాడు, నేను ఏడ్చినా, ఏం చేసినా రాడు. ఈ గ్యాప్‌ని ఎలా ఫిల్ చేసుకోవచ్చని ఆలోచించాను. అందుకే మొండిగా ఆపరేషన్ చేయించుకున్నాను.

■ **అత్తగారిని చూడగానే లేచి నిలబడే జనరేషన్ నుంచి వచ్చారు. మారిన కాలంలో ఇప్పటి**



**కోడళ్లు అలా చేయకపోవచ్చు. ఈ మార్పు?**

**నిర్మల:** ఆ రోజుల్లో అలా ఒక అలవాటు ఉండేది. అత్తయ్యగారు అని కాదు. అప్పట్లో పెద్దవాళ్లు ఎవరు వచ్చినా లేచి నిలబడటం అనేది ఒక పద్ధతి. అప్పట్లో ఆడవాళ్లు పెద్దగా బయటకు వెళ్లడం ఉండేది కాదు. ఇప్పుడు ఆడవాళ్లు బయటకు వెళుతున్నారు. నిరూపించుకుంటున్నారు. ఇప్పటి కోడళ్ల అలవాట్లు ఇప్పటి కాలానికి కరెక్ట్.

**అరవింద్:** మీకో విషయం చెప్పనా.. మా ఆవిడని 'ఉత్తమ అత్తగారు' అని మా కోడళ్లే చెబుతారు. అందుకే ఇంకా ఉమ్మడి కుటుంబంలో ఉంటున్నాం. అత్తాకోడళ్లు ఫ్రెండ్లీగా ఉంటారు. మా కోడళ్లు మా ఆవిడని 'నో నాన్సెన్స్' అత్తగారు అని అంటారు (నవ్వుతూ).

■ **ఉమ్మడి కుటుంబంలో గొడవలు లేకుండా ఉండాలంటే ఏదైనా టిప్స్?**

**నిర్మల:** నేను ఎంత వరకు ఉండాలో అంత వరకే ఉంటాను. కాలంతో పాటు మనం కూడా మారాలి. ఫలానా విషయం గురించి బన్నీకి చెప్పకపోయావా అమ్మా? అంటే బన్నీ గురించి మీకు తెలుసు కదా అత్తయ్యా అంటుంది.

**అరవింద్:** వారి జీవితాలను ఓవర్‌ల్యాప్ చేయం. ఎవరి స్పేస్ వారికి ఇస్తాం.

■ **బాబీ, బన్నీ, శిరీష్.. ఈ ముగ్గురి మనవళ్లను చూసుకుని అల్లు రామలింగయ్యగారు మురిసిపోయిన విశేషాల గురించి?**

**అరవింద్:** పిల్లలతో బాగా ఆడుకునేవారు. మా పెద్దబ్బాయి బాబీ మీద ఒకసారి ఆయనకు ఎందుకో కోపం వచ్చింది. కర్ర తీసుకుని, వాడిని కొట్టడానికి ముందుకొస్తే, బాబీ పరిగెత్తాడు. కొంచెం పరిగెత్తాక 'రేయ్.. ఆయాసం వస్తోంది. వచ్చి ఒక దెబ్బ తిని వెళ్లు' అంటే, వాడు దగ్గరకొచ్చి ఒక్క దెబ్బ తిని వెళ్లాడు (నవ్వుతూ).

■ **అరవింద్‌గారు 45 ఏళ్ల వయసులో తన తండ్రితో చెంప దెబ్బ తిన్నారు. ఆ విషయాన్ని గతంలో 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయనే చెప్పారు. ఆ చెంప దెబ్బ విషయం మీకు తెలుసా?**

**అరవింద్:** కారు ఫాస్ట్‌గా డ్రైవ్ చేసుకుంటూ, ఇంటికి రాగానే బ్రేక్ స్పీడ్‌గా వేశాను. నాన్నగారు విండ్ షీల్డ్‌కి కొట్టుకోబోయారు. ఆ కోపంతో నా చెంప మీద ఒక్కటిచ్చారు. మా ఆవిడ చూసేసిందేమోనని కంగారుపడ్డాను కానీ చూడలేదు. ఈ వయసులో కూడా నాన్నతో తన్నులు తిన్నాడనుకుంటుందేమోనని కంగారు. లోపలికెళ్లి నాన్న కొట్టిన విషయం చెప్పి, అమ్మ దగ్గర గొడవపడదామనుకున్నాను. కానీ అమ్మతో చెప్పేటప్పుడు తను వింటుందేమోనని మ్యాటర్‌ని సైలెంట్ చేసేశాను. కట్ చేస్తే.. బెడ్‌రూమ్‌లోకి వెళ్లగానే ఎందుకండీ మావయ్యగారు అలా కొట్టారు అంది. అబ్బా... తెలిసిపోయిందనుకున్నాను. తను వరండాలో నిలబడి చూసిందట. నాన్న నన్ను అలా కొట్టగానే భయపడి లోపలికి పారిపోయింది.

■ **పిల్లల పెంపకం బాధ్యతను ఇద్దరూ సమానంగా తీసుకున్నారా?**

**అరవింద్:** నేను బాధ్యత తీసుకోలేదు. ఆ అవసరం రాకపోవడం నా అదృష్టమనే చెప్పాలి. 1973లో ఇండస్ట్రీకి వచ్చినప్పటినుంచి ఈరోజు వరకూ బిజీగా ఉన్నాను. పిల్లల విషయాలను మా అమ్మ, నా పెద్ద చెల్లి వసంత, ఈవిడ.. ఈ ముగ్గురూ చూసుకున్నారు. మా చెల్లి కొన్నాళ్లు మాతోనే ఉంది. ఆవిడకి మేనల్లుళ్లు అంటే చాలా ప్రేమ. ఇప్పటికీ బాబీ, బన్నీ, శిరీష్ మా మీద కోపం వస్తే వాళ్ల మేనత్తకి కంప్లైంట్ చేస్తారు.

■ **బన్నీ (అల్లు అర్జున్)ని హీరోని చేయాలని ఎవరు అనుకున్నారు?**

**నిర్మల:** మా పెళ్లయిన నాలుగైదేళ్లకు చిరంజీవిగారితో సురేఖగారి పెళ్లి జరిగింది. ఆ తర్వాత చిరంజీవిగారి ఫంక్షన్స్ అవీ చూసి, బన్నీ హీరో అయితే బాగుంటుందనుకునేదాన్ని. ఇలాంటి ఫంక్షన్స్ జరుగుతాయి.. స్టేజ్ మీద బన్నీని చూసుకోవచ్చు అనే ఇమాజినేషన్ ఉండేది. కానీ ఎడ్యుకేషన్ పూర్తి చేసి, మెచ్యూర్టీ వచ్చాక ఇండస్ట్రీలోకి వెళితే బాగుంటుందనుకునేదాన్ని. అయితే తను ఇష్టపడితేనే.. నా అభిప్రాయాన్ని పాటించాలనుకునేదాన్ని కాదు.

■ **మీక్కూడా బన్నీని హీరోగా చూడాలని ఉండేదా? ఫస్ట్ సినిమా 'గంగోత్రి'తో పోల్చితే ఆ తర్వాతి సినిమాల్లో బన్నీ మేకోవర్ సూపర్.. అలా మార్చుకున్న తీరు గురించి?**

**అరవింద్:** బన్నీకి పట్టుదల ఎక్కువ. అనుకుంటే సాధిస్తాడు. యానిమేషన్ స్కూల్‌లో అడ్మిషన్ కావాలి. రోజుకు పది నుంచి 12 గంటలు ప్రాక్టీస్ చేస్తే కానీ అక్కడ పాస్ అవుతారు. ఓ మూడు నెలలు ప్రతి రోజూ 12 గంటలు సాధన చేశాడు. అక్కడ అడ్మిషన్ వచ్చింది. బన్నీ మంచి యానిమేటర్. అయితే సీట్ వచ్చాక 'గంగోత్రి'కి చాన్స్ వచ్చింది. 'ఒక సెమిస్టర్ మానేయ్.. 'గంగోత్రి' క్లిక్ అయితే చూద్దాం' అన్నాను. 'గంగోత్రి' తర్వాత 'ఆర్య' చేశాడు. ప్రూవ్ చేసుకున్నాడు. దాంతో హీరోగా కంటిన్యూ అయ్యాడు.

■ **స్నేహని పెళ్లి చేసుకుంటానని బన్నీ అన్నప్పుడు మీ ఇద్దరి రియాక్షన్?**

**అరవింద్:** అర్జున్ ఇంటర్‌క్యాస్ట్ మ్యారేజ్ విషయం మా ఇంట్లో అయిదు నిమిషాల్లోనే సెటిల్ అయ్యింది. ముందు స్నేహ విషయం బన్నీ తన అమ్మ దగ్గరే చెప్పాడు.

**నిర్మల:** అర్జున్ వచ్చి స్నేహని చేసుకుంటాను అంటే, నువ్వు చేసుకున్నా, మేం వేరే అమ్మాయిని చూసి చేసినా నువ్వు హ్యాపీగా ఉండాలి. మాకు ముఖ్యం అదే. నువ్వు హ్యాపీగా ఉంటే మేం హ్యాపీ అన్నాను.

■ **అరవింద్‌గారికి ఇంటిని పట్టించుకునే తీరిక లేదు కాబట్టి ఈ విషయంలో మీ ఇద్దరి మధ్య వాదనలు జరిగేవా?**

**నిర్మల:** అలా ఏం లేదు. ఇల్లు బాగుండాలంటే నేనన్నా వర్క్ చేయాలి లేదా ఆయన అయినా వర్క్ చేయాలి. కుటుంబంలో అందరూ ఆనందంగా ఉండాలంటే ఆయన నాతోనే ఉండాలి అనుకుంటే కుదరదు. నేను ఈ జనరేషన్ వాళ్లకి అదే చెబుతాను. మనం అన్ని సౌకర్యాలు అనుభవించాలంటే జీవిత భాగస్వామికి తప్పనిసరిగా స్పేస్ ఇవ్వాలి. ఇప్పుడు అరవింద్‌గారినే తీసుకోండి.. ఆయన ఏ పనీ చెయ్యకుండా నాతోనే ఉండాలి అనుకుంటే గీతా ఆర్ట్స్‌లాంటి పెద్ద సంస్థను ఎలా మేనేజ్ చేస్తారు? మా పిల్లలకు అన్నీ సమకూర్చాలంటే ఆయన స్పేస్ ఆయనకు ఇవ్వాల్సిందే. అలా కాకుండా బాగా పని మీద ఉన్నప్పుడు 'ఇంటికి రండి' అని నేను సతాయించకూడదు. అలా ఇంట్లోవాళ్లు సతాయిస్తే.. 'అయ్యో ఇంటికి వెళ్లాలా' అని ఆలోచిస్తారు. ఆ ఆలోచన రాకుండా మేనేజ్ చేయటంలోనే నేను ఆయనకు స్పేస్ ఇచ్చినట్లు. తప్పనిసరిగా ఆయనకు ఆ క్రియేటివ్ స్పేస్ నేను ఇస్తాను.

■ **ఫైనల్లీ.. వైవాహిక జీవితం సాఫీగా సాగిపోవాలంటే ఏం చేయాలి?**

**అరవింద్:** భార్యాభర్తల మధ్య నమ్మకం ముఖ్యం. మా పెళ్లైన ఈ 45 సంవత్సరాల్లో ఇంత పెద్ద గ్లామర్ ఇండస్ట్రీలో నేను ఉన్నప్పటికీ ఏనాడూ తను నన్ను అనుమానించలేదు. అదే మా పెద్ద సక్సెస్. అసలు మనస్పర్థలను రోజుల తరబడి సాగనివ్వకూడదు. ఏదైనా సరే ఇద్దరూ కూర్చుని, మాట్లాడుకోవాలి.

**నిర్మల:** మళ్లీ చెబుతున్నాను. పార్టనర్‌కి స్పేస్ ఇవ్వండి. మా ఇద్దరి విషయంలో మొదట్లోనే ఓ అగ్రిమెంట్ ఉంది. అదేంటంటే 'క్యారెక్టర్ ఈజ్ యువర్‌సెల్ఫ్'. అంటే.. నువ్వేంటో అదే నీ క్యారెక్టర్ అని. ఆ క్యారెక్టర్ మీరు ఎలా చేసుకుంటారో అది మీ ఇష్టం. అందుకని ఇలా ఉండాలి.. అలా ఉండాలి అని మేం ఒకరికొకరు చెప్పుకోం. మన క్యారెక్టర్ ఎలా ఉంటే బాగుంటుందో అలా ఉంటాం. మా జీవితం హ్యాపీగా గడిచిపోవడానికి మెయిన్ రీజన్ ఇదే.

– డి.జి. భవాని

## తిరుప్పావై 14వ పాశురం

**ఉజ్గళ్ పుళైక్కడై త్తోట్టత్తు వావియుళ్**
**శెజ్గళు నీర్ వాయ్ నెగిళ్ న్దు అమ్బల్ వాయ్ కూమ్బినకాణ్**
**శెజ్గల్ పొడిక్కూఱై వెణ్బల్ తవత్తవర్**
**తజ్గళ్ తిరుక్కోయిల్ శజ్గిడువాన్ పోగిన్దార్**
**ఎజ్గళై మున్నమ్ ఎళుప్పువాన్ వాయ్ పేశుమ్**
**నజ్గాయ్! ఎళున్దిరాయ్ నాణాదాయ్ నావుడైయాయ్!**
**శజ్గొడు శక్కర మేన్దుమ్ తడక్కైయన్**
**పజ్గయక్కణ్ణానై ప్పాడేలో రెమ్బావాయ్**

బొమ్మ: కేశవ్ వెంకటరాఘవన్



'ఓ కాంతారత్నమా,ఎంతటి గడుసుదానవు ! వేకువఝామున అందరికన్నా ముందు మేల్కొని మమ్ములనందరిని మేల్కొలుపుతానని మాటయిచ్చిన నీవు ఇంకను నిద్ర లేవలేదు! కలువకన్నుల నిన్ను పరిహసిస్తున్నట్లు నీ పెరటికొలనులో కుముదములు (ఎర్రతామరలు) వికసిస్తున్నాయి. అది చూచి నీలోత్పలములు (నల్లకలువలు) ఓర్వలేనట్లు ముకుళిస్తున్నాయి, చూడు. తెలతెలవారుతున్నది, వేగుచుక్క పొడిచింది. కోవెల తలుపులు తెరచి శంఖము పూరించి భగవానుని సేవకు ప్రజలను ఆయత్తపరచుటకు కాషాయాంబరధారులైన యతులు కోవెల బీగములతో పోవుచున్నారదిగో చూడుము. ఇంత సంరంభము నీకు వినిపించుట లేదా! నీ మాటలన్నీ గాలిమూటలేనా! తన దీర్ఘబాహువులలో ఉజ్జ్వలమైన శంఖుచక్రాలను ధరించే ఆ అరవిందనేత్రుని భజిస్తూ వ్రతవిధి పాటించటానికి పోవుదము, లే! కాలయాపన చేస్తున్నావు, నీకిది తగదు సుమా!'

– శ్రీదేవి మురళీధర్

## ● ముగ్గు-ముచ్చట



16 చుక్కలు
4 వరుసలు
అటు ఇటు వదిలి
4 వరకు



శాంతి నర్వా
సరూర్‌నగర్,
హైదరాబాద్.



19 చుక్కలు
10 వచ్చేవరకు
మధ్యచుక్క



జి.అమ్మాజి
నర్సాపురం



21 చుక్కలు
11 వచ్చేవరకు
మధ్య చుక్క



ఎల్.రమాదేవి
వైరా, ఖమ్మం జిల్లా



**ముగ్గులు పంపవలసిన చిరునామా:**
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
muggulu.sakshi@gmail.com

## ఇంటిప్స్



- బుక్‌షెల్ఫ్‌లో చిన్న చిన్న పురుగులు చేరుతుంటాయి. వాటినలాగే వదిలేస్తే పుస్తకాలను తినేస్తాయి. అరల్లో అక్కడక్కడా చిన్న చందనం బిళ్లలు వేస్తే పురుగులు పట్టవు.
- గ్లూ స్టిక్ ఎండిపోయినట్లయితే అందులో కొద్దిగా గ్లిజరిన్ వేసి గోరువెచ్చగా చేయాలి. గ్లూ మెత్తబడి వాడుకోవడానికి వీలుగా మారుతుంది.
- తెల్లటి షూ మీద ఏవైనా మరకలు పడి ఉతికినా పోకపోతే, దూదిని నెయిల్ పాలిష్ రిమూవర్‌లో ముంచి మరక మీద రుద్దాలి.
- షూ మీద పడిన మరకలు వదలకపోతే ఆఫ్టర్ షేవ్ లోషనతో తుడిస్తే ఫలితముంటుంది.



సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
ఆదివారం
29-12-2019

# చిన్న బ్రేక్


మహేశ్‌బాబు

ఒక సినిమా చేసేటప్పుడు వర్క్ మూడ్‌లో ఉండే మహేశ్‌బాబు అది పూర్తి కాగానే హాలిడే మూడ్‌లోకి వెళ్లిపోతారు. ఇప్పుడు ఆ మూడ్‌లోనే ఉన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో మహేశ్‌బాబు నటించిన 'సరిలేరు నీకెవ్వరు' షూటింగ్ ఇటీవల పూర్తయింది. ఆ వెంటనే తన పాత్రకు డబ్బింగ్ చెప్పేశారు మహేశ్. దాంతో రిలీఫ్ అయిపోయారు. ఫ్యామిలీతో చిన్న హాలిడే ట్రిప్ ప్లాన్ చేశారని సమాచారం. జస్ట్ వారం రోజులు ఫ్యామిలీతో రిలాక్స్ అయి, ఆ తర్వాత 'సరిలేరు నీకెవ్వరు' ప్రమోషన్స్‌తో బిజీ అయిపోతారు. మహేశ్‌బాబు సరసన రష్మికా మందన్నా నటించిన ఈ చిత్రంలో విజయశాంతి కీలక పాత్ర చేశారు. హైదరాబాద్‌లో జనవరి 5న ఈ చిత్రం ప్రీ–రిలీజ్ వేడుక జరగనుంది. 'దిల్' రాజు, అనిల్ సుంకర, మహేశ్‌బాబు నిర్మించిన ఈ చిత్రం జనవరి 11న విడుదల కానుంది.

# స్పెషల్ ట్రైనింగ్


రానా

పోలీసాఫీసర్‌గా ప్రత్యేక శిక్షణ తీసుకోబోతున్నారు రానా. 'విరాటపర్వం' సినిమా కోసమే ఈ ట్రైనింగ్. వేణు ఉడుగుల దర్శకత్వంలో రానా, సాయి పల్లవి ప్రధాన పాత్రధారులుగా ఈ చిత్రం రూపొందుతోంది. 1980 నేపథ్యంలో సాగే ఈ పీరియాడికల్ మూవీలో రానా పోలీసాఫీసర్‌గా కనిపిస్తారు. పోలీసాఫీసర్ల బాడీ లాంగ్వేజ్ ఎలా ఉంటే బాగుంటుందనే విషయం మీద ఓ రిటైర్డ్ పోలీసాఫీసర్ దగ్గర రానా స్పెషల్ ట్రైనింగ్ తీసుకోబోతున్నారు. పోలీస్ లుక్ కరెక్ట్‌గా రావడం కోసం స్పెషల్ డైట్ ప్లాన్‌ను కూడా ఫాలో అవుతున్నారట రానా. అలాగే ఈ సినిమాలో నక్సలైట్ పాత్రలో నటిస్తున్నారు సాయి పల్లవి. ఈ చిత్రం కొత్త షెడ్యూల్ కొత్త ఏడాది జనవరిలో ప్రారంభం కానుంది. ఇటీవల వికారాబాద్ ఫారెస్ట్‌లో జరిగిన షూటింగ్‌లో రానాతో పాటు కీలక తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.

# ఈ విజయం మొత్తం వాళ్లదే

''మత్తు వదలరా' చిత్రవిజయంలో మా క్రెడిట్ ఏం లేదు. కథ విని బావుందని మాత్రమే చెప్పాం. విజయం టీమ్‌కే దక్కుతుంది'' అన్నారు నిర్మాతలు చెర్రీ (చిరంజీవి), రవిశంకర్. కీరవాణి తనయుడు శ్రీ సింహా హీరోగా రితేష్ రానా తెరకెక్కించిన చిత్రం 'మత్తు వదలరా'. కీరవాణి మరో అబ్బాయి కాలభైరవ సంగీత దర్శకుడిగా పరిచయమయ్యారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా మంచి టాక్‌తో నడుస్తోందని చిత్రనిర్మాతలు చెర్రీ, రవిశంకర్ పేర్కొన్నారు. చెర్రీ మాట్లాడుతూ– ''రితేష్ కథ చెప్పినప్పుడే క్లియర్‌గా, క్లారిటీగా ఉన్నాడనే నమ్మకం కుదిరింది. హీరో, ముఖ్య పాత్రల్లో ఎక్కువ శాతం కొత్తవాళ్లే కావాలన్నాడు. శ్రీ సింహా నాకు చిన్నప్పటి నుంచి తెలుసు. అతనెలా ఉంటాడో చూడు అన్నాను. అయితే సింహా.. కీరవాణిగారి అబ్బాయి అని నేను చెప్పలేదు. ఆడిషన్ చేసి సింహాను సెలక్ట్ చేసుకున్నాడు రితేష్. కీరవాణి, ఆయన భార్య వల్లీ, రాజమౌళి ఎవరూ ఈ కథ వినలేదు. నీకు నమ్మకం ఉంటే చేసెయ్ అని నన్ను నమ్మారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. ఈ సినిమా వీఎఫ్ఎక్స్, డీఐ కోసం రెండు కంప్యూటర్స్ అద్దెకి తీసుకొని డైరెక్షన్ టీమే చేశారు. బయట చేస్తే 60 లక్షలు అవుతుంది. సినిమాకి వస్తున్న స్పందన చూస్తుంటే ఆనందంగా ఉంది. కొత్త టాలెంట్‌ను ఇలానే ఎంకరేజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు. రవిశంకర్ మాట్లాడుతూ – ''రెండు కోట్లా నాలుగు లక్షల్లో సినిమా తీశాం.


రవిశంకర్, చెర్రీ

రెండు సెట్లు, రెండు ఫ్లాట్స్ వాడాం. ఫైట్ సీన్స్‌కి కావాల్సిన సామగ్రిని కూడా డైరెక్షన్ టీమే తయారుచేసుకుంది. సింహాకి మంచి పేరు వచ్చింది. కాలభైరవ మ్యూజిక్‌కి మంచి పేరొస్తోంది. మా బ్యానర్‌లో నెక్ట్స్ 'ఉప్పెన' సినిమా రాబోతోంది. ఏప్రిల్‌లో రిలీజ్ చేస్తాం'' అన్నారు.

# మా నాన్నగారు గర్వపడాలి


నటరాజ్

''తెలుగులో 'ఊల్లాల ఊల్లాల' నా తొలి చిత్రం. మా నాటక గ్రూప్ హైదరాబాద్‌లోనూ ప్రదర్శనలు ఇచ్చింది. రాక్‌లైన్ వెంకటేష్‌గారు కన్నడలో నిర్మించిన చిత్రంతో నా ప్రయాణం మొదలుపెట్టా'' అన్నారు నటరాజ్. సీనియర్ నటుడు సత్య ప్రకాష్ దర్శకుడిగా తెరకెక్కించిన చిత్రం 'ఊల్లాల ఊల్లాల'. నటరాజ్ హీరోగా ఏ.గురురాజ్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 1న విడుదల కానుంది. నటరాజ్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో దర్శకుడుగా మారాలని తాపత్రయపడే యువకుడి పాత్ర చేశా. డబ్బు కోసం ఎలాంటి అమ్మాయినైనా పెళ్లి చేసుకోవాలనుకునే మనస్తత్వం హీరోది. కొన్ని సంఘటనల వల్ల నిజమైన ప్రేమకు అర్థం తెలుసుకుంటాడు. మా నాన్నగారికి (సత్యప్రకాష్) తెలుగులో మంచి పేరు ఉంది. ఆ పేరుకు ఇబ్బంది కలగకుండా మంచి నటుడిగా పేరు తెచ్చుకోవాలని ఉంది. నటరాజ్ నా కొడుకు అని మా నాన్న సంతోషంగా, గర్వంగా చెప్పు కోవాలి.. అందుకోసం కష్టపడతాను. ఈ సినిమాకు డైరెక్టర్ మా నాన్నగారే అయినప్పటికీ సెట్‌లో యాక్టర్‌గానే ఫోకస్ పెట్టాను''అన్నారు.

# కిందటి జన్మలో రంగీలా తీశా!

**- రామ్‌గోపాల్‌వర్మ**


నైనా గంగూలీ, రామ్‌గోపాల్ వర్మ, సూరి

''లవ్‌స్టోరీ చిత్రాల్లో నా పేరు జోడించి కొన్ని యుగాలు అయిపోతుంది. కిందటి జన్మలో 'రంగీలా' తీశాను. 'బ్యూటిఫుల్' చిత్రం ఒక విధంగా 'రంగీలా'కి సీక్వెల్‌లా ఉంటుంది. 'ట్రిబ్యూట్ టు రంగీలా' అనేది కేవలం పబ్లిసిటీ కోసం పెట్టింది కాదు'' అన్నారు దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ. ఆర్జీవీ టైగర్ కంపెనీ ప్రొడక్షన్స్ పతాకంపై టి. అంజయ్య సమర్పణలో నైనా గంగూలీ, సూరి జంటగా అగస్త్య మంజు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బ్యూటిఫుల్'. టి.నరేశ్ కుమార్, టి.శ్రీధర్ నిర్మాతలు. నట్టి క్రాంతి, నట్టి కరుణ సహనిర్మాతలు. జనవరి 1న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ – ''నాకు వచ్చిన ఆలోచనను మంజుతో పంచుకున్నాను. తను పూర్తి కథ చేసి సినిమా తెరకెక్కించాడు. సాధారణ కథల్లో మగవాళ్లు ఎదుగుతుంటారు. ఆడవాళ్లు ఇంట్లో ఉంటారు. కానీ ఇందులో రివర్స్‌లో జరుగుతుంది. హీరోయిన్ బాగా ఎదుగుతుంది. తన సక్సెస్‌ను చూసి హీరో తట్టుకుంటాడా లేదా అనేది కథాంశం. విలన్స్ ఉండరు. సింపుల్‌గా, రియలిస్టిక్‌గా ఉంటుంది. నైనా ఈ పాత్ర చేయడానికే పుట్టింది అనుకుంటున్నాను'' అన్నారు. ''వర్మగారు నన్ను నమ్మి అవకాశం ఇచ్చారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టడం కోసం బాగా కష్టపడ్డాను. నా పరిచయ గీతాన్ని వర్మగారే షూట్ చేశారు. 3 రోజుల్లో 11 కాస్ట్యూమ్స్‌తో షూట్ చేశాం'' అన్నారు నైనా. ''ఇదో ఇంటెన్స్ లవ్‌స్టోరీ. అందరూ కనెక్ట్ అవుతారు. ఈ సినిమా గురించి మాట్లాడినా, చూసినా వర్మగారు కన్నీళ్లు పెట్టుకునేవారు. అంత ఎమోషనల్‌గా ఈ సినిమాకు కనెక్ట్ అయ్యారు'' అన్నారు సూరి.

# ఎలా చెప్పాలో అర్థం కావడంలేదు


జాన్వీ కపూర్

'గుంజన్ సక్సేనా' చిత్రాన్ని ముగించి ఈ ఏడాదికి గుడ్ బై చెప్పారు జాన్వీ కపూర్. భారత వైమానిక దళంలో మొదటి మహిళా పైలెట్ గుంజన్ సక్సేనా జీవితం ఆధారంగా హిందీలో తెరకెక్కిన చిత్రం 'గుంజన్ సక్సేనా: ది కార్గిల్ గాళ్'. శరణ్ శర్మ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో జాన్వీ టైటిల్ రోల్ చేశారు. ఈ సినిమా చిత్రీకరణ ముగిసింది. ఈ సందర్భంగా జాన్వీ కపూర్ మాట్లాడుతూ – ''గుంజన్ సక్సేనా' చిత్రాన్ని పూర్తి చేశానని చెప్పడానికి చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమా అనుభవాన్ని క్లుప్తంగా మాటల్లో చెప్పేందుకు రెండు రోజులు ఆలోచించాను. కానీ నాకు ఏమీ తోచలేదు. ఎలా చెప్పాలో అర్థం కావడంలేదు. ఈ సినిమా ప్రయాణం చాలా ప్రత్యేకమైనదిగా భావిస్తున్నాను. నా స్నేహితుడు, దర్శకుడు శరణ్ శర్మకు ధన్యవాదాలు. ఈ సినిమాను ప్రేక్షకులకు చూపించాలని చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం'' అన్నారు. అలాగే 'గుంజన్ సక్సేనా' సినిమాకు సంబంధించిన మరో వర్కింగ్ స్టిల్‌ను తాజాగా విడుదల చేశారు. ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చిలో విడుదల కానుంది. ఈ సినిమా కాకుండా 'రుహీ అఫ్జా దోస్తానా 2, తక్త్' సినిమాల చిత్రీకరణలతో జాన్వీ వచ్చే ఏడాది ఫుల్ బిజీ.

# ఆలోచింపజేసే లైఫ్ స్టైల్


రోజా, నెహ్రూ

నెహ్రూ విజయ్, రోజా, నిఖిల్, సంతోషి ముఖ్య తారలుగా సి.ఎల్. సతీష్ మార్క్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'లైఫ్ స్టైల్'. కలకొండ నర్సింహ నిర్మించిన ఈ సినిమా ప్రీ–రిలీజ్ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ నాయకుడు మందాడి జగన్నాథం ట్రైలర్‌ను విడుదల చేశారు. రచయిత గోరెటి వెంకన్న పాటలు విడుదల చేయగా, సినీ ప్రముఖుల చేతుల మీదుగా ఆడియోను విడుదల చేశారు. కలకొండ నర్సింహ మాట్లాడుతూ– ''ఇప్పుడు చిన్నపిల్లల దగ్గర నుంచి పెద్దవాళ్ల వరకు 4జి నెట్‌వర్క్‌కి అలవాటు పడి చదువులు, ఉద్యోగాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. తల్లిదండ్రులు, బంధువులను కూడా పట్టించుకోవడం లేదు. ఇలాంటి విషయాలను మా చిత్రంలో సందేశాత్మకంగా చూపించాం'' అన్నారు. సి.ఎల్.సతీష్ మార్క్ మాట్లాడుతూ– ''అందర్నీ ఆలోచింపజేసే సినిమా ఇది. ప్రస్తుత సమస్యలు, నిజ జీవితంలో జరుగుతున్న సంఘటనల ఆధారంగా ఉన్న మా సినిమాని ప్రేక్షకులు ఆదరిస్తారన్న నమ్మకం ఉంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: భానుప్రసాద్ .జె













సాక్షి ఫ్యామిలీ సన్నిధి
నల్లగొండ ॥ ఆదివారం
29-12-2019

మండలదీక్షను ఆచరించిన భక్తకోటి భక్తిశ్రద్ధలతో ఇరుముడి కట్టుకొని శబరి కొండకు ప్రయాణం అయే సమయం ఇది. దాదాపు నాలుగు కోట్ల మంది యాత్రికులు శబరిమలై యాత్ర చేస్తారని అంచనా. వీరిలో దాదాపు 75 శాతం మంది రైలు మార్గంలో శబరిమలై వెళుతుంటారు. అక్కడ పూజాదికాలు ముగించుకొని, తిరిగి చెంగనూరునుంచి వెనక్కి మళ్లుతారు. చెంగనూరును ఒక రైల్వే స్టేషన్‌గానే చూస్తుంటారు తప్పితే ఆ ప్రాంతం చుట్టుపక్కల ఉండే అరుదైన పుణ్యక్షేత్రాల గురించి తెలియకపోవడం వల్ల చెంగనూరు రైల్వే స్టేషన్‌కు చేరుకొని రైలు కోసం వేచి చూస్తూ కాలం గడుపుతుంటారు. చెంగనూరు రైల్వే స్టేషన్‌కు చాలా సమీపంలో కొలువై ఉన్న ఈ క్షేత్రాల గురించి తెలియనివారు ఇకనైనా దర్శించుకుని తరించగలరనే ఉద్దేశ్యంతో ఈ వ్యాసం.


అరణ్ముల పార్థసారథి దేవాలయం

# చెంగనూరు చుట్టు ఆలయాల మెట్లు

చెంగన్ అంటే ఎర్రటి నేల. ఈ విధమైన నేల కలిగిన ప్రాంతం కాబట్టి చెంగనూరు అనే పేరు ఏర్పడింది. ఇక్కడ కొలువైన పుణ్యక్షేత్రమే మహాదేవ ఆలయం లేదా భగవతి అమ్మగుడి. ఈ గుడిలో ముందు వైపున శివలింగం ఉంటే, వెనుకవైపున అమ్మవారి విగ్రహం ఉండటం ఆలయ ప్రత్యేకత. విశేషమేమిటంటే, ఇక్కడ 3, 4 నెలలకు ఒకసారి అమ్మవారి వస్త్రానికి రక్తపుమరకలు కనిపిస్తాయట. దీనిని త్రిప్పుట్టు అంటారు. ఆ సమయంలో మూడు రోజులపాటు దర్శనాలు నిలిపివేసి ఆలయాన్ని శుద్ధి చేశాక, దర్శనాలకు అనుమతిస్తారు. దేవాలయంలో ఈ సమయాన్ని ఆధారంగా చేసుకొని, ఏడాదికి మూడుసార్లు త్రిపుట్టు ఆరట్టు పేరుతో ఏనుగుల మీద ఉత్సవ విగ్రహాల్ని ఊరేగింపుగా తీసుకెళ్లి పంబానదిలో స్నానం చేయిస్తారు. మహిళలంతా దీపజ్యోతులు వెలిగించి ఊరేగింపుగా ఇందులో పాల్గొంటారు. ఈ సమయంలో పంచవాద్య మేళతాళాలతో ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. ఇంతటి మహిమాన్వితమైన దేవాలయం చెంగనూరు పట్టణం నడిబొడ్డున రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్‌లకు కేవలం కిలోమీటర్ దూరంలో ఉంటుంది.

**పంచ పాండవులు నిర్మించిన ఆలయాలు**

మహాభారత కాలంలో పంచపాండవులు చివరి సమయంలో పరీక్షిత్తుకి రాజ్యాన్ని అప్పగిస్తారు. తర్వాత పుణ్యక్షేత్రాలు దర్శిస్తూ కేరళకు వస్తారు. ఇక్కడ ప్రకృతిని చూసి ముచ్చటపడి, పాండవులు వేర్వేరుగా అయిదు శ్రీకృష్ణదేవాలయాల్ని నిర్మించుకున్నారట. ఈ ఆలయాలన్నీ చెంగనూరు పట్టణం చుట్టూ నెలకొని ఉంటాయి. ధర్మరాజు ప్రతిష్ఠించిన తిరిచిట్టాట్ మహావిష్ణు దేవాలయం, భీమసేనుడు ప్రతిష్ఠించిన పులియూర్ మహావిష్ణు దేవాలయం, అర్జునుడు నెలకొల్పిన అరణ్ముల పార్థసారథి దేవాలయాలు పూర్తిగా చెంగనూర్‌కు ఆనుకొని ఉంటాయి. ఇక నకులుడు ప్రతిష్ఠించిన తిరువాన్ వండూర్ మహావిష్ణు దేవాలయం, సహదేవుడు ప్రతిష్ఠించిన తిరుకొడితనమ్ మహావిష్ణు దేవాలయాలు మాత్రం కొద్దిపాటి దూరంలో ఉన్నాయి. చెంగనూరు రైల్వేస్టేషన్ లేదా బస్ స్టేషన్ నుంచి ఒక ఆటో లేదా కారు మాట్లాడుకొని ఒక్క రోజులో ఈ అయిదు గుడులు దర్శించి రావచ్చు. నమ్మాళ్వార్ దివ్యదేశం గ్రంథంలో ప్రస్తావించిన 108 వైష్ణవదేవాలయాల్లోనూ ఈ అయిదింటి గురించిన వివరణ ఉన్నది. ట్రావన్‌కోర్ దేవస్థానమే ఈ గుడులను కూడా నిర్వహిస్తున్నది.

**తిరిచిట్టాట్ మహా విష్ణు దేవాలయం**

ఈ ఆలయం పూర్తిగా చెంగనూర్ పట్టణం మధ్యలోనే నెలకొని ఉన్నది. దీనిని ధర్మరాజు ప్రతిష్ఠించినట్లు చెబుతారు. శ్రీకృష్ణుడితోపాటు బలరాముడి విగ్రహాన్ని కూడా ఇక్కడ చూడవచ్చు. స్వామి పుష్కరిణి దగ్గర ప్రతీ ఏటా ఉత్సవాలు నిర్వహిస్తారు.

**తిరుపులియూర్ మహావిష్ణు దేవాలయం**

చెంగనూర్ పట్టణ శివారు ప్రాంతమే పులియూర్. హరిప్పాడ్ నాగక్షేత్రానికి వెళ్లే దారిలో ఇది అగుపిస్తుంది. పూర్వం ఇక్కడ సప్తరుషులు ఆసీనులై పూజలు అందుకొన్నట్లు స్థల పురాణం. అందుకే ఇక్కడ సప్తర్షుల దేవాలయాలున్నాయి.

**అరన్ముల పార్థసారథి ఆలయం**

పంచపాండవుల ఆలయాలలో ఇదే ముఖ్యమైన దేవాలయం. అరన్ముల అంటే ఆరు వెదురు స్తంభాలు అని అర్థం. ఆరుస్తంభాల కోవెలగా దీన్ని చెబుతారు. ప్రతి ఏటా మకరజ్యోతి సమయంలో అయ్యప్పకి అలంకరించే తిరువాభరణాలను ఊరేగింపుగా తీసుకొని వెళ్లేటప్పుడు ఈ గుడి దగ్గర ఆపి పూజలు నిర్వహిస్తారు. ఇది అర్జునుడు నిర్మించిన ఆలయం కావటంతో ఇక్కడ విశేషంగా నాట్యార్చనలు జరుగుతుంటాయి. దాదాపు ఆరడుగుల ఎత్తున కృష్ణపరమాత్మ విశ్వరూప దర్శనం కనిపిస్తుంది. దీంతోపాటు అయ్యప్ప, నాగరాజ, బలరామ మూర్తుల కోవెలలు ఉన్నాయి. దేవాలయానికి ఉత్తరం వైపున పంబనది దర్శనం ఇస్తుంది. మలయాళ ధనుర్మాసంలో ఇక్కడ ఖాండవ వన దహనం నిర్వహిస్తారు.


చెంగనూరులోని భగవతీ ఆలయం

**తిరువాన్ వాండూర్ మహావిష్ణు దేవాలయం**

ఈ ఆలయాన్ని నకులుడు నిర్మించినట్లు చెబుతారు. చెంగనూరుకు సమీపంలోనే ఈ గ్రామం ఉంది. ఇది పంబనదికి ఆనుకొని ఉండటం వలన ఇక్కడ స్వామిని పంబనిచప్పన్ అనీ పిలుస్తారు. ఇక్కడ ప్రతి ఏటా నిర్వహించే గజ మేళా చెప్పుకోదగినది.

**తిరుకోడిత్తనమ్ మహావిష్ణుదేవాలయం**

ఇక్కడ శ్రీ కృష్ణావతారంతోపాటు నరసింహస్వామిని కూడా దర్శించుకోవచ్చు. సహదేవుడు నిర్మించిన ఆలయం ఇది. స్వామి నిల్చొన్న భంగిమలో దర్శనం ఇస్తాడు. ఆయన్ని అద్భుతనారాయణుడు అని, అమృత నారాయణుడు అని పిలుస్తుంటారు. ఇక్కడ ఉత్సవాలలో కూటక్కుట్టు నాట్యం విశిష్టమైనది.

**తిరువల - శ్రీ వల్లభ స్వామి ఆలయం**

ఇక్కడ శ్రీ వల్లభుని ఆలయం ఉంది. దాదాపుగా సంవత్సరం పొడవునా నాట్య ఉత్సవాలు నిర్వహిస్తారు. దేవాలయం మూసివేసిన తర్వాత రాత్రంతా ఇక్కడ శ్రీ కృష్ణుణ్ణి స్మరిస్తూ మోహిని అట్టం, కథాకళి రీతుల్లో నాట్య ప్రదర్శన జరుగుతుంది. అర్ధరాత్రి పూట సప్తర్షులు ఇక్కడకు వచ్చి అర్చనలు నిర్వహిస్తారని స్థానికుల నమ్మకం. దుర్వాసమహర్షి తపస్సు చేసిన ప్రాంతం అని, ఆయన విష్ణుమూర్తి పాదాలు కడిగిన కొలనుగా స్థానిక పుష్కరిణిని చెబుతారు.

**హరిప్పాడ్ సుబ్రహ్మణ్య క్షేత్రం**

చెంగనూరు రైల్వేస్టేషన్‌కు అతి సమీపంలో ఉండే మహిమాన్విత క్షేత్రమే హరిప్పాడ్. ఇక్కడ సుబ్రహ్మణ్య స్వామి ఆలయం ఉంది. పరశురాముడు ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లుగా చెబుతారు. నాలుగు చేతులు కలిగిన మురుగన్ విగ్రహం దాదాపు ఎనిమిది అడుగుల ఎత్తులో కనిపిస్తుంది. ఇక్కడ నాగ పడగలు, నాగ ప్రతిమలు చాలా విశిష్టమైనవి. చెంగనూర్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉండే బస్‌స్టాండ్ నుంచి హరిప్పాడ్‌కు నేరుగా బస్సులున్నాయి.

**మావెలిక్కర భద్రకాళి దేవాలయం**

చెంగనూరు దాటాక తదుపరి రైల్వేస్టేషన్ మావెలిక్కర. ఇక్కడ అమ్మవారి గుడి చాలా పెద్దది. మొత్తం ట్రావెన్‌కోర్ దేవస్థానం ఆలయాల్లో శబరిమలై తర్వాత ఎక్కువ ఆదాయం వచ్చే ఆలయంగా దీన్ని చెబుతారు. ఇది తాంత్రికపూజలకు నెలవైన ఆలయం. దీన్ని చెట్టికుళంగర దేవాలయం అని పిలుస్తారు. ఇక్కడ అత్యద్భుతంగా నిర్వహించే కుంభ భరణి దీపోత్సవానికి భక్తులు విచ్చేస్తారు.

**ముక్కంటి క్షేత్రాలు**

చెంగనూర్, కొట్టాయంకు సమీపంలో వైకోమ్ మహాదేవాలయం, ఎట్టుమాన్నూర్ మహాదేవాలయం, కడతుర్తి మహాదేవాలయం పేరుతో మూడు సుప్రసిద్ధ శైవక్షేత్రాలున్నాయి. ఈ మూడు ఆలయాలు చాలా విశాలమైన ప్రాంగణంలో కొలువుదీరి ఉంటాయి. వీటిని ఒకేరోజున దర్శించుకొనే వీలుంది. ఇక్కడ రోజూ సాయంత్రం జరిపే ఊరేగింపు అత్యంత శోభాయమానం.

– వై.రమ విశ్వనాథన్
సీనియర్ పాత్రికేయులు

స్త్రీ వైశిష్ట్యం-22

# మాతా... వందనం


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

95 ఏళ్ళు వచ్చాయి. ఒళ్ళు బాగా ముడతలు పడిపోయింది. బొమ్మలా చిన్నదిగా మంచంలో ముడుచుకుని పడుకుని ఉంది. రాత్రి 11 గంటలకు కొడుకు ఇంటికి వచ్చి భోజనానికి కూర్చుని రెండు నిమిషాల్లో లేచి పోయాడు. పక్కగదిలో పడుకుని ఉన్న అమ్మ కొడుకుని పిలిచి ''నాన్నా, రెండు మూడు రోజుల్నించి ఇలాగే వస్తున్నావురా, రెండు మూడు నిమిషాల్లో భోజనం ముగించేస్తునావురా... ఇలా అయితే ఆరోగ్యం ఎక్కడ నిలబడుతుందిరా?'' అంటుంది. వడ్డించక్కరలేదు. వాడు కంచం దగ్గరినుంచి లేచిపోయిన సమయాన్ని బట్టి తల్లి తల్లడిల్లిపోతుంది.

దురదృష్టం అంటే... జీవితంలో అమ్మ పోయిననాడే. అమ్మ ఉన్నన్నాళ్ళూ ఓదార్పుకు లోటు లేదు. 60 ఏళ్ళు దాటిన కొడుకయినా జ్వరం వచ్చిందని తెలిసి వాడిని దగ్గరికి పిలిచి బొటనవేలితో విభూతి పెట్టి ''చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర పాహిమాం, చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర రక్షమాం'' అంటూంటే అమ్మ దగ్గర లభించిన ఆ ఓదార్పు ప్రపంచంలో మరెక్కడయినా లభిస్తుందా? అమ్మ శరీరం పడిపోయిన తరువాత అమ్మ కట్టి విప్పిన చీరలను బొంతగా కుట్టుకుని పడుకున్నా సేదదీరుతుంది. అమ్మ కట్టి విప్పిన బట్టకు కూడా అంత ప్రేమ. అది కూడా అంత ఓదార్పునిస్తుంది. అమ్మవేసుకుని విప్పిన చెప్పులు, కళ్ళజోడు వాటిని చూసేటప్పటికి మనసు ఆర్ద్రతను పొందుతుంది. అమ్మలాంటి వ్యక్తి ఈ సృష్టిలో ఉండదు.

అందుకే జగన్మాత అంతటిది కూడా తల్లిని తీసేయవలసి వస్తే బెంగపెట్టుకుంటుందట. వీడు ఇక అమ్మా అని పిలిస్తే నేనేమని జవాబు చెప్పాలి. అలాగని అమ్మచేతిలో బిడ్డ వెళ్ళిపోవడం మర్యాద కాదు. బిడ్డచేతిలో అమ్మే వెళ్ళిపోవాలి. ఒక్క అమ్మను నేను నీ నుండి తీసేయాల్సి వస్తే ముగ్గురు అమ్మలను చూపించి అప్పుడు తీసేసుకుంటానంటుందట. 'ఒరేయ్, నేను నీకు భూమాతనిచ్చాను. ఈ తల్లి కూడా తల్లే. నువ్వు ఎక్కడున్నా ఈ అమ్మ ఒడిలోనే ఉంటావ్' అని ఈ అమ్మనిచ్చింది. తరువాత దేశమాత. ఈ దేశానికంతటికీ అధిష్ఠానం ఉంది. అది దర్శించారు దేశభక్తులు. ఇది ఈ దేశ రుషి సంప్రదాయం. ఇది కేవలం మట్టి అని వాళ్ళు అనలేదు. 'వందేమాతరం వందేమాతరం సుజలాం సుఫలాం మలయజ శీతలాం సస్యశ్యామలాం మాతరం వందేమాతరం' అన్నాడు బంకించంద్ర ఛటర్జీ. ఒక వాల్మీకి, ఒక వ్యాసుడు ఎటువంటి వాడో నా దృష్టిలో బంకించంద్ర ఛటర్జీ కూడా అటువంటివాడే. అలా దేశాన్నంతటినీ కూడా ఒక తల్లి రూపంగా చూసి ఆరాధించాడు మహానుభావుడు. అలా భూమాతను, దేశమాతను, గోమాతను ఇచ్చాను. అంత వృద్ధాప్యంలో కూడా పుట్టినరోజు నాడు వణికిపోతున్న చేతుల్తో తలమీద చెయ్యి పెట్టి అక్షింతలు వేసి లడ్డు చేతిలో పెట్టి తిను



అనడం కాదు, ఏదీ నోరు తెరు అని నోటిలో పెట్టి నువ్వు తింటూ ఉంటే సంతోషపడే అమ్మ లేదని రేపొద్దున నన్ను నింద చేస్తావేమో, అందుకే నీకు గోమాతని ఇస్తున్నాను''అంటుందట జగన్మాత. ''పుట్టినరోజునాడు ఆవుపాలు తాగు. అవి తాగితే ఎప్పటికీ నీవు అమ్మ చేతి ముద్ద తిన్నవాడివే అవుతావు''అని ఒక్క అమ్మను తీసుకోవలసి వస్తే ముగ్గురు అమ్మల్ని చూపించి... ఆ పైన...'మీ అమ్మ ఎక్కడో లేదు.. నాలోనే చేరింది. నా దగ్గరకు వచ్చి నీవు చేసిన నమస్కారం మీ అమ్మకే అందిస్తా' అంటుందట. అమ్మ అన్నమాట అంత గంభీరం.

ఇస్లాం వెలుగు

# అర్థమైంది గురువర్యా...

ఓ ధార్మిక గురువుకు ఇద్దరు శిష్యులు. ఒకసారి ఆ శిష్యులు నమాజుకు బయలుదేరారు. మార్గమధ్యంలో వారు చూస్తుండగానే ఓ వ్యక్తికి ప్రమాదం జరిగింది. అక్కడ ఆగిపోతే నమాజు సమయం మించిపోతుంది. వదిలేసి వెళ్ళిపోతే అతని ప్రాణాలు పొయ్యే పరిస్థితి. ఇద్దరిలో ఒక యువకుడు దైవకార్యాన్ని ఎట్టిపరిస్థితిలోనూ విడిచిపెట్టకూడదని, తరువాత ఆలోచిద్దామన్నాడు. కాని రెండవ యువకుడు, నమాజును తరువాత చేసుకుందాం... ముందు ఇతడిని వైద్యుడి దగ్గరికి తీసుకు వెళదామన్నాడు. కాని అతను, 'దైవప్రార్థన తరువాతనే ఏదైనా' అంటూ స్నేహితుడి స్పందన కోసం కూడా చూడకుండా వెళ్ళిపోయాడు. రెండో యువకుడు ఆ క్షతగాత్రుణ్ణి దగ్గరిలోని వైద్యుని వద్దకు తీసుకు వెళ్ళాడు. ప్రథమ చికిత్స అందించిన వైద్యుడు, సకాలంలో తీసుకొని రావడం వల్ల ఇతని ప్రాణాలు నిలిచాయని, ఆలస్యమైతే ఇతను ప్రాణాలతో మిగిలేవాడు కాదనీ అన్నాడు. తరువాత ఆ యువకుడు కూడా మసీదుకు చేరుకొని, దైవానికి కృతజ్ఞతాస్తోత్రాలు చెల్లిస్తూ రెండు రకతులు నఫిల్ నమాజు, తరువాత ఫర్జ్ నమాజు ఆచరించాడు. కాసేపటికి విషయం గురువుకు తెలిసింది. అంతా సావధానంగా విన్న గురువు, మొదటి శిష్యుణ్ణి మందలించాడు. ధర్మాన్ని నువ్వు సరిగ్గా అర్థం చేసుకున్నావని రెండవ శిష్యుణ్ణి ప్రశంసించారు.



దీంతో, 'అదేమిటి గురువర్యా.. జమాత్‌తో నమాజ్ ఆచరిస్తే ఎక్కువ పుణ్యం లభిస్తుంది కదా. జమాత్ వదలడం పాపం కదా' అన్నాడు శిష్యుడు.

'నువ్వన్నది నిజమే.. కాని, ఒక వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఉంటే, అతణ్ని గాలికి వదిలేసి ప్రార్థనలో లీనమైపోతే దేవుడు ఆ ప్రార్థనను స్వీకరిస్తాడా? ఈనాడు చాలామంది చేస్తున్న తప్పు ఇదే. సామాజిక విషయాలను పట్టించుకోకుండా ఆధ్యాత్మికతలో లీనమైపోతున్నారు. మరికొందరు ప్రాపంచిక విషయాల్లో పడి ధర్మాన్ని పట్టించుకోవడం లేదు. తోటి మానవుల్ని నిర్లక్ష్యం చేసి ఆధ్యాత్మికతలో ఎంతగా మునిగి తేలినా దేవుడు హర్షించడు. తన ఆరాధనలను నెరవేర్చకపోయినా దైవం క్షమిస్తాడు కాని మానవ హక్కుల విషయంలో మాత్రం మన్నించడు. దైవ ప్రసన్నత ద్వారానే ఇహ పరలోకాల్లో సాఫల్యం' అని చెప్పాడు గురువు. అర్థమైందన్నట్లు తల పంకించాడు శిష్యుడు.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

సువార్త

# దేవుని తీర్పు కోసం సిద్ధపడే తరుణమిది

బబులోను రాజైన బెల్షస్సరు రాజవంశీయులైన వెయ్యి మంది అధిపతులకు, తన రాణులకు, ఉపపత్నులకు ఒక రాత్రి గొప్ప విందు చేశాడు. తన రాజధానియైన బబులోను పట్టణమంటే అతనికెంతో అతిశయం!! బబులోను పట్టణం చుట్టూ 350 అడుగుల ఎత్తు, 85 అడుగుల వెడల్పున మహా ప్రాకారముంది. శత్రువుల ఆగమనాన్ని పసిగట్టేందుకు ఆ గోడ మీద 350 చోట్ల కాపలా శిఖరాలున్నాయి. ప్రాకారాన్ని ఆనుకొని పట్టణం చుట్టూ మొసళ్ళు నివసించే నీళ్లతో లోతైన కందకాలున్నాయి. శత్రువు బయటి నుండి ముట్టడి వేసినా కోట లోపల కొన్ని ఏళ్లపాటు సుఖంగా బతికేందుకు అవసరమైనన్ని ధాన్యం, ఆహారం నిల్వలు న్నాయి. అందువల్ల తమ ప్రాణాలకు, భద్రతకు ఏమాత్రం ధోకా లేదన్న అతివిశ్వాసంతో రాజైన బెల్షస్సరు విందులు వినోదాలతో కాలక్షేపం చేస్తున్నాడు. పైగా యెరూషలేము మహాదేవుని ఆలయం నుండి దోపిడీ చేసి తెచ్చిన బంగారు పాత్రల్లో ద్రాక్షారసం తాగేందుకు పూనుకోవడం అతని అహంకారానికి పరాకాష్ట అయ్యింది. ఆ రాత్రే ఒక అదృశ్యవ్యక్తి తాలూకు హస్తం అతని ఎదుట గోడమీద ఏదో రాయడం అతనికి కలవరం కలిగించింది. తన వద్దనున్న జ్యోతిష్కులు, గారడీవాళ్ళు, మంత్రగాళ్ళ ద్వారా దాని భావాన్ని తెలుసుకోవడానికి విఫల ప్రయత్నం చేశాడు. చివరికి దానియేలు ప్రవక్త అతనికి దాని గుట్టు విప్పి చెప్పాడు. 'రాజా, నీ తండ్రి నెబుకద్నెజరు చేసిన తప్పిదాన్నే నీవు కూడా చేస్తున్నావు. నీ తండ్రిని దేవుడు ఎలా శిక్షించాడో అంతా ఎరిగి కూడా నిన్ను నీవు సరిచేసుకోకుండా, నిగ్రహించుకోకుండా పరలోకమందలి దేవుని కన్నా పైగా నిన్ను నీవు హెచ్చించుకున్నావు. అందువల్ల 'మేనే మేనే టేకేల్ ఉఫారసీన్' అని దేవుని హస్తం నిన్ను గురించి దైవభాషలో రాసింది. అంటే దేవుడు నీ విషయం లెక్క చూసి, తన త్రాసులో తూచగా నీ అహంకారం వల్ల నీవు చాలా తక్కువగా తూగావు. అందువల్ల 'ఇదంతా నాదేనంటూ నీవు విర్రవీగుతున్న నీ రాజ్యాన్నంతా తీసి దేవుడు నీ శత్రువులైన మాదీయులు, పారసీకులకు ఇవ్వబోతున్నాడు' అని దేవుని తీర్పును అతనికి వెల్లడించాడు. ఆ రాత్రే అదంతా నెరవేరి, బెల్షస్సరు శత్రువుల చేతిలో చనిపోగా, అతని రాజ్యం శత్రురాజుల చేజిక్కింది.



**దేవుడెంత న్యాయవంతుడంటే, ముందుగా హెచ్చరించకుండా, పరివర్తన చెందేందుకు సమయమివ్వకుండా ఎవరినీ శిక్షించడు. సమయమిచ్చినా దాన్ని వాడుకొని మారనివారిని దేవుడెట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టడు కూడా. 'ఎంతో మంది చక్రవర్తులు, మహాపాలకులు కూలిపోయింది శత్రురాజుల చేతిలో కాదు, వాళ్ళు తమ అహంకారానికే బలయ్యారు' అన్నది చరిత్ర చెప్పే సత్యం!!**

రాజైన హిజ్కియా కూడా దారి తప్పి పశ్చాత్తాపపడితే దేవుడు మరో అవకాశాన్నిచ్చి అతని ఆయువును పెంచాడు. అతని కొడుకు మనశ్శహే రాజు కూడా తప్పులు చేసినా, తన తండ్రిలాగే తనను తాను సరిదిద్దుకొని మరో అవకాశం పొందాడు.

బబులోను రాజైన బెల్షస్సరు మాత్రం తన తండ్రి నెబుకద్నెజరుకు జరిగిన దాన్నంతా చూసి కూడా గుణపాఠం నేర్చుకోక తన అహంకారానికి, అజ్ఞానానికి బలై భ్రష్టుడయ్యాడు. తన చుట్టూ ఉన్న కోట, తన సైనికులు తనను కాపాడుతారనుకున్నాడు కాని మహాకాశంలో తన సింహాసనాన్ని కలిగి ఉన్న దేవదేవుడు తనను కూడా పాలించే మహాపాలకుడన్న వాస్తవాన్ని మరచిపోయి విచ్చలవిడిగా ప్రవర్తించి, వినాశనాన్ని కొని తెచ్చుకున్నాడు. దేవుడు ఆది నుండీ చెప్పేది అదే!! మనిషి వినాశనం మనిషి చేతుల్లోనే ఉంటుంది. తనను తాను తగ్గించుకొని దేవుణ్ణి ఆశ్రయించినవాడే ఆ వినాశనం నుండి తప్పించుకోగలడు. దేవుడిచ్చిన పాపక్షమాపణను పొందిన వారే దేవుని తీర్పును తప్పించుకోగలరు.

–రెవ.డా. టి.ఎ.ప్రభుకిరణ్
ఈమెయిల్: prabhukirant@gmail.com

ప్రశ్నోత్తర భారతం



## అర్జున ద్రోణులు

430. ద్రోణాచార్యుడు అశ్వత్థామకు ఎంత పరిమాణంలో ఉన్న నీటి ఘటం ఇచ్చేవాడు?
431. అర్జునుడు ఏం చేశాడు?
432. ఎరుకల రాజు పేరు ఏమిటి? అతడి కుమారుడు ఎవరు?
433. ఏకలవ్యుడిని ద్రోణాచార్యుడు శిష్యునిగా తిరస్కరించడంతో ఏం చేశాడు?
434. ఆచార్యుని అనుమతితో రాజపుత్రులందరూ ఎక్కడకు దేని కోసం బయలుదేరారు?
435.రాజపుత్రులు తమ వెంట దేనిని తీసుకువెళ్లారు?

- నిర్వహణ: డా. వైజయంతి పురాణపండ

జవాబులు: 430. నీళ్లు తేవడానికి అందరికీ ఇచ్చే ఘటం కంటె చిన్న ఘటం ఇచ్చేవాడు. ఇతరులెవ్వరూ చూడకుండా అస్త్రలాఘవాలు నేర్పేవాడు. అది అర్జునుడు గమనించాడు. 431. అశ్వత్థామ నీటితో వచ్చే సమయానికి అర్జునుడు వారుణాస్త్రంతో తన ఘటం నింపి, ఆచార్యుని దగ్గరకు వచ్చేవాడు. ఆ రోజు నుంచి అర్జునుడు అశ్వత్థామ కంటె ఏనాడూ వెనుకపడలేదు. అందువల్ల గురువుకు ప్రీతిపాత్రుడయ్యాడు. 432. హిరణ్యధన్వుడు. అతడి కుమారుడు ఏకలవ్యుడు. 433. అరణ్యంలో ద్రోణుని ప్రతిమను మట్టితో నిర్మించుకుని గురువుగా పూజిస్తూ, దృఢ సంకల్పంతో ధనుర్విద్యను అభ్యసించాడు. గురువు మీద భక్తిశ్రద్ధలుంచి ధనుర్విద్యా రహస్యాలన్నీ అభ్యాసం చేస్తూ సాధించాడు. 434. ఘాతుక మృగ హింస కోసం రథాల మీద అరణ్యానికి బయలుదేరారు. 435. వేటకుక్కను

గురు సన్నిధి-24

నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

# భగవాన్ రమణమహర్షి

''నువ్వేమిటో తెలుసుకోకుండా, జగత్తును తెలుసుకోవాలనుకుంటే, అది నిన్ను చూసి వెక్కిరిస్తుంది. ముందు నీ మనస్సుని చదువు. తర్వాత జగత్తును చూడు. అప్పుడు ప్రపంచమే ఆత్మ అవుతుంది. నీకు అవగతమవుతుంది''అంటారు భగవాన్ రమణ మహర్షి. భగవదన్వేషణలో ఎన్నెన్నో ప్రశ్నలతో రమణాశ్రమం చేరినవారికి ఆశ్చర్యకరంగా భగవానుల శక్తిమంతమైన మౌనంలోనే సంశయ నివారణ అయ్యేది. ఆయన మౌనమే వారికి మహాజ్ఞాన బోధ. రమణుల సమస్త ఉపదేశ సారం ఏమంటే ''నిన్ను నీవు తెలుసుకో''.


డిసెంబర్ 30న రమణుల జన్మదినం

**నీకేది కావాలో ఆయనకు తెలుసు**

శివదర్శనం కోసం తహతహలాడుతున్న భక్తురాలిని చూచి భక్తిని గురించి వివరించారు రమణులు. ''భగవంతుడిని శరణు వేడు. ఆయన ఇష్టానికి తలవంచు. నీ ఇష్టమొచ్చినట్లు ఆయన నడుచుకోవాలనుకోవడం శరణాగతి కాదు. నీకు ఎప్పుడు, ఏది, ఎలా చెయ్యాలో ఆయనకే బాగా తెలుసు. ఈ విషయంలో నీకిక బాధ్యతలే ఉండవు. అన్ని బాధ్యతలూ ఆయనవే. ఇదే అసలైన శరణాగతి. ఆ పరమాత్మ పేరే 'నేను'. అన్నిటా వ్యాపించిన ఆ భావనతో కలిగే సద్భావస్థితిని ఉత్తమమైన భక్తి అంటారు. ప్రేమ, వికాసం, అనురాగం కలిగివుండటం నిజమైన భక్తుని లక్షణం'.

**పరిమితులను దాటడమే పరిత్యాగం**

తన ఉద్యోగానికి రాజీనామా చేసి, నిరంతరం మహర్షి సాన్నిధ్యంలో ఉండాలనే తలంపుతో ఉన్న భక్తుడికి భగవాన్ ఒకనాడు కర్తవ్యాన్ని ఉపదేశించారు. 'భగవాన్ ఎప్పుడూ మీతోనే, మీలోనే వున్నారు. ఈ విషయం బోధపడటానికి నువ్వు నీ ఉద్యోగానికి రాజీనామా చేయనవసరం లేదు. నీ బాధ్యతలనుండి తప్పుకోనక్కరలేదు. సమస్త భారాల్ని మోసే భగవంతునితో రాజీపడు. కోరికలను, మోహాలను విడిచిపెట్టు. అప్పుడు సమస్త ప్రపంచాన్ని ప్రేమించగలుగుతావు''

వ్యక్తులనేగాదు... పశుపక్ష్యాదులను సైతం గౌరవంగా సంబోధిస్తూ వాటిపై తమ అనుగ్రహాన్ని ప్రసరింపజేసిన రమణులు అనవసరపు ఆడంబరాలను నిరాకరించి నిజమైన ఆధ్యాత్మికత అంటే ఏమిటో తన నడవడికతో చూపించారు. అందుకే వారి ఆధ్యాత్మిక శక్తివిలాసం ఈనాటికీ ఉజ్జ్వలంగా భాసిస్తోంది.

– అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని
వేదపండితులు

ఆలయం ఆగమం-34

# ఆలయ కవాటం



కవాటం అంటే తలుపు. ఆలయరక్షణకోసం.. స్వామివారి ఏకాంతం కోసం గుడి తలుపులు ఏర్పాటు చేయబడ్డాయి. ప్రాచీన ఆలయాల నుంచి నేటివరకూ ఆలయతలుపులు దారువు (కొయ్య)తోనే చేసి అవకాశాన్ని బట్టి దానికి ఇత్తడి, రాగి, వెండి, బంగారుతో చేసిన రేకులను బిగిస్తున్నారు. ఇలా లోహాలతోచ శిల్పాలతో తలుపులను అలంకరించడం వలన దేవతల ప్రీతి పొందుతారని ఆగమాలు చెబుతున్నాయి.

ఆలయద్వారం, తలుపు చెక్కలను, వాటికి జోడించే నిలువు, అడ్డ పట్టికలను ఒకే జాతికి చెందిన కొయ్యతో నిర్మించడం చాలా మంచిది. అలా కాకుండా మిశ్రదారువులతో చేస్తే విపరీతమైన ఫలితాలు ఎదురౌతాయని ఈశాన శివగురుదేవ పద్ధతి తెలిపింది. ద్వారబంధం శిలతో నిర్మించి తలుపులు కొయ్యతో చేస్తే దోషమేమీ లేదు.

ద్వారబంధానికి లోపల ఇరువైపులా రెండేసి ఇనుము కమ్మీలను ఏర్పరచి తలుపులకు గుండ్రని కమ్మీలకు తగిలించి తిరగడానికి చేసే ఏర్పాటుకు భ్రమరకాసంధి అని పేరు.

దేవాలయ ద్వారానికి రెండువైపులా జోడు తలుపులు ఉండాలి. వీటిని యుగ్మకవాటం అంటారు. ఆలయాల్లో చిన్న ఆలయాలకు.. ముందున్న రెండు స్తంభాలకు కలిపి తలుపు పక్కకు జరిపి వేసే తలుపులను సంహార కవాటం అంటారు. ఆలయాల్లో గానీ.. గృహాల్లో గానీ గూడు లేదా అల్మరా నిర్మించి వాటికి ఉంచే తలుపులను ధావన కవాటం అంటారు. ప్రాచీన ఆలయాల్లో నేరుగా గర్భగుడికి తలుపులుండవు. అంతరాళ మండపం, అర్ధమండపాలకు మాత్రమే తలుపులు ఉంటాయి.

కవాటాల పైన పద్మాలు, చిరుగంటలు లేదా దశావతార శిల్పాలను, అష్టలక్ష్మీ విగ్రహాలను, ఆయా దేవతాలీలల్ని లేదా తిరునామం శంఖ చక్రాలు, గరుడ-హనుమ శిల్పాల్ని, అష్టదిక్పాలకులను చెక్కుతారు. అయితే కవాటాలపైన అష్టమంగళ చిహ్నాలు, లతలు, మకర, నర, నారీ, భూత, సింహాలు, గజ.. వ్యాలాది రూపాల్ని వారి వారి ఆలోచనలకు తగ్గట్టు చిత్రించాలని శ్రీప్రశ్నసంహిత సూచించింది.

కవాటాలను తెరవడమంటే భగవంతుని కరుణను మనపై కురిపించడమే. ప్రకృతిసిద్ధమైన దేవతారూపాలతో నిండిన కవాటాలు భక్తులకు కటాక్ష వీక్షణా గవాక్షాలు.

– కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య
ఆగమ, శిల్పశాస్త్ర పండితులు

epaper.sakshi.com

2019

రివైండ్



# గులాబీనామ సంవత్సరం

**అధికార టీఆర్‌ఎస్‌కు రాజకీయంగా కలిసొచ్చిన 2019**

- స్థానిక సంస్థల ఎన్నికల్లో 'క్లీన్ స్వీప్'
- తొలిసారి హుజూర్‌నగర్ అసెంబ్లీ సీటు కైవసం
- సీఎల్పీ విలీనాస్త్రంతో కాంగ్రెస్‌పై ఆధిపత్యం
- మంత్రివర్గ విస్తరణతో పలువురికి అవకాశం
- లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం తడబాటు
- నలుగురు సిట్టింగ్ ఎంపీల ఓటమి.. 9 సీట్లకే పరిమితం
- కొట్టుమిట్టాడుతున్న కాంగ్రెస్... 'స్థానిక'ంలో ఊరట విజయాలే
- కమలదళంలో ఉత్సాహం నింపిన 4 ఎంపీ సీట్ల గెలుపు
- ఉనికి చాటుకునేందుకు టీజేఎస్, లెఫ్ట్ పార్టీల తంటాలు

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో వరుసగా ఆరో ఏడాది కూడా టీఆర్‌ఎస్ హవా కొనసాగింది. రాజకీయంగా ఆ పార్టీకి 2019 అన్ని రకాలుగా కలిసొచ్చింది. ప్రధాన రాజకీయ ప్రత్యర్థి అయిన కాంగ్రెస్‌ను కుదేలు చేయడంతోపాటు స్థానిక సంస్థలను క్లీన్ స్వీప్ చేసుకోవడం ద్వారా అధికార టీఆర్‌ఎస్ ఈ ఏడాది పూర్తిస్థాయి రాజకీయ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీకి ఓ ఎమ్మెల్సీ సీటు, మూడు లోక్‌సభ స్థానాల్లో విజయం మినహా రాజకీయంగా ఈ ఏడాది అన్నీ ఒడిదుడుకులే ఎదురయ్యాయి. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్రం నుంచి నాలుగు ఎంపీ స్థానాలను గెలుచుకోవడం, ఎంపీగా గెలిచిన కిషన్‌రెడ్డి ఏకంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బాధ్యతలు చేపట్టడం ఆ పార్టీలో కాస్త జోష్ నింపాయి. అధికార టీఆర్‌ఎస్‌కు మిత్రపక్షంగా ఉంటున్న ఎంఐఎంకు అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కగా తెలంగాణ జన సమితి, లెఫ్ట్ పార్టీలు ఈ ఏడాది ఉనికి చాటుకునేందుకు తంటాలు పడ్డాయి.

## 32 జిల్లా పరిషత్‌లు గులాబీ ఖాతాలోకి...

ఈ ఏడాది జనవరిలో మూడు విడతల్లో 12,732 గ్రామ పంచాయతీలు, 1.13 లక్షల వార్డులకు జరిగిన ఎన్నికల్లో మెజారిటీ పదవులను అధికార టీఆర్‌ఎస్ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. అయితే లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం 'కారు' జోరు తగ్గింది. రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లకుగాను తొమ్మిది చోట్లే టీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. పార్టీ కీలక ఎంపీలైన కవిత, బోయినపల్లి వినోద్‌కుమార్, బూర నర్సయ్యగౌడ్, నగేశ్ ఓటమి పాలయ్యారు. మార్చిలో జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో నలుగురు టీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యారు. కరీంనగర్–మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గంతోపాటు వరంగల్–నల్లగొండ–ఖమ్మం, కరీంనగర్–మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్ టీచర్ల నియోజకవర్గాలకు జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రం టీఆర్‌ఎస్ మద్దతుదారులు ఓటమిపాలయ్యారు. శాసనమండలి స్థానిక సంస్థల కోటా ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థులు పట్నం మహేందర్‌రెడ్డి (రంగారెడ్డి), పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి (వరంగల్), తేరా చిన్నపరెడ్డి (నల్లగొండ) విజయం సాధించారు. ఎమ్మెల్యే కోటాలో నవీన్‌రావు శాసనమండలికి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఏడాది జూన్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 32 జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను టీఆర్‌ఎస్ క్లీన్‌స్వీప్ చేసింది. 5,659 ఎంపీటీసీ స్థానాలకుగాను 3556, 534 జెడ్పీటీసీ స్థానాలకుగాను 445 చోట్ల టీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. రెండో పర్యాయం సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కేసీఆర్ 2019లో రెండు విడతల్లో కేబినెట్‌ను విస్తరించారు.

ఫిబ్రవరిలో జరిగిన తొలి విడత విస్తరణలో ఈటెల రాజేందర్, జి.జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, ఎస్.నిరంజన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, కొప్పుల ఈశ్వర్, మల్లారెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లకు చోటు దక్కింది. సెప్టెంబర్‌లో జరిగిన రెండో విడత మంత్రివర్గ విస్తరణలో హరీశ్‌రావు, కేటీఆర్, పువ్వాడ అజయ్, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్‌లకు అవకాశం లభించింది. అక్టోబర్ 21న జరిగిన హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో గెలవడం ద్వారా తొలిసారిగా ఈ నియోజకవర్గం టీఆర్‌ఎస్ ఖాతాలో చేరింది. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన 13 మంది అధికారికంగా టీఆర్‌ఎస్‌లో చేరగా సీఎల్పీని విలీనం చేసుకోవడం ద్వారా కాంగ్రెస్‌ను టీఆర్‌ఎస్ కోలుకోలేని దెబ్బతీసింది.

## కుదేలవుతూ... కోలుకుంటూ కాంగ్రెస్ పయనం

అధికార టీఆర్‌ఎస్ రాజకీయ వ్యూహాలకు కుదేలవుతూనే ఈ ఏడాది కాంగ్రెస్ పయనాన్ని కొనసాగించింది. పార్టీ నుంచి గెలిచిన 13 మంది ఎమ్మెల్యేలను చేజార్చుకొని అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష హోదాను కోల్పోవడం ఈ ఏడాది కాంగ్రెస్‌కు ఘోర పరాజయంగా మారింది.



లోక్‌సభ ఎన్నికల్లో కేవలం 3 ఎంపీ సీట్లతోనే సరిపెట్టుకున్న కాంగ్రెస్.. స్థానిక సంస్థల ఎన్నికల్లో 30 శాతం స్థానాల్లో గెలిచినా ఒక్క జడ్పీ పీఠాన్ని కూడా తన ఖాతాలో వేసుకోలేకపోయింది. ఈ ఏడాది ఆసాంతంలో కాంగ్రెస్‌కు లభించిన పెద్ద ఊరట అంటే ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి గెలుపే. గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి ఆయన గెలవడమే కాంగ్రెస్‌లో కొంత ఉత్సాహాన్ని నింపింది. మరోవైపు పార్టీ కురువృద్ధుడు, కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి, మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ ఈ ఏడాది మరణించడం పార్టీకి తీరని లోటుగా మారింది. ఇక మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టే వ్యాఖ్యలు చేసినా ఆ తర్వాత సర్దుకొని పార్టీతో కలసి పనిచేస్తున్నారు. ప్రజాసమస్యలపై పోరాటాల విషయానికి వస్తే ఎప్పటిలాగే కాంగ్రెస్ తాబేలు యాత్ర చేసింది. ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యల విషయంలో ఎంపీ రేవంత్‌రెడ్డి కొంత హడావుడి చేసినా ఆర్టీసీ సమ్మె, దిశ హత్య లాంటి కీలకాంశాల్లో తగిన రీతిలో స్పందించలేదనే భావన వ్యక్తమైంది. ప్రభుత్వ ఆసుపత్రులు, కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన, అక్కడక్కడా యాత్రలతో ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేసిన కాంగ్రెస్ నేతల్లో ఇంకా సమన్వయ లేమి కనిపిస్తోంది. హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో ఓటమితో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌ను మారుస్తారనే ప్రచారం జరిగినా 2019లో అది జరగలేదు. ఈ ఏడాది చివర్లో ఎన్నార్సీ అంశంతో ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్‌కు 2020లో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు అగ్నిపరీక్షగా మారనున్నాయి.

## పోరాటాలు చేస్తున్నారు కానీ...!

గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది తాము ప్రజల్లోకి వెళ్లామని బీజేపీ అంచనా వేసుకుంటోంది. లోక్‌సభ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో విజయం కమలదళంలో కొత్త ఉత్సాహం నింపింది. ఇదే జోష్‌తో రాష్ట్రంలో 11 లక్షలుగా ఉన్న పార్టీ సభ్యత్వాన్ని 30 లక్షలకు పెంచుకుంది. అయితే స్థానిక నేతల మధ్య సమన్వయం, వ్యూహాల అమలులో కొంత వెనుకబడింది. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, అయోధ్య రామమందిరం లాంటి అంశాలు తమకు మేలు చేశాయన్న అంచనాలో ఆ పార్టీ నేతలు ఉన్నా ప్రజల్లోకి వెళ్లడంలో ఈ ఏడాది స్ఫూర్తిదాయక పోరాటం చేసినట్టు కనిపించలేదు. పార్టీ సీనియర్ నేత బండారు దత్తాత్రేయ ఈ ఏడాదిలోనే హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా నియమితులవగా మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేసిన విద్యాసాగర్‌రావు మళ్లీ పార్టీ కార్యక్రమాల్లోకి వచ్చారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు, ఆ తరువాత ప్రధాని మోదీ, పార్టీ చీఫ్ అమిత్ షా సహా 80 మందికిపైగా పార్టీ జాతీయ నేతలు, కేంద్ర మంత్రులు రాష్ట్రంలో పర్యటించడం, టీఆర్‌ఎస్ నుంచి మాజీ ఎంపీలు జితేందర్‌రెడ్డి, వివేక్ చేరడం, టీ టీడీపీ నేతలు గరికపాటి రామ్మోహన్‌రావు, పెద్దిరెడ్డి, సురేశ్‌రెడ్డి, వీరేందర్‌గౌడ్, కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి డీకే అరుణ, మాజీ ఎంపీ రాపోలు ఆనంద్ భాస్కర్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి వంటి నేతలను చేర్చుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో కొంత పట్టు సాధించగలిగింది. అయితే 'స్థానిక' ఎన్నికల్లో కనీస స్థాయిలోనూ గెలవలేకపోవడంతో రాష్ట్రంలో తామే ప్రత్యామ్నాయం అంటున్న కమలనాథులకు కొత్త ఏడాది పద్మవ్యూహం లాగానే కనిపిస్తోంది.

## విస్తరణ బాటలో ఎంఐఎం...

ఎంఐఎంకు ఈ ఏడాది అనుకోని అవకాశం లభించింది. టీఆర్‌ఎస్‌లో సీఎల్పీ విలీనం కావడంతో అసెంబ్లీలో ఏడుగురు సభ్యుల బలంతో ప్రధాన ప్రతిపక్ష హోదాను దక్కించుకుంది. ఈ హోదాతోనే ఆ పార్టీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ప్రజాపద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా ఎన్నికయ్యారు. మరోవైపు ఈ ఏడాది పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని చోట్ల గెలవడం ద్వారా ఎంఐఎం ఇతర రాష్ట్రాల్లోనూ పార్టీని విస్తరించుకుంది. తెలంగాణ జన సమితి, లెఫ్ట్ పార్టీలు తమ రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే ఈ ఏడాది పరిమితమయ్యాయి. ప్రజాసమస్యలపై తమదైన స్థాయిలో ఉద్యమాలు చేస్తూ పార్టీ కార్యకలాపాలను కొనసాగించాయి. అయితే ఈ ఏడాది టీటీడీపీ దాదాపు కనుమరుగు కావడం గమనార్హం.

---

**సాక్షి, హైదరాబాద్:** తీవ్ర ఆర్థిక మాంద్యం నేపథ్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధుల కొరత.. ఇంటర్ ఫలితాల్లో లోపాలపై తీవ్ర వివాదం... న్యాయ చిక్కులతో బెడిసికొట్టిన కొత్త సచివాలయం, శాసనసభ భవన సముదాయాల నిర్మాణం, ఆర్టీసీ కార్మికుల సుదీర్ఘ సమ్మె... దిశ హత్యాచారం, నలుగురు నిందితుల ఎన్‌కౌంటర్.. వెరసి ఈ ఏడాది తెలంగాణ రాష్ట్రం కొన్ని ఒడిదుడుకులకు, సంచలనాలకు వేదికైంది. అదే సమయంలో ప్రతిష్టాత్మక కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రారంభం కావడం ఏడాదంతా నిరీక్షించాల్సి వచ్చింది. రైతుబంధు ఆర్థిక సాయం, ఆసరా పెన్షన్ల పెంపు హామీలను అమల్లోకి తెచ్చినా సకాలంలో పంపిణీ చేయలేకపోయింది. గత ఖరీఫ్‌లో 45 లక్షల మంది రైతులకు రైతుబంధు కింద రూ. 5,460 కోట్లు చెల్లించగా 8 లక్షల మందికి రూ. 1,500 కోట్లను చెల్లించాల్సి ఉంది. ఇక రబీకి సంబంధించి చెల్లింపులు ఇంకా ప్రారంభం కాలేదు. నిధుల కొరత వల్ల కొత్తగా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టరాదని ప్రభుత్వం నిర్ణయం తీసుకో... విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం కలకలం రేపింది. ఈ విషయంలో ప్రభుత్వం సరిగ్గా స్పందించలేదనే విమర్శలను కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. ఫలితాలపై విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రతిపక్షాలు ఆందోళనలు నిర్వహించడం, ఈ వ్యవహారంపై జాతీయ మానవ హక్కుల సంఘం, సుప్రీం కోర్టు స్పందించడం ప్రభుత్వాన్ని మరింత ఇరకాటంలో పడేసింది.

**'కాళేశ్వరం' జాతికి అంకితం..**

రాష్ట్రంలోని 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని సీఎం కేసీఆర్ జూన్ 21న ప్రారంభించి జాతికి అంకితం చేశారు. వచ్చే ఏడాది ఖరీఫ్ నాటికి ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేసి ఆయకట్టుకు నీరు అందించేలా యుద్ధప్రాతిపదికన పనులు కొనసాగుతున్నాయి.

| అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రభావం | అటకెక్కిన కొత్త హామీలు | ఇంటర్ ఫలితాల్లో తప్పులు.. విద్యార్థుల బలవన్మరణాలు | రాష్ట్రాన్ని కుదిపిన ఆర్టీసీ సమ్మె | కాళేశ్వరం ప్రారంభోత్సవం తీపిగుర్తు |
|---|---|---|---|---|

# మాంద్యం మింగేసింది

## పడిపోయిన ప్రభుత్వ ఆదాయం



ప్రభుత్వ అతి పెద్ద విజయంగా, తీపి గుర్తుగా మిగిలింది. 2019 సంవత్సరం మరో మూడు రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో ఈ ఏడాది రాష్ట్రంలో చోటుచేసుకున్న కీలక పరిణామాలు, రాష్ట్రానికి ఎదురైన క్లిష్ట పరిస్థితులపై కథనం.

**ఆర్థిక మాంద్యం దెబ్బ**

ఆర్థిక మాంద్యం ప్రభావం రాష్ట్రంలోని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పడింది. ఫిబ్రవరిలో రూ. 1,82,087 కోట్ల భారీ అంచనాలతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. ఆర్థిక మాంద్యం దెబ్బకు పూర్తిస్థాయి బడ్జెట్‌ను సెప్టెంబర్‌లో రూ. 1,46,492.30 కోట్లకు తగ్గించుకుంది. అయినా ఇప్పటికే అమల్లో ఉన్న రైతుబంధు వంటి ప్రతిష్టాత్మక పథకాలకు తీవ్ర నిధుల కొరత ఏర్పడింది. పెద్ద మొత్తంలో కాంట్రాక్టర్ల బిల్లులు పేరుకుపోయాయి. గత శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన కొత్త హామీల అమలు కూడా ఆర్థిక మాంద్యం వల్ల ప్రశ్నార్థకమైంది. రైతులకు రూ. లక్షలోపు రుణ మాఫీ, నిరుద్యోగ భృతి, ఉద్యోగులకు పీఆర్సీ, ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు వంటి హామీల అమలు కోసం రాష్ట్ర ప్రజలు ...వాల్సి వచ్చింది. సవరించిన అంచనాల్లో రూ. 10 వేల కోట్లను భూముల అమ్మకం ద్వారా సమీకరించుకోవాలని నిర్ణయించినా కోకాపేట భూముల అమ్మకంపై హైకోర్టు స్టే విధించడంతో అది నెరవేరట్లేదు.

**ఇంటర్ ఫలితాల్లో 'ఫెయిల్'**

ఇంటర్మీడియెట్ ఫలితాల ప్రకటనలో దొర్లిన తప్పులు ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లోకి నెట్టాయి. రిజల్ట్స్ ప్రాసెసింగ్ కాంట్రాక్టు దక్కించుకున్న గ్లోబరీనా సంస్థ చేసిన తప్పిదాల కారణంగా పాసైన విద్యార్థులు సైతం ఫెయిలైనట్లు ఫలితాలొచ్చాయి. దీంతో తీవ్ర మానసిక వేదనకు 27 మంది

**52 రోజుల పాటు..**

అక్టోబర్ 5 నుంచి 52 రోజులపాటు సాగిన ఆర్టీసీ సమ్మె యావత్ రాష్ట్రాన్ని కుదిపేసింది. సమ్మె విరమణకు కార్మిక సంఘాల జేఏసీ, డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నిరాకరించడంతో 50 వేల మంది కార్మికులు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు. ఐదుగురు కార్మికుల బలవన్మరణాలతో కలిసి మొత్తం 38 మంది కార్మికులు సమ్మె కాలంలో మరణించారు. చివరకు కార్మిక జేఏసీ సమ్మె విరమించడం, కార్మికులను ప్రభుత్వం బేషరతుగా విధుల్లో చేర్చుకోవడంతో ఈ వివాదం సద్దుమణిగింది. సమ్మె విరమించిన కార్మికులపై సీఎం కేసీఆర్ హామీల వర్షం కురిపించడం ఊరట కలిగించింది. ఆర్టీసీ పరిరక్షణ కోసం కిలో మీటర్‌కు 20 పైసల చొప్పున చార్జీల పెంపును ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది.

**సచివాలయం లేని రాష్ట్రం**

కొత్త సచివాలయం, అసెంబ్లీ భవన సముదాయాల నిర్మాణం కోసం ప్రభుత్వం చారిత్రక ఎర్రమంజిల్ భవనాన్ని కూల్చేసి అక్కడే రూ. 400 కోట్లతో కొత్త అసెంబ్లీ భవనాన్ని నిర్మించాలని తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చింది. ప్రస్తుత సచివాలయ భవనాలను కూల్చి రూ. 100 కోట్లతో కొత్త సచివాలయ భవన సముదాయాన్ని నిర్మించాలని తీసుకున్న నిర్ణయంపై స్టే విధించింది. ప్రభుత్వం హుటాహుటిన సచివాలయ భవనాలను ఖాళీ చేయించడంతో పాలనపరంగా కొత్త సమస్యలు పుట్టుకొచ్చాయి. సచివాలయ శాఖల్లో కొన్నింటిని సమీపంలోని బీఆర్‌కేఆర్ భవన్‌కు తరలించగా మిగిలిన శాఖలను వేర్వేరు చోట్లలో ఉన్న ప్రభుత్వ భవనాలకు చేర్చారు. చెట్టుకొకరు పుట్టకొకరు అన్న చందంగా సచివాలయ శాఖల పరిస్థితి తయారైంది.

---

# ఆడ బిడ్డల ఆర్తనాదాలు

**చిన్నారులు, మహిళలపై అఘాయిత్యాలు**

- దిశ, సమత, వరంగల్, హాజీపూర్ ఉదంతాలతో తీవ్ర సంచలనం
- నిందితులపై పెల్లుబికిన ప్రజాగ్రహం
- కీచకులను అప్పజెప్పాలని వరంగల్, షాద్‌నగర్‌లలో ఆందోళనలు
- మూడు ఎన్‌కౌంటర్లు, రెండు సిట్లతో కలకలం



**సాక్షి, హైదరాబాద్:** నేరం..ఈ ఏడాది రాష్ట్రంపై పడగ విప్పింది. ప్రశాంత జీవనాన్ని తన ఉనికితో ఉలికిపాటుకి గురిచేస్తూ మానవత్వాన్ని మృగ్యం చేసింది. మానవ సంబంధాల విలువల్ని తుంచుతూ వికృత చేష్టలతో మనిషంటే ఓ భరోసా అన్న నమ్మకాన్ని సడలించింది. అవినీతి కేసులు, వివాహేతర సంబంధాలు, కిడ్నాప్‌లు, అత్యాచారాలు, ఎన్‌కౌంటర్లు, హత్యలతో అన్ని రకాల నేరాలకూ రాష్ట్రం ఆలవాలమైంది. రాజధానిలో చోటుచేసుకున్న కొన్ని నేరాలు దేశం దృష్టిని ఆకర్షించాయి. వరుసగా వెలుగుచూసిన అత్యాచారాలు, హత్యలతో ఒక దశలో మహిళలు, చిన్నారుల రక్షణ సందేహంలో పడింది. ముఖ్యంగా 'దిశ'కేసులో నిందితులు ఆమెను చంపిన తీరు..దేశవ్యాప్త ఉద్యమానికి దారి తీసింది. అదేరోజు వరంగల్‌లో మానస, అదేవారంలో ఆసిఫాబాద్‌లో 'సమత' అత్యాచారం అనంతరం దారుణహత్యలకు గురయ్యారు. జూన్‌లో వరంగల్‌లో 9 నెలల చిన్నారిపై లైంగిక దాడి హత్య తో ప్రజలు కోపంతో రగిలిపోయారు. మరోవైపు యాదాద్రి జిల్లా బొమ్మలరామారం మండలం హాజీపూర్‌లో శ్రీనివాసరెడ్డి.. ముగ్గురు మైనర్లపై అత్యాచారం జరిపి, తన వ్యవసాయ బావిలో పూడ్చిన ఘటన కలకలం రేపింది. ఈ ఏడాది జరిగిన నేరాలన్నింటినీ సింహావలోకనం చేసుకుంటే...

- కోస్టల్‌బ్యాంక్ డైరెక్టర్, ఎన్‌ఆర్‌ఐ, ప్రముఖ వ్యాపార వేత్త చిగురుపాటి జయరాం (55) జనవరి 31న హత్యకు గురయ్యారు. తెలంగాణలో హత్యచేసి మృతదేహాన్ని ఆంధ్రప్రదేశ్‌లో వదిలివేశారు. తెలంగాణకు కేసు బదిలీఅయ్యాక ప్రధాన నిందితుడు రాకేశ్ రెడ్డి, అతని అనుచరులను అరెస్టు చేశారు. సహకరించిన ఇద్దరు పోలీసులపై వేటుపడింది.
- డేటా చౌర్యం కేసులో మాదాపూర్‌లోని ఐటీ గ్రిడ్ కార్యాలయాన్ని మార్చి 8న పోలీస్‌లు సీజ్ చేశారు. ఈ కేసు తెలంగాణ, ఏపీలో సంచలనం సృష్టించింది. రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయ పార్టీలతో ముడిపడి ఉన్న కేసు దర్యాప్తునకు ప్రభుత్వం ఐజీ స్టీఫెన్ రవీంద్ర నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేసింది. దర్యాప్తు కొనసాగుతోంది.
- యాదాద్రి జిల్లా బొమ్మల రామారం మండలం హాజీపూర్‌లో సైకో శ్రీనివాస్ రెడ్డి ముగ్గురు బాలికలను అపహరించి అత్యాచారం చేసిన విషయం ఏప్రిల్ 26న వెలుగుచూసింది. ఊరికి రవాణా సదుపాయం లేకపోవడంతో లిఫ్ట్ ఇస్తానని చెప్పి, బాలికలను తన వ్యవసాయ బావి వద్దకు తీసుకెళ్లి అత్యాచారం, హత్య చేసి అక్కడే మృతదేహాల్ని పాతిపెట్టాడు.
- టీవీ9 యాజమాన్య బదిలీ విషయంలో పలు అడ్డంకులు సృష్టించిన కేసులో ఆ సంస్థ మాజీ సీఈఓ రవిప్రకాశ్‌పై మే 9న పోలీసులు కేసులు నమోదు చేశారు. టీవీ9 చానల్‌ను ఏబీసీఎల్ నుంచి అలందా మీడియాకు బదిలీ కాకుండా నటుడు శివాజీతో పలు నకిలీ పత్రాలు సృష్టించారని రవిప్రకాశ్, శివాజీలపై కేసు నమోదైంది. ఈ కేసులో నిందితులిద్దరూ పోలీసులకు చిక్కకుండా పరారవడం, అపుడప్పుడూ వీడియోలు విడుదల చేయడం సంచలనం రేపింది.
- హన్మకొండ కుమార్‌పల్లిలో తల్లిపక్కనే నిద్రపోతున్న 9 నెలల పసిపాపను ప్రవీణ్ అనే యువకుడు జూన్ 30న ఎత్తుకెళ్లి అత్యాచారం చేసి, చంపేశాడు. పోలీసులు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో 48 రోజుల్లో నిందితుడి నేరం నిరూపించారు. అతనికి కోర్టు ఉరిశిక్ష విధించింది. ఆపై దాన్ని హైకోర్టు జీవితఖైదుగా మార్చింది.
- కుమరంభీం జిల్లా సార్సాల అటవీ అధికారిణి అనితపై కోనేరు కోనప్ప సోదరుడు, జెడ్పీటీసీ సభ్యుడు కోనేరు కృష్ణారావు తన అనుచరులతో జూన్ 30న దాడి చేశారు.
- పోలీసు ఇన్‌ఫార్మర్ నెపంతో టీఆర్ ఎస్ ఎంపీటీసీ నల్లూరి శ్రీనివాసరావును మావోయిస్టులు జూలై9న అపహరించి కాల్చిచంపారు. కొత్తగూడెం జిల్లా చర్ల మండలం బెస్తకొత్తూరులో ఈ ఘటన చోటు చేసుకుంది.
- జూలై 10న ఏసీబీ దాడుల్లో కేశంపేట తహసీల్దార్ వి.లావణ్య వద్ద ఏకంగా రూ.93 లక్షల నగదు 40 తులాల బంగారం లభించింది.
- ఎంసెట్ పేపర్ లీకేజీలో సీఐడీ పోలీసులు జూలై 16న చార్జిషీటు దాఖలు చేశారు.
- భద్రాద్రి జిల్లా గుండాలలో జూలై 31న ఎన్‌కౌంటర్‌లో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి లింగన్న మరణించాడు.
- ఏపీ మాజీ స్పీకర్ కోడెల ఆత్మహత్య, కుటుంబ సమస్యల కారణంగా కోడెల హైదరాబాద్‌లోని సొంతింట్లో ఆగస్టు 16వ తేదీన ఉరేసుకుని మరణించారు.
- ఈఎస్‌ఐలోని ఐఎంఎస్ కుంభకోణంలో 700 కోట్ల మేరకు అవతవకలు ఆరోపణల నేపథ్యంలో ఆగస్టు 29న మాజీ డైరెక్టర్ దేవికారాణి, మాజీ జేడీ పద్మలను ఏసీబీ అరెస్టు చేసింది. ఇప్పటిదాకా 21 మంది అరెస్టయ్యారు.
- హయత్‌నగర్‌లో..ప్రియుడు శశికుమార్ బ్లాక్ మెయిలింగ్‌కు తలొగ్గిన కీర్తి అనే యువతి అక్టోబరు 28న తల్లి రజితను చంపి, శవాన్ని మాయం చేసిన ఘటన వెలుగుచూసింది.
- అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్ విజయారెడ్డిని భూవివాదంలో కూర సురేశ్ నవంబరు 4న పెట్రోల్ పోసి నిప్పంటించాడు. విజయారెడ్డి అక్కడికక్కడే మరణించగా, నిందితుడు సురేశ్, డ్రైవర్ గురునాథం, అటెండర్ చంద్రయ్య తరువాత మరణించారు.
- కాచిగూడలో హంద్రీనీవా– ఎంఎంటీఎస్ రైళ్లు కాచిగూడలో నవంబరు 11న ఎదురెదురుగా ఢీకొన్నాయి. 8 మంది గాయపడ్డారు. లోకోపైలెట్ చంద్రశేఖర్ చికిత్స పొందుతూ మరణించాడు.
- ఆసిఫాబాద్ జిల్లాలో సమతపై ముగ్గురు టేకు చెక్కల స్మగ్లర్లు నవంబరు 24న లైంగికదాడి చేసి, కత్తితో గొంతుకోసి చంపారు. దీనిపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటైంది.
- రాష్ట్రంలో ఒకేరోజు వెటర్నరీ వైద్యురాలు దిశ, వరంగల్‌లో డిగ్రీ విద్యార్థిని మానసలు నవంబరు 27 అపహరణకు గురై అత్యాచారం అనంతరం హత్యకు గురయ్యారు.
- దిశ కేసులో నిందితులు నలుగురు ఎన్‌కౌంటర్‌లో మరణించారు. డిసెంబరు 6న చటాన్‌పల్లి బ్రిడ్జి వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో నిందితులు మహమ్మద్ ఆరిఫ్, జొల్లు శివ, జొల్లు నవీన్, చింతకుంట చెన్నకేశవులు పోలీసులపై దాడి చేసి, తుపాకులు లాక్కున్నారు. పోలీసుల ఎదురుకాల్పుల్లో నలుగురు హతమయ్యారు. దీనిపై సిట్ విచారణ నడుస్తోంది.

సాక్షి స్పోర్ట్స్
ఆదివారం
29-12-2019

## బీఎఫ్ఐ పారదర్శకంగా వ్యవహరించింది: అధ్యక్షుడు అజయ్ సింగ్

ఒలింపిక్ క్వాలిఫయర్స్ కోసం భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) మేరీకోమ్, నిఖత్ జరీన్‌ల మధ్య ట్రయల్స్ బౌట్‌ను పారదర్శకంగా నిర్వహించిందని బీఎఫ్ఐ అధ్యక్షుడు అజయ్ సింగ్ అన్నారు. 'నిఖత్ మద్దతుదారులు పెద్ద ఎత్తున నినదించారు. ఈ ఉత్సాహం మంచిదే, ఆటకు మేలే చేస్తుంది. ఇప్పుడు భారత్‌లో ప్రతిభగల బాక్సర్లు చాలా మంది ఉన్నారు. బాక్సింగ్ దళం బలంగా తయారవుతోంది' అని అన్నారు. బౌట్ ముగిశాక తుది ఫలితంపై స్టేడియంలోనే ఉన్న 'శాట్స్' చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి కుర్చీని పైకెత్తి బిగ్గరగా అరిచారు. దాంతో ఆయన వద్దకు అజయ్ సింగ్ వెళ్లి వారించారు. సంయమనం పాటించాలని, లేదంటే బయటికి వెళ్లిపోవాలని సూచించారు.



# విశ్వవిజేత కోనేరు హంపి



ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచిన ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్

**మాస్కో:** భారత నంబర్‌వన్ మహిళా చెస్ క్రీడాకారిణి, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ (జీఎం) కోనేరు హంపి తన కెరీర్‌లోనే అతి గొప్ప విజయం సాధించింది. శనివారం ముగిసిన ప్రతిష్టాత్మక ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో హంపి మహిళల విభాగంలో విశ్వవిజేతగా అవతరించింది. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారతీయ చెస్ క్రీడాకారిణిగా కొత్త చరిత్ర సృష్టించింది. నిర్ణీత 12 రౌండ్ల తర్వాత కోనేరు హంపి, లీ టింగ్‌జి (చైనా), అతాలిక్ ఎకతెరీనా (టర్కీ) 9 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంక్‌ను వర్గీకరించగా హంపి, లీ టింగ్‌జి తొలి రెండు స్థానాల్లో... అతాలిక్ మూడో స్థానంలో నిలిచారు. దాంతో అతాలిక్‌కు కాంస్యం ఖాయమైంది. హంపి, లీ టింగ్‌జి మధ్య ప్రపంచ చాంపియన్ ఎవరో నిర్ణయించేందుకు ముందుగా రెండు బ్లిట్జ్ గేమ్‌లు నిర్వహించారు. తొలి బ్లిట్జ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన హంపి 29 ఎత్తుల్లో ఓడిపోగా... రెండో బ్లిట్జ్ గేమ్‌లో నల్లపావులతో ఆడిన హంపి 45 ఎత్తుల్లో గెలిచింది. దాంతో టైబ్రేక్‌లోనూ ఇద్దరు 1–1తో సమం కావడంతో విజేతను నిర్ణయించేందుకు చివరగా 'అర్మగెడాన్ గేమ్'ను నిర్వహించారు. 'అర్మగెడాన్' నిబంధన ప్రకారం గేమ్‌లో తెల్లపావులతో ఆడిన వారు తప్పనిసరిగా గెలవాలి. ఒకవేళ 'డ్రా' అయితే మాత్రం నల్లపావులతో ఆడిన వారిని విజేతగా ప్రకటిస్తారు. ఈ అర్మగెడాన్ గేమ్‌లో హంపి 66 ఎత్తుల్లో గేమ్‌ను 'డ్రా' చేసుకోవడంతో ఆమె ప్రపంచ చాంపియన్‌గా ఆవిర్భవించింది. లీ టింగ్‌జి రన్నరప్‌గా నిలిచి రజత పతకంతో సరిపెట్టుకుంది.

**2** ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ చరిత్రలో హంపి గెలిచిన పతకాల సంఖ్య. 2012లో హంపి కాంస్య పతకం సాధించింది.

**2** భారత్ తరఫున ర్యాపిడ్ విభాగంలో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన రెండో ప్లేయర్ హంపి. 2017లో విశ్వనాథన్ ఆనంద్ ఓపెన్ విభాగంలో విశ్వవిజేతగా నిలిచాడు.

అంతకుముందు నిర్ణీత 12 రౌండ్లలో హంపి ఏడు గేముల్లో గెలిచింది. హంపి... మార్గరిటా పొటపోవా, నినో ఖోమెరికో, కొవలెవ్‌స్కాయ, ఓల్గా గిరియా, నానా జాగ్‌నిడ్జే, దరియా వోయిట్, తాన్ జోంగిలపై గెలిచింది. దరియా చరోచిక్నా, అనా ముజిచుక్, అతాలిక్ ఎకతెరీనా, కాటరీనా లాగ్నోలతో గేమ్‌లను 'డ్రా' చేసుకుంది. ఇరీనా బుల్‌మగా చేతిలో ఓడిపోయింది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక 8 పాయింట్లతో 13వ స్థానంలో నిలిచింది. మరోవైపు ఓపెన్ విభాగంలో మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) విశ్వవిజేతగా నిలిచాడు.





# మేరీనే క్వాలిఫయర్స్‌కు...

**ఫైనల్లో 9-1తో నిఖత్‌పై విజయం • తెలంగాణ బాక్సర్ పట్ల దురుసుగా ప్రవర్తించిన ప్రపంచ మాజీ చాంపియన్**

*ఆమె ఒక దిగ్గజ బాక్సర్. ఒకట్రెండు సార్లు కాదు ఏకంగా ఆరుసార్లు ప్రపంచ చాంపియన్‌గా... ఐదుసార్లు ఆసియా చాంపియన్‌గా నిలిచింది. అంతేనా... భారత్‌లోనే కాకుండా అంతర్జాతీయ మహిళల బాక్సింగ్‌కు మణిపూస లాంటిది. రాష్ట్రపతి స్వయంగా ఎగువసభకు నామినేట్ చేసిన ఎంపీ కూడా! అంతటి మేటి బాక్సర్ ఏకపక్ష విజయం సాధించడం వరకు బాగానే ఉన్నా... అనుభవరీత్యా తనకంటే ఎంతో జూనియర్ అయిన ప్రత్యర్థితో తలపడుతున్నపుడు... విజయానంతరం ఆమె వ్యవహరించిన తీరు క్రీడాలోకాన్ని విస్మయపరిచింది. ఇంతకాలం తన పంచ్‌లతో ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన ఆ మేటి బాక్సర్ మేరీకోమ్ కాగా... ఈ మణిపూర్ బాక్సర్‌కు సవాల్ విసిరిన క్రీడాకారిణి తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్. కొన్ని నెలలుగా ఎంతో ఉత్కంఠ రేపిన మహిళల బాక్సింగ్ ట్రయల్స్ శనివారంతో ముగియగా... భారత్ నుంచి టోక్యో ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీకి వెళ్లే ఐదుగురు బాక్సర్లు కూడా ఖరారయ్యారు.*

**న్యూఢిల్లీ:** భారత దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ టోక్యో ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీకి అర్హత పొందింది. మహిళల 51 కేజీల ట్రయల్ ఫైనల్ బౌట్‌లో ఆమె 9–1 పాయింట్ల తేడాతో తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్‌ను ఓడించింది. దీంతో ఈ కేటగిరీలో ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో మేరీ పోటీపడనుంది. మిగతా ట్రయల్స్ పోటీల్లో 57 కేజీల్లో రెండుసార్లు ప్రపంచ రజత పతక విజేత అయిన సోనియా లాథర్‌కు చుక్కెదురైంది. సాక్షి చౌదరి ధాటికి ఆమె ఓడిపోయింది. 60 కేజీల విభాగంలో మాజీ ప్రపంచ చాంపియన్ సరితా దేవి కూడా జాతీయ చాంపియన్ సిమ్రన్‌జీత్ కౌర్ చేతిలో కంగుతింది. 69 కేజీల విభాగంలో లలితాపై లవ్లీనా బొర్గొహైన్... 75 కేజీల విభాగంలో నుపుర్‌పై పూజా రాణి గెలిచి క్వాలిఫయర్స్‌కు అర్హత సంపాదించారు. ఆసియా ఓసియానియా ఒలింపిక్ క్వాలిఫయర్స్ పోటీలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 3 నుంచి 14 వరకు చైనాలో జరుగుతాయి. ఇందులో రాణించిన బాక్సర్లు టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సంపాదిస్తారు.

### హోరాహోరీ అనుకున్నా...

తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్ ఇటీవల అంతర్జాతీయ పోటీల్లో నిలకడగా రాణిస్తోంది. తనకూ ఒలింపిక్స్ క్వాలిఫయర్స్ అవకాశమివ్వాలంటూ పట్టుపట్టి మరీ ట్రయల్స్ పెట్టాలంది. ఒలింపిక్స్ అర్హతే లక్ష్యంగా పగలూ రాత్రి కష్టపడిన ఆమె... మేరీతో దీటుగా తలపడే అవకాశముందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) కూడా భావించింది. అందుకే ఆమె ప్రతిభకు వెన్నంటే నిలిచింది. నిఖత్‌కు మద్దతు తెలిపేందుకు 'శాట్స్' చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డితోపాటు తెలంగాణ బాక్సింగ్ సంఘం ప్రతినిధులు ఢిల్లీకి కూడా వెళ్లారు. అయితే తీరా పోటీదగ్గరకొచ్చేసరికీ ఏకపక్షమవుతుందని ఎవరూ ఊహించలేదు. 36 ఏళ్ల మణిపూర్ వెటరన్ దిగ్గజాన్ని ఢీకొట్టడం అంత సులువు కాదని బౌట్ మొదలైన కాసేపటికే తెలంగాణ అమ్మాయికి తెలిసొచ్చింది. స్పష్టమైన పంచ్‌లతో మేరీకోమ్ విజృంభిస్తుంటే నిఖత్ వద్ద సమాధానం లేకపోయింది. ఈ నిజామాబాద్ జిల్లా బాక్సర్ సంధించిన పంచ్‌లు బౌట్‌ను పర్యవేక్షించిన జడ్జిలను ఆకట్టుకోలేకపోయాయి. కేవలం ఒక్కరు మాత్రమే నిఖత్‌కు పాయింట్ ఇవ్వగా... మిగతా తొమ్మిది మంది మేరీకోమ్ పైచేయి సాధించిందని భావించారు. అయితే విజయగర్వంతో ప్రత్యర్థికి కనీస గౌరవం ఇవ్వకుండా మేరీకోమ్ రింగ్ నుంచి బయటికి రావడం పలు విమర్శలకు తావిచ్చింది. తనతో పోరాడిన ప్రపంచ జూనియర్ మాజీ చాంపియన్ బాక్సర్‌కు మేరీలాంటి దిగ్గజం కరచాలనం చేయకపోవడం దారుణమని క్రీడా వర్గాలు అభిప్రాయపడ్డాయి.

### అసలేమైంది... ఏమిటీ వివాదం

భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) అధ్యక్షుడు అజయ్ సింగ్ తీసుకున్న నిర్ణయం ట్రయల్స్ వివాదాన్ని రేపింది. రష్యాలో జరిగిన ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మేరీ కాంస్యం గెలిచింది. దీంతో ఆయన పతక విజేతలకు నేరుగా ఒలింపిక్స్ క్వాలిఫయర్ బెర్త్‌లని ప్రకటించారు. అంటే ట్రయల్స్‌లో పాల్గొనకుండా మేరీకి మినహాయింపు ఇవ్వడం ఏంటని ఆ కేటగిరీ (51 కేజీలు)లో ఉన్న తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ ప్రశ్నించింది. బీఎఫ్ఐ తీరుపై బాహాటంగానే అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ఏకంగా కేంద్ర క్రీడాశాఖకు లేఖ రాసింది. ట్రయల్స్ పోటీల ద్వారానే ఒలింపిక్స్ క్వాలిఫయర్స్ బెర్త్‌లు ఖరారు చేయాలని కోరింది. లండన్ ఒలింపిక్స్ చాంపియన్ షూటర్ అభినవ్ బింద్రాలాంటి ఆటగాళ్లు ఆమె ట్రయల్స్ కోరడాన్ని సమర్థించారు. దీనిపై స్పందించిన ఆ శాఖ ట్రయల్స్ నిర్వహించాలంటూ బీఎఫ్ఐను ఆదేశించింది. దీంతో నేరుగా చైనా (క్వాలిఫయర్స్) వెళ్లే అవకాశాన్ని పోటీదాకా తెచ్చిన నిఖత్ జరీన్‌పై మేరీ కోపం పెంచుకుంది. అందుకేనేమో బౌట్ ముగిశాక చేయి కలపలేదు. ప్రత్యర్థితో ఏ మాత్రం హుందాగా ప్రవర్తించకుండా తన మానాన తాను వెళ్లిపోయింది.

## నిఖత్ తీరు నాకు నచ్చలేదు...

*ఔను... పోరు ముగిశాక చేయి కలపలేదు. మరి ఆమె ఏం చేసిందో మీకు తెలియదా? బయటికి మాత్రం మేరీ నా అభిమాన, ఆరాధ్య బాక్సర్ అని... మార్గదర్శి అని చెప్పుకునే ఆమెకు ఎవరితో ఎలా ప్రవర్తించాలో తెలియదా? ఇతరుల నుంచి గౌరవ మర్యాదలు పొందాలనుకుంటున్న నిఖత్‌కు ఎదుటి వారికి కూడా కనీస గౌరవం ఇవ్వాలన్న ఇంగితం లేదా? నన్ను నేరుగా క్వాలిఫయర్స్‌కు పంపాలని భారత బాక్సింగ్ సమాఖ్య నిర్ణయం తీసుకుంది. నన్నే పంపించాలని నేనేమీ వారిని కోరలేదు. ఈ అంశంపై ఏదైనా ఉంటే బాక్సింగ్ రింగ్‌లో తేల్చుకోవాలి. కానీ ఆమె ఏం చేసింది... మీడియాలో రచ్చ రచ్చ చేసింది. కేంద్ర క్రీడల మంత్రికి లేఖ రాసి నానాయాగీ చేసింది. ఆటగాళ్లు రింగ్‌లో తలపడాలి. బయట కాదు..! అలాంటి ప్రత్యర్థి తీరు నాకు నచ్చలేదు. అందుకే షేక్‌హ్యాండ్ ఇవ్వలేదు.*

–మేరీకోమ్



## నేను హత్తుకోవాలనుకున్నా...

*'నా శక్తిమేర రాణించాను. ఈ ప్రదర్శన పట్ల సంతోషంగానే ఉన్నా. కానీ బౌట్ ముగిశాక మేరీకోమ్ ప్రవర్తన ఏమాత్రం బాగోలేదు. ఓ సీనియర్ బాక్సింగ్ దిగ్గజం నా ప్రదర్శనకు మెచ్చి హత్తుకుంటుందనుకుంటే కనీసం చేయి కూడా కలపలేదు. ఇది నన్ను తీవ్రంగా బాధించినా... దీనిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయబోను. ఈ ఒక్క ట్రయల్‌తో నా 'టోక్యో' దారి మూసుకుపోలేదు. ఆమె ఒక వేళ ఫిబ్రవరిలో జరిగే ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో విఫలమైతే... ప్రపంచ క్వాలిఫయర్స్ కోసం మే నెలలో జరిగే ట్రయల్స్ ద్వారా మరో అవకాశముంటుంది. అప్పుడు మరింత శ్రమించి బరిలోకి దిగుతాను.'*

–నిఖత్ జరీన్

## వెయిట్‌లిఫ్టర్ సీమాపై నాలుగేళ్ల నిషేధం



**న్యూఢిల్లీ:** డోపింగ్‌లో పట్టుబడిన భారత వెయిట్‌లిఫ్టర్ సీమాపై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) నాలుగేళ్ల నిషేధం విధించింది. 2017 కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో 75 కేజీల విభాగంలో రజత పతకం గెలిచిన సీమా, 2018 గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్‌లో ఆరో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది విశాఖపట్నంలో జరిగిన జాతీయ మహిళల వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ సందర్భంగా ఆమె నుంచి 'నాడా' అధికారులు శాంపిల్స్ సేకరించారు. వాటిని పరీక్ష చేయగా అందులో అంతర్జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) నిషేధించిన ఉత్ప్రేరకాలు ఉన్నట్లు తేలింది. దీంతో 'నాడా'కు చెందిన డోపింగ్ నిరోధక క్రమశిక్షణా ప్యానెల్ ఆమెపై వేటు వేసింది.

# యశస్వి ఆల్‌రౌండ్ ప్రదర్శన

- రెండో వన్డేలోనూ దక్షిణాఫ్రికా అండర్–19 జట్టుపై యువ భారత్ గెలుపు
- 2–0తో సిరీస్ కైవసం

**ఈస్ట్ లండన్ (దక్షిణాఫ్రికా):** దక్షిణాఫ్రికా అండర్–19 జట్టుతో జరిగిన రెండో అనధికారిక వన్డేలో భారత అండర్–19 జట్టు సభ్యుడు యశస్వి జైస్వాల్ ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టాడు. తొలుత బౌలింగ్ (4/13)లో విజృంభించిన యశస్వి... అనంతరం ఓపెనర్‌గా (56 బంతుల్లో 89 నాటౌట్; 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగాడు. ఫలితంగా శనివారం జరిగిన రెండో అనధికారిక వన్డేలో భారత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఫలితంగా అనధికారిక 3 వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2–0తో కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 29.5 ఓవర్లలో 119 పరుగులకు ఆలౌటైంది. ఆతిథ్య జట్టు తరఫున జొనాథన్ బర్డ్ చేసిన 25 పరుగులే టాప్ స్కోర్ కావడం గమనార్హం. యశస్వికి ఆకాశ్ సింగ్ (2/37), అథర్వ అన్కోలేకర్ (2/16), రవి బిష్ణోయ్ (2/20) చక్కటి సహకారం అందించారు. అనంతరం ఛేదన మొదలు పెట్టిన భారత్ 16.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసి విజయం సాధించింది. ఆరంభంలోనే సారథి ప్రియమ్ గార్గ్ (0), రావత్ (2) వికెట్లను కోల్పోయినా... ఓపెనర్ జైస్వాల్ టి20 తరహాలో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతనికి ధ్రువ్ జురెల్ (26 బంతుల్లో 26 నాటౌట్; 3 ఫోర్లు, సిక్స్) తోడవటంతో భారత విజయం ఖాయమైంది. బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించిన యశస్వికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. చివరి వన్డే ఈ నెల 30న జరుగుతుంది.





యశస్వి

# ఇంగ్లండ్ లక్ష్యం 376

**ప్రస్తుతం 120/1**

**సెంచూరియన్:** దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌ల మధ్య జరుగుతున్న తొలి టెస్టు రసకందాయంలో పడింది. 376 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ మొదలు పెట్టిన ఇంగ్లండ్ శనివారం ఆట ముగిసే సమయానికి 41 ఓవర్లలో వికెట్ నష్టపోయి 121 పరుగులు చేసింది. ఇంగ్లండ్ విజయానికి మరో 255 పరుగులు కావాలి. ఇటు దక్షిణాఫ్రికా విజయం సాధించాలంటే మాత్రం మిగిలిన 9 వికెట్లను కూల్చాల్సిన పరిస్థితి. ఇంకో రెండు రోజుల ఆట మిగిలి ఉంది. ప్రస్తుతం బర్న్స్ (77 బ్యాటింగ్; 11 ఫోర్లు), డెన్లీ (10 బ్యాటింగ్, ఫోర్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు 72/4తో మూడో రోజు ఆటను కొనసాగించిన దక్షిణాఫ్రికా 61.4 ఓవర్లలో 272 పరుగులకు ఆలౌటైంది. డస్సెన్ (51; 5 ఫోర్లు), ఫిలాండర్ (46; 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. జోఫ్రా ఆర్చర్ (5/102)తో ఆకట్టుకున్నాడు.



బర్న్స్

# హైదరాబాద్ హ్యాట్రిక్ ఓటమి

**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీ తాజా సీజన్‌లో హైదరాబాద్ క్రికెట్ జట్టు ఢిల్లీతో శనివారం ముగిసిన మూడో రౌండ్ మ్యాచ్‌లో ఏడు వికెట్ల తేడాతో ఓడిపోయింది. దీంతో ఈ సీజన్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిన హైదరాబాద్ పరాజయాల హ్యాట్రిక్‌ను పూర్తి చేసింది. హైదరాబాద్ నిర్దేశించిన 84 పరుగుల విజయ లక్ష్యాన్ని ఢిల్లీ 27.5 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి ఛేదించింది. ఓవర్‌నైట్ స్కోరు 24/0తో చివరి రోజు ఆట కొనసాగించిన ఢిల్లీని హైదరాబాద్ బౌలర్లు సిరాజ్, రవి కిరణ్‌లు ఆరంభంలో ఇబ్బంది పెట్టారు. మొదట కునాల్ (6)ను సిరాజ్ అవుట్ చేయగా... తర్వాత ధావన్ (21; 2 ఫోర్లు), నితీశ్ రాణా (6; ఫోర్)లను రవి కిరణ్ పెవిలియన్‌కు చేర్చాడు. అయితే లక్ష్యం మరీ చిన్నది కావడంతో ధ్రువ్ షోరే (32 నాటౌట్; 6 ఫోర్లు), జాంటీ సిద్ధూ (7 నాటౌట్; ఫోర్) జట్టును విజయ తీరాలకు చేర్చారు.

**ఆంధ్ర, బెంగాల్ మ్యాచ్ 'డ్రా'**

కోల్‌కతాలో జరిగిన ఆంధ్ర, బెంగాల్ రంజీ మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందిన బెంగాల్‌కు మూడు పాయింట్లు, ఆంధ్రకు ఒక పాయింట్ లభించాయి.

# పట్టుబిగించిన ఆసీస్

- ప్రస్తుతం 456 పరుగుల ఆధిక్యంలో ఆతిథ్య జట్టు
- కమిన్స్ ధాటికి కివీస్ 148 ఆలౌట్

**మెల్‌బోర్న్:** న్యూజిలాండ్‌తో జరుగుతున్న 'బాక్సింగ్ డే' టెస్టులో ఆస్ట్రేలియా గెలుపు దిశగా పయనిస్తోంది. శనివారం ఆట ముగిసే సమయానికి ఆసీస్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 45 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 137 పరుగులు చేసింది. 456 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. వేడ్ (15 బ్యాటింగ్), హెడ్ (12 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 44/2తో మూడో రోజు ఇన్నింగ్స్‌ను కొనసాగించిన న్యూజిలాండ్‌ను ప్యాట్ కమిన్స్ (5/28) దెబ్బ తీశాడు. దాంతో కివీస్ 54.5 ఓవర్లలో 148 పరుగులకు ఆలౌటైంది. 319 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందిన ఆస్ట్రేలియా ప్రత్యర్థి జట్టును ఫాలోఆన్ ఆడించకుండా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించాలని నిశ్చయించుకుంది.





కమిన్స్



శనివారం ఢిల్లీలోని రాజ్‌పథ్ రోడ్డులో దట్టంగా అలుముకున్న పొగమంచులో సైకిల్‌పై వెళ్తున్న ఓ మహిళ. దేశ రాజధానిలో కనిష్ట ఉష్ణోగ్రతలు 1.7 డిగ్రీలకు పడిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# అంగన్‌వాడీలపై నిఘా!

- ఆకస్మిక తనిఖీలు.. కేంద్రాల పనితీరుకు మార్కులు
- జిల్లా కలెక్టర్లకు తనిఖీ బాధ్యతలు

**సాక్షి, హైదరాబాద్:** క్షేత్రస్థాయి నుంచి వస్తున్న ఫిర్యాదులు, ఆరోపణలకు అడ్డుకట్ట వేస్తూ, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం నిఘా పెంచుతోంది. మరింత సమర్థవంతంగా వీటిని నడిపేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు గ్రేడ్లు వేయాలని భావిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలోని 149 సమగ్ర శిశు అభివృద్ధి ప్రాజెక్టుల్లో (ఐసీడీఎస్) 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి ద్వారా దాదాపు 5లక్షల మంది గర్భిణులు, బాలింతలు, 16లక్షల మంది చిన్నారులకు వివిధ పథకాల కింద పౌష్టికాహార పంపిణీతో పాటు వైద్య, ఆరోగ్య సలహాలిస్తున్నారు. అయితే చాలాచోట్ల అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందనే ఫిర్యాదులున్నాయి. సమయ పాలన పాటించకపోవడం, సంక్షేమ పథకాల పంపిణీ సక్రమంగా లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈక్రమంలో వీటికి చెక్‌పెట్టేలా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు.

**తనిఖీ బాధ్యతలు కలెక్టర్లకు..**

అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని భావిస్తున్న ప్రభుత్వం, ఆయా బాధ్యతలను జిల్లా కలెక్టర్లకు అప్పగించాలని భావిస్తోంది. జిల్లా స్థాయిలో ప్రత్యేక తనిఖీ బృందం ఏర్పాటు చేసే అంశంపైన కూడా మంత్రి చర్చించినట్లు తెలిసింది. కలెక్టర్ ఆధ్వర్యంలో తనిఖీ బృందం వారంలో కనీసం మూడు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించేలా నిబంధనలు విధించాలనే నిర్ణయానికి వచ్చారు. తనిఖీల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశీలించాల్సిన అంశాలపైన ప్రత్యేక ఫార్మాట్‌ను రూపొందిస్తున్నారు. తనిఖీల అనంతరం దాదాపు 22 అంశాలతో కూడిన ప్రొఫార్మాను భర్తీ చేయాలి. కలెక్టర్ ఆధ్వర్యంలోని తనిఖీ బృందంతో పాటు ఇతర అధికారులు ఈ కేంద్రాలను ప్రత్యేకంగా తనిఖీ చేసి ప్రొఫార్మా ప్రకారం వివరాలను నమోదు చేయాలి. అనంతరం జిల్లా స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలకు మార్కులు వేస్తారు. ఆ తర్వాత జిల్లా స్థాయిలో మార్కులను పోల్చిచూసి, కేంద్రాలవారీగా గ్రేడ్‌లు వేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. తక్కువ గ్రేడ్ పాయింట్లు వచ్చే కేంద్రాల జాబితా రూపొందించి ఎలాంటి చర్యలు తీసుకోవాలనేదానిపై కలెక్టర్లు నిర్ణయం తీసుకుంటారు. వచ్చే నెలాఖరు నాటికి తనిఖీలకు సంబంధించి కార్యాచరణ సిద్ధమయ్యే అవకాశం ఉందని, ఫిబ్రవరి మొదటి వారం నుంచి తనిఖీలు చేసే అవకాశముంది.

## పబ్‌జీ గేమ్‌తో బాలికకు వల

**సాక్షి, హైదరాబాద్:** పబ్‌జీ గేమ్‌లో ఏర్పడిన పరిచయంతో మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించి వాట్సాప్ ద్వారా వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు తెప్పించుకొని వేధింపులకు గురిచేస్తున్న యువకుడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. నాంపల్లిలో మెకానిక్‌గా పనిచేస్తున్న టోలిచౌకీకి చెందిన సల్మాన్ (24)కు, పాతబస్తీకి చెందిన 14 ఏళ్ల విద్యార్థినితో ఆరు నెలల కింద పబ్‌జీ గేమ్ ద్వారా ఆన్‌లైన్‌లో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో వారు వాట్సాప్‌లో రోజూ చాటింగ్ చేసుకునేవారు. కొన్ని రోజులు గడిచాక ప్రేమిస్తున్నానంటూ నమ్మించాడు. ఇది నమ్మిన ఆ బాలిక అతడు అడిగినట్లు వ్యక్తిగత చిత్రాలు, వీడియోలను వాట్సాప్‌లో పంపింది. గత మూడు నెలలుగా ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తానని, మీ తల్లిదండ్రులకు పంపిస్తానంటూ బెదిరించడం మొదలుపెట్టాడు. తాను ఎక్కడికి పిలిస్తే అక్కడికి రావాలని, చెప్పినట్టు వినాలని, డబ్బులు ఇవ్వాలని వేధింపులకు గురిచేసేవాడు. వేధింపులు ఎక్కువ కావడంతో బాలిక తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని వివరించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని అరెస్టు చేశారు.

## నదుల్లో పగటి పూటే

# అధిక ఆక్సిజన్!



### సూర్యరశ్మికి, నదుల్లో ఆక్సిజన్‌కు లింక్

- నీటి మొక్కల కారణంగా ఆక్సిజన్ ఉత్పత్తి
- రాత్రి 8 గంటల నుంచి ఉదయం 4 గంటల వరకు నీటిలో తక్కువ ఆక్సిజన్
- కేంద్ర జల సంఘం అధ్యయనంలో వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** నదుల నీటిలో కరిగి ఉండే ఆక్సిజన్ (డీఓ) శాతం రాత్రివేళ కంటే పగటిపూటే అధికంగా ఉంటుందని కేంద్ర జల సంఘం తేల్చింది. నదిలో కరిగి ఉండే ఆక్సిజన్ స్థాయికి, సూర్యరశ్మికి దగ్గరి సంబంధం ఉందని వెల్లడించింది. ఈ కారణంగానే సూర్యరశ్మి పడే సమయంలో మొక్కల్లో కిరణజన్య సంయోగ క్రియ అధికంగా ఉండి నది నీటిలో ఆక్సిజన్ ఎక్కువగా ఉంటుందని తెలిపింది. గతంలో వివిధ సందర్భాల్లో, పుష్కరాలు జరిగే సీజన్లలో నది నీటిలో కరిగి ఉన్న ఆక్సిజన్ పరిమాణంపై అనేక అపోహలు, అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ దృష్ట్యా నదుల్లోని ఆక్సిజన్ పరిమాణం, దానికి సూర్యరశ్మికి గల సంబంధం, అది వివిధ సందర్భాల్లో ఎలా ఉంటుంది, జీవజాలం మనుగడకు అది ఎలా దోహదం చేస్తుంది? అన్న అంశాలపై కేంద్ర జల సంఘంతో నిపుణులతో శాస్త్రీయ అధ్యయనం చేయించింది. దేశవ్యాప్తంగా నర్మద, యమున, తుంగభద్ర, గంగ వంటి నదుల పరిధిలోని 19 నీటి నాణ్యతా కేంద్రాల వద్ద పరీక్షలు నిర్వహించి నీటి పరిమాణం, సూర్యరశ్మి మధ్య ఉన్న సంబంధాన్ని తేల్చింది.

**రాత్రి తగ్గుదల..**

నదుల్లో నీటి నాణ్యతను డీఓ నిర్ణయిస్తుంది. నీటిలో డీఓ పరిణామం లీటర్‌కు కనీసం 4 మిల్లీ గ్రాములు ఉండాలి. డీవో తగ్గేకొద్దీ బయలాజికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) పెరుగుతుంటుంది. బీవోడీ లీటర్‌కు 3 గ్రా. మించొద్దని నిబంధనలు ఉన్నా.. ప్రస్తుతం నదుల్లో బీవోడీ స్థాయి 4 నుంచి 9 గ్రాములు/లీ. వరకు ఉంది. నదిలో బీఓడీ పెరిగితే ఆ నీరు తాగేందుకు, స్నానాలకు కానీ పనికిరావు. అయితే ప్రస్తుతం కేంద్ర జల సంఘం చేసిన అధ్యయనంలో రాత్రి వేళలో నది నీటిలో డీఓ తక్కువగా ఉంటోంది. రాత్రివేళ సూర్యరశ్మి లేకపోవడంతో చెట్లలో కిరణజన్య సంయోగ క్రియ స్థాయి తగ్గుతుంది. దీంతో నది లోపల ఉండే మొక్కలు ఆక్సిజన్‌ను ఎక్కువగా తీసుకోవడంతో నీటిలో ఆక్సిజన్ స్థాయి తగ్గుతుంది. అదే పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు మొక్కలు కిరణజన్య సంయోగ క్రియ ద్వారా ఉప ఉత్పత్తిగా ఆక్సిజన్‌ను ఎక్కువగా విడుదల చేయడంతో అది నీటిలో ఎక్కువగా కరిగి ఉంటుందని అధ్యయనంలో తేల్చింది. రాత్రి 8 గంటల నుంచి ఉదయం 4 గంటల వరకు నదుల్లో డీఓ తగ్గుతుందని, అందుకే ఈ సమయంలో బ్యాక్టీరియా శాతం పెరుగుతుందని తెలిపింది. అయితే రాత్రివేళ తగ్గే డీఓతో నదుల్లోని జీవజాలానికి ప్రాణాంతకం అయ్యేదిగా మాత్రం ఉండదని తేల్చిచెప్పింది. డీఓకు సూర్యరశ్మితో అవినాభావ సంబంధం ఉంటుందని, ఈ ప్రభావం వల్ల డీఓలో హెచ్చుతగ్గులు 16.31 శాతం నుంచి 150.63 శాతం వరకు ఉంటాయని తెలిపింది. యమున, తుంగభద్ర నదుల్లో రాత్రి ఒంటిగంట నుంచి ఉదయం 7 గంటల వరకు డీఓ లీటర్‌కు 1.81 మిల్లీ గ్రాములు మాత్రమే ఉందని, అదే ఉదయం సమయాల్లో 4 మిల్లీగ్రాముల వరకు ఉందని అధ్యయనంలో గుర్తించింది. నదిలో నీటి పరిమాణాన్ని సూర్యరశ్మితో పాటే వాతావరణ పీడనం, వాతావరణ పరిస్థితులు, లవణీయత, నీటి మొక్కలు, ఇతర జీవజాలం ప్రభావితం చేస్తాయని గుర్తించారు. ఈ దృష్ట్యా సూర్యోదయం తర్వాతే నదీ స్నానం ఉత్తమమని కేంద్ర జల సంఘం అధ్యయనం తేల్చినట్లయిందని నిపుణులు పేర్కొంటున్నారు.

## జనవరి 17 నుంచి కానిస్టేబుళ్ల శిక్షణ

**సాక్షి, హైదరాబాద్:** వచ్చే జనవరి 17 నుంచి కానిస్టేబుళ్ల శిక్షణ ప్రారంభించాలని రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదేశించారు. 9నెలలపాటు జరగనున్న ఈ శిక్షణకు ఎంపికైన సివిల్, ఏఆర్, ఐటీ, పీటీవో డ్రైవర్–మెకానిక్ ట్రైనీలంతా జనవరి 16లోగా వారికి కేటాయించిన ట్రైనింగ్ సెంటర్లలో రిపోర్ట్ చేయాల్సిందిగా సూచించారు. వాస్తవానికి అక్టోబరు 23 నాటి ట్రైనీలకు ట్రైనింగ్ కాలేజీల అలాట్‌మెంట్ పూర్తయింది. ఈ మేరకు తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌తోపాటు అన్ని పోలీస్ ట్రైనింగ్ కాలేజీలకు డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని పీటీసీలకు సూచించారు.












Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.